@vaartanews @mvnewstv
www.mivaartanews.com
TGBIL/25/A0512

మన మీ.. వార్త
ప్రతి అక్షరం... ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక

MANA MI VARTA NEWS

శుక్రవారం
30 అక్టోబర్ 2026
సూర్యపేట, హైదరాబాద్

సంపుటి : 02
సంచిక : 117
పేజీలు : 12 వెల : 5/-

PUBLISHED AT SURYAPETA | HYDERABAD | KHAMMAM | KARIMNAGAR | MAHABOOBNAGAR | NALGONDA | NIZAMABAD | WARANGAL | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KURNOOL | MANGALAGIRI | NELLORE

వార్త
విలేకరులు కావలెను
తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న మీ వార్తాస్వామి తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను.
ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు,
నియోజకవర్గాల వారీగా ఆర్సీ ఇంచార్జీలు,
మండలాల వారీగా విలేకరులు కావలెను.
సీనియర్లకు ప్రాధాన్యం
కొత్తవారికీ అవకాశం ఉంటుంది
ఈ క్రింది నెంబర్లకు వాట్సప్ ద్వారా తమ వివరాలు పంపగలరు
91-8522888459 9515342857

వికసిత్ భారత్‌కు సమష్టి కృషి

- రాష్ట్రాభివృద్ధికి కేంద్రం సహకారం
- సీఎం రేవంత్‌రెడ్డి
- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం
- ఆర్ఆర్ఆర్‌తో హైదరాబాద్‌కు కొత్త ఊపు
- పెట్టుబడులకు తెలంగాణ అనుకూలం
- ఐటీ, ఫార్మా రంగాల్లో హైదరాబాద్ సత్తా



హైదరాబాద్

తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. కేంద్రం నిర్దేశించిన వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రం ముందుకు సాగుతోందని చెప్పారు. 2047 నాటికి భారత్ 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకుందని, అందులో తెలంగాణ మూడు ట్రిలియన్ డాలర్ల వాటాను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. దిల్లీలోని తాజ్ ప్యాలెస్‌లో నిర్వహించిన ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ సన్నాహక కార్యక్రమంలో ఆయన పెట్టుబడిదారులను ఉద్దేశించి ప్రసంగించారు. తెలంగాణ అభివృద్ధి విషయంలో కేంద్రంతో కలిసి ముందుకు సాగుతామని రేవంత్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి - మిగతా 11 లో



నీటి వృథాపై ఫిర్యాదు చేయండి

- 'పానీ' యాప్‌ను ప్రారంభించిన జలమండలి
- నీటి దుర్వినియోగాన్ని అరికట్టేందుకు కొత్త కార్యక్రమం
- ఫొటోలు, వీడియోలతో ఫిర్యాదు చేసే అవకాశం
- నీటిని వృథా చేస్తే జరిమానాలు
- 'సేవ్ వాటర్ వాలంటీర్'గా నమోదు చేసుకోవచ్చు

హైదరాబాద్

నగరంలో నీటి దుర్వినియోగాన్ని అరికట్టేందుకు హైదరాబాద్ జలమండలి ప్రత్యేక చర్యలు చేపట్టింది. ప్రజలను నీటి సంరక్షణలో భాగస్వాములను చేస్తూ 'పానీ' పేరుతో ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్.. జలమండలి ఎండీ అశోక్ రెడ్డితో కలిసి గురువారం జల మండలి కార్యాలయంలో ఈ యాప్‌ను ఆవిష్కరించారు. నీటి వృథాను అరికట్టడంతో పాటు తాగునీటి ప్రాధాన్యంపై - మిగతా 11 లో



పోలీసుల లాఠీలకు భయపడొద్దు

- నవంబర్ 1న ర్యాలీకి తరలిరండి
- ప్రజలకు రాహుల్ గాంధీ పిలుపు
- ఇండీ కూటమి నవంబర్ 1న తలపెట్టిన చలో దిల్లీ ర్యాలీలో ప్రతిఒక్కరూ పాల్గొనాలి
- తమ కుతంత్రాలను ప్రయోగించే దమ్ము బీజేపీకి లేదు
- దేశాన్ని కాపాడుకోవడానికి కలిసికట్టుగా నడుద్దాం



డిజిటల్ మోసాలకు బ్యాంకులే నష్టపరిహారం చెల్లించేలా జవాబుదారీగా చేయాలి


- బ్యాంకులే నష్టపరిహారం చెల్లించాలి
- అసాధారణ లావాదేవీలపై నిఘా
- తగ్గిన డిజిటల్ అరెస్ట్ కేసులు
- విద్యావంతులూ మోసపోతున్నారు
- డిజిటల్ అరెస్టులపై సీజేఐ ఆగ్రహం



మహువా మొయిత్రా పిటిషన్ కొట్టివేత

- సెబీకి ఆదేశాలు ఇవ్వలేమన్న సుప్రీం
- కొత్త నియంత్రణ విధానం సృష్టించలేం
- పెట్టుబడిదారుల వివరాలపై వాదనలు
- పారదర్శకతపై పిటిషనర్ ఆందోళన

ఎరుపెక్కిన ఆకాశం..



- ఛత్తీస్‌గఢ్‌లో పలుచోట్ల రక్తవర్ణంలోకి మారిన ఆకాశం
- అర్నబ్ తుపాను ప్రభావంతోనే ఈ పరిస్థితి అని నిపుణుల అంచనా
- 'స్ట్రేంజర్ థింగ్స్' సిరీస్‌తో పోలుస్తూ నెటిజన్ల వైరల్ పోస్టులు
- ఇనుము అధికంగా ఉండే ధూళి కణాలే దీనికి కారణమని వెల్లడి
- ఏపీ తీరాన్ని తాకిన అర్నబ్ తుపాను తీవ్ర నష్టాన్ని మిగిల్చిన వైనం

మార్చి నాటికి భారత్‌లో ఎండలతో 55 వేల మరణాల ముప్పు?

- ఎల్‌నినోపై కొత్త అంచనా!
- మార్చిలోనే ఎక్కువ మరణాలు సంభవించే అవకాశం ఉందని వెల్లడి
- ప్రపంచవ్యాప్తంగా 3.73 లక్షల మరణాల అంచనా
- నైజీరియాలో 56 వేల మరణాల ప్రమాదం ఉందన్న క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్
- ఎల్‌నినో ప్రభావం 2027 ప్రారంభం వరకు కొనసాగే అవకాశం





రైతుల ఆత్మహత్యలు పట్టవా?

- రాష్ట్రం కరువులో ఉంటే.. మూసీ సుందరీకరణ ఎందుకు?
- ప్రజల గొంతు నొక్కితే అదేనా పబ్లిక్ హియరింగ్?
- మూసీ ప్రాజెక్టు డీపీఆర్ ఏది?
- 10 టీఎంసీల నీటిని మూసీకి తరలించడంపై ఆగ్రహం
- మూసీ పేరుతో లక్షన్నర కోట్ల దోపిడీకి కుట్ర
- తాగునీటికి కటకట.. సుందరీకరణకు ప్రాధాన్యమా?
- కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ ధ్వజం

550 ఎకరాలు ప్రభుత్వానివే

- మియాపూర్ భూములపై సుప్రీం తీర్పు
- 23 ఏళ్ల వివాదానికి తెర
- ప్రైవేటు వ్యక్తుల అప్పీళ్లు కొట్టివేత
- ప్రభుత్వానికి అనుకూలంగా ధర్మాసనం తీర్పు



హైదరాబాద్

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మియాపూర్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 100, 101కు సంబంధించిన భూ వివాదంలో సుప్రీంకోర్టు కీలకతీర్పు వెలువరించింది. సుమారు 550 ఎకరాలకిపైగా విస్తీర్ణంలో ఉన్న ప్రభుత్వ భూములపై హక్కులు కోరుతూ ప్రైవేట్ వ్యక్తులు దాఖలు చేసిన అప్పీళ్లను కొట్టివేసింది. దీంతో వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములపై - మిగతా 11 లో



రబీ సాగుపై ఎల్‌నినో పంజా

- దేశవ్యాప్తంగా 59 శాతం పడిపోయిన గోధుమల సాగు
- ఆందోళనలో రైతులు!
- ఎల్‌నినో ఎఫెక్ట్ రబీ పంటల సాగుపైనా పడింది
- దేశంలో ఈ రబీ పంటల సాగు విస్తీర్ణం 28.26 లక్షల హెక్టార్ల నుంచి 18.02 లక్షల హెక్టార్లకు తగ్గింది



బంగాళాఖాతంలో కొత్త అల్పపీడనం

- అర్నబ్ తుపాను ప్రభావం నుంచి కోలుకోకముందే మరో ముప్పు
- దక్షిణ అండమాన్ సముద్రంలో కొత్త అల్పపీడనం
- రానున్న 48 గంటల్లో వాయుగుండంగా మారే అవకాశం
- నవంబర్ 2, 3 తేదీల్లో ఉత్తర, దక్షిణ కోస్తాంధ్రలో భారీ వర్షాలు
- కొత్త హెచ్చరికతో రైతులు, తీరప్రాంత ప్రజల్లో ఆందోళన

సంపాదకీయం

చదువుల వెనుక కార్పొరేట్ గ్రీడ్

ప్రాణం పోసే ఆసుపత్రి బాధ్యత మరిచిపోయి కార్పొరేట్ బిజినెస్ సెంటర్ గా మారిపోతే... మెడిసిన్స్ అమ్మాల్సిన మెడికల్ షాపు కసాయి దుకాణంగా రూపాంతరం చెందితే పరిస్థితి ఎంత ఘోరంగా ఉంటుందో చెప్పడానికి తాజాగా సుప్రీంకోర్టులో జరిగిన ఈ లీగల్ వార్ఫేరే ప్రత్యక్ష సాక్ష్యం. రూ. 11 వేల క్యాన్సర్ ఇంజెక్షన్ కోసం ఏకంగా రూ. 1,30,000 వసూలు చేయడం, రూ. 15 సెలైన్ డ్రిప్ లైన్ కోసం రూ. 250 పిండడం వంటి సంఘటనలు మన దేశంలోని కార్పొరేట్ హాస్పిటల్స్ చేస్తున్న రియల్ రోడ్‌సైడ్ రాబరీకి అద్దం పడుతున్నాయి. బాధితుడు స్వయంగా ఆ మందులు పంపిణీ చేసే డీలర్ అయి ఉండి, "సార్, నేనే ఈ మందులు సప్లై చేస్తాను, నన్ను కాపాడండి, నా దగ్గరున్న ఇంజెక్షనే వాడండి" అని కాళ్లావేళ్లా పడినా కరగని కార్పొరేట్ రాయి లాంటి మనస్తత్వాన్ని అత్యున్నత న్యాయస్థానం తీవ్రంగా ఎండగట్టింది. "ఇది సర్దుబాటు కాదు... పగటిదోపిడీ! దారిదోపిడీ" అంటూ జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం కేంద్ర ప్రభుత్వాన్ని, కార్పొరేట్ హాస్పిటల్ మాఫియాను కడిగేసింది.ఒక సామాన్యుడు లేదా మధ్యతరగతి పౌరుడు అత్యవసర సమయంలో ఆసుపత్రికి వెళ్తే చికిత్స కంటే ముందు బిల్లు చూసి హార్ట్ ఎటాక్ రావడం నేడు గ్యారెంటీగా మారింది. దీని వెనుక మెడిసిన్ చదివిన చదువుల వెనుక దాక్కున్న 'కార్పొరేట్ గ్రీడ్' స్పష్టంగా కనిపిస్తోంది. ఆసుపత్రిలో చేరిన భార్య కీమోథెరపీ కోసం ఆమె భర్త (స్వయంగా డ్రగ్ డిస్ట్రిబ్యూటర్) రూ. 11,000 ఖరీదు చేసే ఇంజెక్షన్‌ను ఆసుపత్రికి తెచ్చి తన వద్ద ఉన్నదే వాడాలని వేడుకున్నాడు. కానీ కార్పొరేట్ రూల్స్ పేరుతో దాన్ని తిరస్కరించిన యాజమాన్యం, తమ ఇన్‌హౌస్ ఫార్మసీ నుంచే దాన్ని కొనుగోలు చేయాలని నిర్బంధించి ఏకంగా రూ. 1,30,000 వసూలు చేసింది. అంటే కేవలం ఒక్క ఇంజెక్షన్‌పై ఏకంగా 1100% ప్రాఫిట్ మార్జిన్‌ను గుంజుకున్నారు. ఇక సెలైన్ ఐవీ సెట్, సిరంజీలు, కాటన్, సర్జికల్ గ్లౌజెస్, కాథెటర్స్ వంటి కన్యూమబుల్స్ విషయానికి వస్తే.. ఇవన్నీ హోల్‌సేల్ మార్కెట్‌లో కేవలం రూ. 10 నుంచి రూ. 15లకే లభిస్తాయి. కానీ కార్పొరేట్ ఆసుపత్రులు బాధితుడి పేషెంట్ ఫైల్‌లో వీటికి రూ. 200 నుంచి రూ. 350 వరకు బిల్లు వేస్తూ దోచుకుంటున్నాయి. తయారీ సంస్థ ఒక మందు లేదా సర్జికల్ ఐటమ్‌ను తయారు చేయడానికి అయ్యే ఖర్చు కేవలం రూ. 8 అయితే, దానికి ప్రింట్ చేసే ఎంఆర్‌పీ మాత్రం రూ. 100 లేదా రూ. 200 ఉంటుంది. హాస్పిటల్స్ ఈ ఎంఆర్‌పీ పక్కన బ్రాండ్ పేరు చూపిస్తూ, పేషెంట్ల నుంచి వందల రెట్లు ఎక్కువ డబ్బు గుంజుతున్నాయి.ఈ కేసు విచారణ సందర్భంలో కేంద్ర ప్రభుత్వం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి "మేము ధరల విధానాన్ని నిరంతరం సర్దుబాటు చేస్తూనే ఉన్నాం" అని వాదించగా, ధర్మాసనం హై-వోల్టేజ్ ఆక్రోశాన్ని వ్యక్తపరిచింది. "మీ సర్దుబాటు పూర్తిగా దారి తప్పింది! రూ. 11 వేల నుంచి రూ. 1.30 లక్షలు కావడాన్ని సర్దుబాటు అనరు... దోపిడీ అంటారు! మనుషుల ప్రాణాలతో ఆడుకునేటప్పుడు ఇంత పెట్టుబడిదారీ ఆలోచన ఉండాలా? నిస్సహాయ స్థితిలో ఉన్న రోగులకు ఆసుపత్రుల దగ్గర బేరమాడే శక్త్యాయుధాలు ఉండవని మరచిపోవద్దు" అని మండిపడింది. ప్రభుత్వ డ్రగ్ ప్రైస్ కంట్రోల్ ఆర్డర్ కింద అత్యవసర మందుల జాబితా ఉన్నప్పటికీ, మార్కెట్లోని 90 శాతానికి పైగా నాన్-షెడ్యూల్డ్ మందులు, లైఫ్ సేవింగ్ క్యాన్సర్ డ్రగ్స్, మెడికల్ డివైజెస్ ఈ కంట్రోల్ పరిధికి పూర్తిగా బయటే ఉన్నాయి. ప్రభుత్వం ఇటీవల క్యాన్సర్ మందులపై ట్రేడ్ మార్జిన్‌ను 30 శాతానికి క్యాప్ చేసినట్లు చెబుతున్నా, అసలు నోటిపై చేయని రూట్లలో ఎంఆర్‌పీలను ఇష్టారాజ్యంగా ప్రింట్ చేసుకునే సడలింపులను కంపెనీలు వాడుకుంటున్నాయి. మూడు పార్లమెంటరీ కమిటీలు నివేదికలిచ్చినా.. తెర వెనుక ఉన్న కార్పొరేట్ సూత్రధారులకు ఆ రిపోర్టులు నచ్చడం లేదు కాబట్టే ప్రభుత్వం మౌనంగా ఉండిపోతోందని ధర్మాసనం ఘాటుగా విమర్శించింది.వివిధ నేషనల్ అండ్ ఇంటర్నేషనల్ థింక్-ట్యాంక్స్, సర్వేల ప్రకారం భారతదేశంలో హెల్త్‌కేర్ దారిదోపిడీ ఏ స్థాయిలో ఉందో గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి..ప్రైవేట్ ఆసుపత్రుల అసోసియేషన్ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపిస్తూ, ప్రభుత్వ ఆసుపత్రులపై తీవ్ర ఒత్తిడి ఉంది కాబట్టే ప్రైవేట్ రంగం రాత్రింబవళ్లు సేవలు అందిస్తోందని, 24 గంటలూ సదుపాయాలు సిద్ధంగా ఉంచేందుకు కోట్ల రూపాయల నిర్వహణ ఖర్చు అవుతుందని చెప్పారు. మందుల మార్జిన్లు తగ్గించేస్తే ప్రైవేట్ ఆసుపత్రులు కుప్పకూలిపోతాయని, మార్కెట్లో సగం నకిలీ మందులు ఉన్నందున రోగులు బయటి నుంచి తెచ్చే మందులను తాము నమ్మలేమని వాదించారు. దీనిని సుప్రీంకోర్టు తీవ్రంగా తిప్పికొట్టింది. మీది కార్పొరేట్ హాస్పటల్... పడక రెంట్, డాక్టర్ ఫీజు, వెంటిలేటర్, ల్యాబ్ టెస్ట్‌లు... ప్రతిదానికీ వేర్వేరుగా ఛార్జీలు లాగుతున్నారు కదా... అలాంటప్పుడు మందులను 100%, 200%, 1000% రెట్లు ఎక్కువకు ఎందుకు అమ్మాలి? ప్రైవేట్ ఆసుపత్రి నడుపుతున్నామన్న కారణంతో ఈ ఎంఆర్‌పీని సమర్థించుకోలేరు. నిలదొక్కుకోవడానికి వేరే మార్గాలు చూసుకోండి కానీ, ప్రాణాలు కాపాడాల్సిన మందులపై ఈ దోపిడీ వద్దు... తయారీ సంస్థలు ఇచ్చే కార్పొరేట్ కట్-బాక్స్ డిస్కౌంట్ల గుట్టు ఇంకా బయటకు రాలేదు... అని తేల్చిచెప్పింది. ఆవిష్కరణల పేరుతో కంపెనీలు అధిక ధరలను సమర్థించుకోవడాన్ని తప్పుబడుతూ, గత 30 సంవత్సరాల్లో భారత ఫార్మా పరిశ్రమ సొంతంగా అభివృద్ధి చేసిన ఐదు కొత్త మాలిక్యూల్స్ పేర్లు చెప్పాలని ధర్మాసనం సవాల్ విసిరింది. అంటే విదేశీ పేటెంట్లను రీ-ప్యాకేజింగ్ చేసి, లాభాలు పిండుకోవడం తప్ప మన రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ శూన్యమని బట్టబయలు చేసింది.. ప్రధానమంత్రి జన్ ఔషధి కేంద్రాలు ఉన్నప్పటికీ, పెద్ద పెద్ద కార్పొరేట్ డాక్టర్లు జనరిక్ మందులు రాయకుండా, బ్రాండెడ్ ఫార్మా కంపెనీల స్పాన్సర్డ్ ట్రిప్స్ కోసం బ్రాండెడ్ మందులనే రాస్తూ పేషెంట్ల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.న్యాయవాది కిషన్ చంద్ జైన్ దాఖలు చేసిన ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ పూర్తి చేసిన సుప్రీంకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. నాన్-షెడ్యూల్డ్ మందులు, సర్జికల్ ఐటమ్స్, కన్యూమబుల్స్ ఉత్పత్తుల తయారీ ధరకు, రీటైల్ అమ్మకపు ధరకు మధ్య గరిష్టంగా 30% నుంచి 50% కంటే ఎక్కువ మార్జిన్ ఉండకుండా కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధ నిబంధన తీసుకురావాలి. పేషెంట్లు క్వాలిటీ చెక్ కలిగిన సర్టిఫైడ్ బయటి ఫార్మసీల నుంచి మందులు తెచ్చుకునే వెసులుబాటును ప్రైవేట్ ఆసుపత్రులు నిరోధించకుండా కఠిన చట్టాలు చేయాలి. వైద్యులు తమ ప్రిస్క్రిప్షన్లలో కేవలం కెమికల్ మాలిక్యూల్ నామం మాత్రమే రాయాలి తప్ప, ఫార్మా కంపెనీల బ్రాండ్ పేర్లు రాయకూడదనే నిబంధనను కఠినంగా అమలు చేయాలి. వైద్యం అనేది లాభాలు పిండుకునే బిజినెస్ మోడల్ కాదు... అది రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కు! ప్రాణాలను కాపాడాల్సిన ఆసుపత్రులే జేబులు గుల్ల చేసే కసాయి కొట్టలుగా మారితే, ఆ సమాజం వినాశనానికి దారితీస్తుంది. సుప్రీంకోర్టు ఇవ్వబోయే చారిత్రాత్మక తీర్పు భారతీయ హెల్త్‌కేర్ దోపిడీకి చెక్ పెడుతుందో లేదో వేచి చూడాలి!

బ్యాలెట్ ఎన్నికల్లో కాంగ్రెస్ జీరో



న్యూఢిల్లీ : నాలుగు ప్రధాన రాష్ట్రాల్లోని శాసనమండలి ఎన్నికల ఫలితాలు వెలువడిన వేళ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కాంగ్రెస్ పార్టీని లక్ష్యంగా చేసుకుని ట్విట్టర్ వేదికగా విసిరిన సెటైర్ వైరల్ అవుతోంది. ఈవీఎంలపై ఆరోపణలు చేస్తూ బ్యాలెట్ ఎన్నికలు కావాలంటున్న కాంగ్రెస్ కు తన ట్వీట్ తో మంట పుట్టించారు మోదీ. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్, కర్ణాటక వంటి నాలుగు పెద్ద రాష్ట్రాల్లో 28 ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. పైగా ఈ ఎన్నికలు బ్యాలెట్ పేపర్ల ద్వారానే జరిగాయి.. కాంగ్రెస్ పార్టీ ఎన్ని సీట్లు గెలుచుకుందో ఊహించండి? అంటూ ప్రధాని మోదీ సంధించిన ప్రశ్న నెట్టింట వైరల్ అవుతోంది. ఏ ఎన్నికల్లో ఓడిపోయినా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పై నెపం నెట్టేసే కాంగ్రెస్ పార్టీకి.. బ్యాలెట్ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా దక్కకపోవడాన్ని పరోక్షంగా ఎత్తిచూపుతూ మోదీ వేసిన సెటైర్ కాంగ్రెస్‌కు సూటిగా తగులుతోంది.ఎన్నికల ఫలితాల్లో ఎన్డీయే కూటమి తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించగా, కాంగ్రెస్ పార్టీ పోటీ చేసిన నాలుగు రాష్ట్రాల్లో కలిపి ఒక్కటంటే ఒక్క స్థానాన్ని కూడా గెలుచుకోలేక పూర్తిగా జీరో వద్దే చతికిలపడింది. సొంతంగా అధికారంలో ఉన్న కర్ణాటకలోనూ కాంగ్రెస్‌కు పరాభవం తప్పలేదు. అక్కడ బీజేపీ-జేడీఎస్ కూటమి మెజార్టీ స్థానాలను కైవసం చేసుకుంది. ఇక ఉత్తరప్రదేశ్, బిహార్, మహారాష్ట్రల్లో బీజేపీ నేతృత్వంలోని కూటమి అభ్యర్థులు స్పష్టమైన ఆధిక్యతతో విజయధ్వంకా మోగించారు. విద్యావంతులు, పట్టభద్రులు, ఉపాధ్యాయ వర్గాలు ఓటర్లుగా ఉన్న ఈ స్థానాల్లో కాంగ్రెస్ కనీస పోటీ కూడా ఇవ్వలేకపోవడం ఆ పార్టీ కేడర్‌ను తీవ్ర నైరాశ్యంలోకి నెట్టింది.కాంగ్రెస్ పార్టీ , ఇండియా కూటమి పక్షాలు ఎన్నికల ఓటములను కప్పిపుచ్చుకునేందుకు ఈవీఎం ట్యాంపరింగ్ ఆరోపణలను ప్రధాన అస్త్రంగా వాడుతున్నాయి. దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, ఈవీఎంలను తొలగించి మళ్లీ పాత పద్ధతి అయిన బ్యాలెట్ పేపర్లతోనే ఎన్నికలు నిర్వహించాలని రాహుల్ గాంధీ సహా కాంగ్రెస్ అగ్రనేతలు నిరంతరం ఉద్యమిస్తున్నారు. విపక్షాలు కోరుకున్నట్లుగానే బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించినా ప్రజలు కాంగ్రెస్‌ను తిరస్కరించారన్న నిజాన్ని ప్రధాని మోదీ తనదైన శైలిలో తేటతెల్లం చేశారు. ఓటమికి కారణం యంత్రాలు కాదని, కాంగ్రెస్ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలేనన్న స్పష్టమైన సంకేతాన్ని ఆయన ఈ చిన్న ట్వీట్‌తో దేశ ప్రజల ముందుంచారు.బ్యాలెట్ పేపర్లతో ఓటింగ్ జరిగినా ఖాతా తెరవలేకపోయిన కాంగ్రెస్.. ఇకపై దేనిని బూచిగా చూపిస్తుందో చెప్పాలంటూ బీజేపీ నేతలు తీవ్రస్థాయిలో ఎదురుదాడి ప్రారంభించారు. ప్రధాని మోదీ సంధించిన ఈ ఒక్క చురకతో అటు కాంగ్రెస్ నైతిక స్థైర్యం దెబ్బతినడమే కాకుండా, రాబోయే రోజుల్లో ఈవీఎంలపై రచ్చ చేసేందుకు విపక్షాలకు రాజకీయంగా నోరు మెదపలేని పరిస్థితి ఏర్పడింది.

కాంగ్రెస్‌కు సున్నా...

దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో జరిగిన శాసనమండలి సభ్యుల ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి నిరాశను మిగిల్చాయి. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ఖాళీ అయిన 28 ఎమ్మెల్సీ స్థానాల్లో పోటీ చేసిన కాంగ్రెస్ ఒక్క స్థానాన్ని కూడా గెలుచుకోలేక బోణీ కొట్టకుండానే వెనుదిరిగింది. మరీ ముఖ్యంగా తమ సొంత పాలనలో ఉన్న కర్ణాటకలో సీటింగ్ ఎమ్మెల్సీ స్థానాన్ని సైతం కోల్పోవడం ఆ పార్టీకి మింగుడుపడని పరిణామంగా మారింది. అధికారం చేతిలో ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఓటమిని మూటగట్టుకోవడం హస్తం పార్టీ శ్రేణులను తీవ్రగ్లానికి గురిచేసింది.ఈ ఎమ్మెల్సీ ఎన్నికలన్నీ బ్యాలెట్ పత్రాల ద్వారానే జరుగుతాయి. సాధారణంగా ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రత్యక్షంగా సమగ్ర ప్రజాతీర్పును ప్రతిబింబించనప్పటికీ, ప్రాంతీయంగా రాజకీయ సమీకరణాలు, అధికార పంపిణీ , పార్టీ సంస్థాగత బలాబలాలను అంచనా వేయడానికి స్పష్టమైన దిశానిర్దేశం చేస్తాయి. ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పట్టభద్రులు ఓటర్లుగా ఉండే ఈ ఎన్నికల్లో 28కి ఒక్క సీటు కూడా సాధించలేకపోవడం కాంగ్రెస్ క్షేత్రస్థాయి మేనేజ్‌మెంట్ వైఫల్యాన్ని ఎత్తిచూపుతోంది. మిత్రపక్షాలతో సమన్వయం లోపించడం, ప్రత్యర్థుల వ్యూహాలను తిప్పికొట్టలేకపోవడమే ఈ ఘోర పరాభవానికి ప్రధాన కారణమం.పార్టీ అగ్రనాయకత్వం జాతీయ స్థాయి రాజకీయాలు, ర్యాలీలపైనే ఎక్కువ దృష్టి పెడుతూ క్షేత్రస్థాయిలోని నెట్‌వర్క్‌ను పూర్తిగా గాలికి వదిలేసిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బూత్ స్థాయి నుంచి స్థానిక సంస్థల వరకు బలమైన యంత్రాంగం లేకపోవడం వల్లనే ఇటువంటి ఎన్నికల్లో కాంగ్రెస్ తేలిపోతోంది. ప్రతిపక్షాల వ్యూహాత్మక ఓటింగ్, ఆకర్షణీయమైన అభ్యర్థుల ఎంపికతో ప్రత్యర్థులు పైచేయి సాధిస్తుంటే, కాంగ్రెస్ మాత్రం అంతర్గత విభేదాలు మరియు అనాలోచిత నిర్ణయాలతో మూల్యం చెల్లించుకుంటోంది. 28 స్థానాల్లో సున్నా ఫలితం రావడం అనేది కాంగ్రెస్ పార్టీ ఏమాత్రం ఉపేక్షించలేని తీవ్రమైన హెచ్చరిక. స్థానిక స్థాయిలో అధికార సమీకరణాలు మారడం ,పార్టీ యంత్రాంగం బలహీనపడటం కాంగ్రెస్ కుగడ్డు కాలం ఇంకాపోలేదని నిరూపిస్తున్నాయి. ఈ పరాభవం నుంచి వెంటనే పాఠాలు నేర్చుకుని, సంస్థాగత లోపాలను సరిదిద్దుకోకపోతే కాంగ్రెస్ భవిష్యత్తులో మరింత భారీ వెనుకబాటును ఎదుర్కోక తప్పదు. ఎప్పుడు చూసినా ఓటు చోరీ అంటూ వ్యవస్థలపై పోరాటం చేయడం తప్ప..ప్రజల తరపున పోరాటం చేయని కాంగ్రెస్కు ఇదిఇబ్బందికరమే.

యూపీలో టగ్ ఆఫ్ వార్...
కమలానికి డేంజర్ బెల్స్



ఉత్తరప్రదేశ్ శాసనమండలి ద్వైవార్షిక ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. బీజేపీకి తిరుగులేని కంచుకోటలుగా భావించే పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాల్లో ప్రధాన ప్రతిపక్షమైన సమాజ్‌వాదీ పార్టీ చొచ్చుకుపోయింది. మొత్తం 11 స్థానాలు 5 గ్రాడ్యుయేట్స్, 6 టీచర్స్ నియోజకవర్గాలకు జరిగిన ఎన్నికల్లో అధికార బీజేపీ 5 స్థానాలను గెలుచుకోగా, అఖిలేష్ యాదవ్ నేతృత్వంలోని ఎస్పీ 4 స్థానాల్లో జయకేతనం ఎగురవేసింది. కేవలం ఒక్క సీటు తేడాతో అధికార పార్టీ మెజార్టీని అడ్డుకోవడమే కాకుండా, విద్యావంతులు, ఉద్యోగుల వర్గాల్లో ప్రభుత్వ వ్యతిరేకత ఏ స్థాయిలో ఉందో ఈ ఫలితాల ద్వారా ఎస్పీ స్పష్టమైన రాజకీయ సందేశాన్ని పంపింది.ఈ ఫలితాల్లో అత్యంత విస్మయకరమైన అంశం ప్రధాని నరేంద్ర మోదీ లోక్‌సభ నియోజకవర్గమైన వారణాసి ఉపాధ్యాయ స్థానాన్ని ఎస్పీ కైవసం చేసుకోవడం. కాషాయ పార్టీకి కంచుకోట లాంటి వారణాసిలో బీజేపీ అభ్యర్థిని మట్టికరిపిస్తూ ఎస్పీ అభ్యర్థి లాల్ బిహారీ యాదవ్ సాధించిన విజయం లక్నో నుంచి ఢిల్లీ దాకా చర్చనీయాంశంగా మారింది. అంతేకాకుండా మేధావులు, విద్యావంతులకు కేంద్రమైన అలహాబాద్-ఝాన్సీ గ్రాడ్యుయేట్స్ స్థానంతో పాటు ఆగ్రా డివిజన్లలో సైతం సమాజ్‌వాదీ పార్టీ విజయదుందుభి మోగించింది. సీఎం యోగి ఆదిత్యనాథ్ ఇలాకా గోరఖ్‌పూర్, మీరట్ తదితర స్థానాల్లో బీజేపీ బయటపడినప్పటికీ.. గతంలో ఎన్నడూ లేని విధంగా పట్టభద్రుల స్థానాల్లో ఎస్పీ సాధించిన ఈ స్ట్రైక్ రేట్ కమలనాథులను ఆత్మరక్షణలోకి నెట్టింది.సాధారణంగా ఉపాధ్యాయ, పట్టభద్రుల స్థానాలంటే బీజేపీ, ఆరెస్సెస్ అనుబంధ సంఘాలకే మొదటి ప్రాధాన్యత ఉంటుందన్న సంప్రదాయానికి ఈ ఫలితాలు గండికొట్టాయి. నిరుద్యోగ సమస్య, పాత పెన్షన్ స్కీమ్ పునరుద్ధరణ డిమాండ్, కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల సర్వీస్ క్రమబద్ధీకరణ వంటి క్షేత్రస్థాయి అంశాలను ఎస్పీ ఎన్నికల అస్త్రాలుగా మార్చుకోవడంలో పూర్తిస్థాయిలో సఫలీకృతమైంది. యువత, మధ్యతరగతి ఉద్యోగ వర్గాల్లో నెలకొన్న అసంతృప్తిని ఓట్ల రూపంలో మలచుకోవడంలో అఖిలేష్ యాదవ్ నెరిపిన సైలెంట్ ఆపరేషన్ తిరుగులేని ఫలితాన్ని ఇచ్చింది.కేవలం యాదవులు, మైనార్టీల ఓటు బ్యాంకు మాత్రమే కాకుండా.. విద్యావంతులు, పట్టభద్రులు, ఉపాధ్యాయ వర్గాల్లోనూ తమకు తిరుగులేని ఆమోదం లభిస్తోందని ఈ 4 ఎమ్మెల్సీ విజయాల ద్వారా ఎస్పీ నిరూపించుకుంది. రాబోయే ఎన్నికలకు ముందు విపక్ష శ్రేణుల్లో ఈ విజయం కొత్త ఊపును తీసుకురాగా, పట్టణ-విద్యావంతుల ఓటర్లను తిరిగి ప్రసన్నం చేసుకునేందుకు సరికొత్త వ్యూహాలు రచించాల్సిన అనివార్యతలోకి అధికార బీజేపీ వెళ్లిపోయింది

ఉమ్మడి చిల్కానగర్ డివిజన్‌లో రూ.49.75 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

- అభివృద్ధిలో దూసుకుపోతున్న చిల్కానగర్, బీరప్పగడ్డ డివిజన్లు

- కాలనీలు, బస్తీల అభివృద్ధికి నిరంతరం నిధులు కేటాయిస్తున్నాం: ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్, అక్టోబర్ 29 (మన మీ వార్త):

ఉప్పల్ నియోజకవర్గంలోని ఉమ్మడి చిల్కానగర్ డివిజన్ పరిధిలో రూ.49.75 లక్షల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. చిల్కానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్‌తో పాటు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన వివిధ ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా బీరప్పగడ్డ డివిజన్ పరిధిలోని ఇంద్రానగర్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి, సాయిరాం నగర్ కాలనీలోని కమ్యూనిటీ హాల్‌కు సంబంధించిన పెండింగ్ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే చిల్కానగర్ డివిజన్ పరిధిలోని ఆదర్శ్ నగర్ కాలనీలో నూతన డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణానికి, చిల్కానగర్ బొడ్రాయి వెనుక వీధిలో మరో నూతన డ్రైనేజీ పైప్‌లైన్ ఏర్పాటుకు పనులు ప్రారంభించారు. ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు
ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గంలోని ఇతర





డివిజన్లతో పోలిస్తే చిల్కానగర్, బీరప్పగడ్డ డివిజన్లలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ఆయా డివిజన్లలో మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం నిధులు కేటాయిస్తూ కాలనీలు, బస్తీలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన రహదారులు, డ్రైనేజీ వ్యవస్థలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని వివరించారు. మాజీ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కాలనీ అసోసియేషన్ సభ్యులతో సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి పనుల అమలుకు కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ఆమె నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ కాలనీలు, బస్తీల సమస్యల పరిష్కారానికి కృషి చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. దశలవారీగా మిగిలిన పనులు పూర్తి చేస్తాం

మాజీ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ మాట్లాడుతూ చిల్కానగర్ డివిజన్‌లో ఇప్పటివరకు సుమారు 85 శాతం అభివృద్ధి పనులు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన పనులను కూడా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారంతో దశలవారీగా పూర్తి చేస్తామని వెల్లడించారు. చిల్కానగర్ డివిజన్ అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తూ సహకరిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఎమ్మెల్యే నిరంతరం కృషి చేస్తున్నారని, ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటున్నారని కొనియాడారు. నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో చిల్కానగర్, బీరప్పగడ్డ డివిజన్లకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జాతీయ సదస్సులో పరిశోధనా పత్రం సమర్పించనున్న డా. సంకినేని వెంకటయ్య

హనుమకొండ అక్టోబర్ 29(మల్లేష్ మీవార్త ప్రతినిధి) :

హైదరాబాద్‌లోని డా. ఎం.సి.ఆర్. మానవ వనరుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అక్టోబర్ 30, 31 తేదీల్లో నిర్వహించనున్న రెండు రోజుల జాతీయ సదస్సులో కాకతీయ విశ్వవిద్యాలయ రాజనీతి శాస్త్ర అధ్యాపకులు డా. సంకినేని వెంకటయ్య పరిశోధనా పత్రాన్ని సమర్పించనున్నారు. “ఆర్థిక వృద్ధి, సుస్థిర అభివృద్ధి మరియు ప్రజా విధానం” అనే ప్రధాన అంశంపై నిర్వహించనున్న ఈ సదస్సుకు “ఆవిష్కరణలు, విధానాలు మరియు సుపరిపాలన ద్వారా సుస్థిర ఆర్థిక వ్యవస్థల నిర్మాణం” అనే ఉపశీర్షికను నిర్ణయించారు. ఈ సదస్సులో భాగంగా డా. సంకినేని వెంకటయ్య “గ్రామీణాభివృద్ధి మరియు స్థానిక స్వపరిపాలన: సుస్థిర ఆర్థిక వృద్ధి, సమ్మిళిత మౌలిక సదుపాయాల అభివృద్ధికి మార్గాలు” అనే అంశంపై తన పరిశోధనా పత్రాన్ని సమర్పించనున్నారు. గ్రామీణ ప్రాంతాల సమగ్ర



అభివృద్ధి, స్థానిక స్వపరిపాలనా సంస్థల పాత్ర, సుస్థిర ఆర్థిక వృద్ధి, సమాన అభివృద్ధి అవకాశాలు తదితర అంశాలను ఆయన తన పరిశోధనలో విశ్లేషించనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు పంచాయతీరాజ్ సంస్థలు, స్థానిక పాలనా వ్యవస్థలు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో పోషించే పాత్రను ఈ పరిశోధనలో చర్చించనున్నారు. అలాగే ఆర్థిక అసమానతలను తగ్గించడం, వెనుకబడిన వర్గాలకు అభివృద్ధి ఫలాలను అందించడం, ప్రజల భాగస్వామ్యంతో సుస్థిర అభివృద్ధిని సాధించే మార్గాలపై దృష్టి సారించనున్నారు. డా. సంకినేని వెంకటయ్య ప్రస్తుతం కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఉమెన్స్ పీజీ కాలేజీలో వైస్ ప్రిన్సిపాల్‌గా, అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గతంలో కాకతీయ విశ్వవిద్యాలయం రాజనీతి శాస్త్ర విభాగాధిపతిగా కూడా సేవలందించారు. ఆర్థిక వృద్ధి, సుస్థిర అభివృద్ధి, ప్రజా విధానాలు, సుపరిపాలన వంటి కీలక అంశాలపై విద్యావేత్తలు, పరిశోధకులు, విధాన రూపకర్తల మధ్య చర్చలకు ఈ జాతీయ సదస్సు వేదిక కానుంది. ఈ సదస్సులో డా. సంకినేని వెంకటయ్య పరిశోధనా పత్రం గ్రామీణాభివృద్ధి, స్థానిక స్వపరిపాలనకు సంబంధించిన అంశాలపై చర్చకు దోహదపడనుంది.

పశువుల నీటి తొట్టెల నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలి: ఎంపీడీవో అద్వైత

ఖానాపురం, అక్టోబర్ 29 (మల్లేష్ మీవార్త ప్రతినిధి):

ఖానాపురం మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో పశువుల నీటితొట్టెల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని ఎంపీడీవో వి. అద్వైత సూచించారు.ఖానాపురం మండలం ధర్మారావుపేట గ్రామపంచాయతీలోని పల్లె ప్రకృతి వనం, దేవాలయ ప్రాంగణం వద్ద రెండు ప్రాంతాల్లో పశువుల నీటి తొట్టెల నిర్మాణానికి ఎంపీడీవో వి. అద్వైత, సర్పంచ్ ఎం. వెంకన్న మార్కింగ్ పనులు చేపట్టారు.ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో పశువుల కోసం నీటి తొట్టెల నిర్మాణానికి అనువైన ప్రదేశాలను గుర్తించి, మార్కింగ్ పనులు పూర్తి చేసి, నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఖానాపురం గ్రామపంచాయతీలో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు.

నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి

ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీటి వనరుల సంరక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీడీవో సూచించారు. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు జలసిరి పనులను మిషన్ మోడ్‌లో చేపట్టాలని ఆదేశించారు. ప్రతి నీటి చుక్కను పొదుపుగా వినియోగిస్తూ, నీటి వృథాను పూర్తిగా అరికట్టాలని తెలిపారు. గ్రామాల్లో నీటి వృథాపై ప్రజలకు అవగాహన కల్పించాలని, నీటిని వృథా చేసే వారిపై నిబంధనల ప్రకారం రూ.500 నుంచి రూ.1,000 వరకు జరిమానా విధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్తులో నీటి కొరత తలెత్తకుండా



గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీవో పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, ఈసీ అరుణ్, టీఏ వీరబాబు, ఎఫ్ఏ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ కాన్ఫరెన్స్ కు రావాల్సిందిగా ఢిల్లీ మంత్రి రవీందర్ సింగ్ కు ఆహ్వానం

---ఆహ్వాన పత్రాన్ని అందజేసిన బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ, టేకి రాజశేఖర్

హైదరాబాద్, అక్టోబర్ 29 (మన మీ వార్త):

బహుజన సాహిత్య అకాడమీ నేషనల్ కమిటి ఆధ్వర్యంలో నవంబర్ 15 వ తేదీన న్యూ ఢిల్లీ లో నిర్వహించబోయే బహుజన రైటర్స్ 20 వ నేషనల్ కాన్ఫరెన్స్ కు రావాల్సిందిగా ఢిల్లీ రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి రవీందర్ ఇంద్రాజ్ సింగ్ ను ఆహ్వానించిన బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ తెలంగాణ జాయింట్ సెక్రెటరీ టెకి రాజశేఖర్ లు ఆహ్వానించారు. గురువారం ఢిల్లీ లోని రాజ్ నివాస్ మార్గ్ నందుగల మినిస్టర్ క్వార్టర్స్ నందు కలిసి కాన్ఫరెన్స్ కు సంబంధించిన వివరాలు తెలియ జేయడం జరిగింది. బహుజన సాహిత్య అకాడమీ దేశం లో 28 రాష్ట్రాలలో.. ప్రపంచం లో 10 దేశాల విస్తరించి ఉన్నదని ఆయా ప్రాంతాల నుండి సుమారుగా 1000 మంది డెలివేట్స్ ఈ కాన్ఫరెన్స్ కు హాజరవుతారని తెలియ జేశారు. ఉదయం 10 గంటలకు ప్రారంభయ్యే ఈ కాఫరెన్స్ సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతుందని తెలియ జేశారు. కళాకారుల, నృత్యకారుల మరియు కవులు రచయితల చే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించ బడుతాయనీ తెలియ జేశారు. మంత్రి తో పాటుగా ఢిల్లీ కరోల్ బాగ్ ఎమ్మెల్యే విశేష్ రవిజి , భారత ప్రభుత్వ సెంట్రల్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ సుధారాణి రేలంగి ఐ ఎల్ ఎస్ లను కూడా ఆహ్వానించడం జారినట్లు తెలియ జేశారు.





ధర్మారావుపేటలో వీవో భవన నిర్మాణానికి భూమిపూజ



ఖానాపురం, అక్టోబర్ 29 (మల్లేష్ మీవార్త ప్రతినిధి):

ఖానాపురం మండలంలోని ధర్మారావుపేట గ్రామంలో రూ.10 లక్షల నిధులతో మహిళా సంఘం వీవో భవన నిర్మాణానికి నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ వల్లే శ్రీనివాస్ యాదవ్ మహిళా సంఘాల సభ్యులతో కలిసి గురువారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నియోజకవర్గ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ప్రత్యేక చొరవతో మహిళా సంఘం వీవో భవన నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. భవన నిర్మాణ పనులను త్వరితగతిన చేపట్టి మూడు నెలల్లో పూర్తి చేయాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు ముదురు కుమారస్వామి, ఉపసర్పంచ్ కొనుకటి రాజు, నాయకులు జలేంద్రచారి, కొనకటి రామ్‌రెడ్డి, సత్యనారాయణ, గోనె రవీందర్, కొనుకటి మోహన్, ఎర్రబెల్లి వెంకటేశ్వర్లు, వెంకన్న, సోమయ్య, జంగిలి వెంకటేశ్వర్లు, ధరంసోత్తు బాలు, బాలకృష్ణ, భూక్య లాలు, సీఏలు రేణుక, ప్రమీల, సమత, వీవో అధ్యక్షులు సుకన్య, శ్రీలత, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆశీస్సులు పొందిన గడ్డం రవికుమార్ ఆశీర్వచనంతో పాటు ప్రసాదం అందజేసిన టీటీడీ ఈవో ఎం. రవిచంద్ర

- ప్రత్యేక దర్శనం అనంతరం టీటీడీ ఈవో చేతుల మీదుగా ఆశీర్వచనం, ప్రసాదం స్వీకరణ

హైదరాబాద్, అక్టోబర్ 29 (మన మీ వార్త):

ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని గురువారం గడ్డం రవికుమార్, డైరెక్టర్





త్రినాథరావు నక్కిన, వై వి రెడ్డి లు ప్రత్యేకంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారి సేవలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం తిరుమల తిరుపతి దేవస్థానాల (టీటీడీ) ఈవో ఎం. రవిచంద్రను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టీటీడీ ఈవో ఎం. రవిచంద్ర తన చేతుల మీదుగా వారికి స్వామివారి ఆశీర్వచనంతో పాటు తీర్థప్రసాదాలను అందజేశారు. స్వామివారి దర్శనం అనంతరం ఈవో నుంచి ఆశీర్వచనం, ప్రసాదం అందుకోవడం పట్ల గడ్డం రవికుమార్ సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ త్రినాథరావు నక్కిన, వై.వి. రెడ్డి తదితరులు పాల్గొన్నారు. శ్రీవారి దర్శనం, ఆశీర్వచనం భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని, మనశ్శాంతిని అందిస్తాయని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

ప్రెస్ క్లబ్ బైలా సవరణకు కమిటీ నియామకం.

మన మీ వార్త అక్టోబర్ 29 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ బైలాకు సవరణలు చేసేందుకు కమిటీ వేస్తున్నట్లు అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారం సదయ్య, కోశాధికారి బోల్ల అమర్ లు ప్రకటించారు. ప్రెస్ క్లబ్ వ్యవస్థాపక సభ్యులు పీవీ మదన్ మోహన్ కన్వీనర్ గా సీనియర్ జర్నలిస్టులు వల్లాల వెంకటరమణ, బొక్క దయాసాగర్, సంగోజు రవి, తడక రాజ్ నారాయణ, కక్కెర్ల అనిల్ కుమార్, కంకణాల సంతోష్ లు సభ్యులుగా కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 1991 నుండి బైలాకు జరిగిన సవరణలకు చట్టబద్ధత లేకపోవటం వల్ల తలెత్తుతున్న ఇబ్బందులను తొలగించటం కోసం, ప్రెస్ క్లబ్ సభ్యత్వాలు, ఎన్నికలు, నిర్వహణ తదితర అంశాలపై పూర్తిగా సవరణలు చేసేందుకు గాను ఇటీవల ప్రెస్ క్లబ్ కార్యవర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం ఈ కమిటీ వేశామని, బైలాకు సవరణలు చేయుటకు అందరితో సంప్రదింపులు జరిపి, పకడ్బందీగా సవరణలు రూపొందించి, బైలాకు చట్టబద్ధత కల్పించే దిశగా కమిటీ కృషి చేయాలని కోరారు. వీలైనంత త్వరగా కమిటీ, ప్రెస్ క్లబ్ కమిటీకి నివేదిక సమర్పించాలని కోరారు. ఆ నివేదిక ఆధారంగా జనరల్ బాడీ ఆమోదం,రిజిస్ట్రేషన్ పూర్తి చేసి తదుపరి కార్యాచరణకు పూనుకుంటామని చెప్పారు.

రూ.2.50 కోట్లతో బాక్స్ డ్రైన్ పనులకు శ్రీకార

- మైనంపల్లి హనుమంత్ రావ్ నాయకత్వంలో ప్రారంభం పర్యవేక్షణలో తుడిమెళ్ల మల్లిఖార్జున్

కౌకూర్, అక్టోబర్ 29:(వార్త ప్రతినిధి)

యాప్రాల్ డివిజన్ పరిధిలోని కౌకూర్ కింది బస్తీలో నివాసితులను వేధిస్తున్న వరద నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు పడ్డాయి.



ప్రియదర్శిని ఎన్ క్లేవ్, పోచమ్మ ఆలయం సమీపంలోని పాత నాలా నుంచి వరద నీరు సజావుగా ప్రవహించేలా రూ. 2.50 కోట్ల వ్యయంతో బాక్స్ డ్రైన్ నిర్మాణ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు నాయకత్వంలో, మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ సహకారంతో ఈ పనులు చేపట్టారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు, సామాజిక కార్యకర్త తుడిమెళ్ల మల్లిఖార్జున్ గత ఏడాది వర్షాకాలం నుంచి ఈ సమస్యపై అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరిపి పనులు మంజూరు చేయించారు.

ఈ సందర్భంగా ఎంఎంసి అధికారులు రాజు లక్ష్మణ్, ణజు పద్మలత, రాజు సత్యలక్ష్మి, వర్క్ ఇన్ స్పెక్టర్ చంద్రశేఖర్ లు క్షేత్రస్థాయిలో పరిశీలనలు జరిపి అలైన్ మెంట్ ఖరారు చేశారు. తుడిమెళ్ల మల్లిఖార్జున్ మాట్లాడుతూ “మైనంపల్లి హనుమంత్ రావ్ ఆశీస్సులతో కౌకూర్ లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నాం. ఈ బాక్స్ డ్రైన్ పూర్తయితే కింది బస్తీలో వరద నిల్వ సమస్య పూర్తిగా తొలగిపోతుంది” అని అన్నారు. కార్యక్రమంలో అల్లి సత్యనారాయణ, అల్లి మల్లేష్, గోమారం అంజిరెడ్డి, ఆసిఫుల్లా ఖాన్, గోమారం ప్రభాకర్ రెడ్డి, అల్లి శ్రీకాంత్, ఆకుల సత్తి, ప్రవీణ్ రెడ్డి, కాంట్రాక్టర్ బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌లో మద్యం సేవించిన లైన్ ఇన్స్పెక్టర్ .. ?

ఖానాపురం అక్టోబర్ 29(మీ వార్త ప్రతినిధి) :



నిత్యం అప్రమత్తంగా ఉంటూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా విధులు నిర్వహించాల్సిన సబ్‌స్టేషన్‌లో ఓ లైన్ ఇన్స్పెక్టర్ మద్యం సేవించినట్లు ఆరోపణలు రావడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. నర్సంపేట డివిజన్ పరిధిలోని ఖానాపురం మండలం మంగళారిపేట గ్రామంలోని సబ్‌స్టేషన్‌లో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు సమాచారం.వివరాల్లోకి వెళితే.. బుధరావుపేట గ్రామానికి లైన్ ఇన్స్పెక్టర్‌గా రాజు విధులు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. గురువారం సబ్‌స్టేషన్‌కు వెళ్లిన స్థానికులు, సదరు లైన్ ఇన్స్పెక్టర్ మరికొందరితో మద్యం సేవిస్తున్నట్లు గుర్తించినట్లు సమాచారం. విధి నిర్వహణ సమయంలో ఇలాంటి ఘటన చోటుచేసుకోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై ఖానాపురం ఏఈ మంగమ్మను వివరణ కోరగా, సబ్‌స్టేషన్‌లో లైన్ ఇన్స్పెక్టర్ మద్యం సేవించినట్లు ఆరోపణలు వచ్చిన విషయం ఆలస్యంగా తన దృష్టికి వచ్చిందని తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి తన పైఅధికారులకు సమాచారం అందించినట్లు వెల్లడించారు.

నిబంధనలు పాటిస్తేనే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల జారీ: : బల్దియా కమిషనర్ టి .వెంకన్న

మన మీ వార్త అక్టోబర్ 29 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



భవన నిర్మాణ సంబంధ నిబంధనలు ఖచ్చితం గా పాటిస్తేనే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ లు జారీ చేస్తామని బల్దియా కమిషనర్ టి .వెంకన్న స్పష్టం చేశారు. గురువారం నగరంలోని గొర్రెకుంట, విద్యుత్‌నగర్, నక్కలగుట్ట,



సిద్ధార్థనగర్, గోపాల్‌పూర్, వడ్డేపల్లి, ప్రశాంత్‌నగర్ ప్రాంతాల్లో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల జారీ కోసం భవన నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, కొలతలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, తెలంగాణ మున్సిపాలిటీల చట్టం--2019, సంబంధిత భవన నిర్మాణ నిబంధనలకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. అనుమతి పొందిన ప్లాన్ (నక్షా) ప్రకారమే నిర్మాణాలు చేపట్టాలని, నిబంధనల ఉల్లంఘనలను గుర్తిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ పర్యటనలో సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, టీపీఎస్‌లు ప్రశాంత్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగ హక్కుల దండోరా భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు గా ఎలుకటి రాజయ్య మాదిగ..



టేకుమట్ల అక్టోబర్ 29 మన మీ వార్త

మాదిగ హక్కుల దండోరా భూపాలపల్లి జిల్లా అధ్యక్షులుగా ఎలుకటి రాజయ్య మాదిగ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు కొంగరి శంకర్ మాదిగ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు కొంగరి శంకర్ మాదిగ మాట్లాడుతూ మాదిగ హక్కుల దండోరా సంఘం ఆశయాలు,సిద్ధాంతాలు, మాదిగ హక్కుల సిద్ధాంతాల పట్ల నిబద్ధతతో పని చేస్తూ, సంఘాన్ని బలోపేతం చేస్తూ, మాదిగ హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేయాలని జిల్లా అధ్యక్షులకు ఆయన దిశానిర్దేశం చేశారు. అనంతరం నూతన జిల్లా అధ్యక్షులు ఎలుకటి రాజయ్య మాదిగ మాట్లాడుతూ, జిల్లా అధ్యక్షులుగా నియమించిన రాష్ట్ర అధ్యక్షులు కొంగరి శంకర్ మాదిగ, మరియు రాష్ట్ర కమిటీ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.నిత్యం మాదిగ హక్కులు సాధన కోసం కృషి చేస్తానని ఆయన తెలిపారు.

బీఆర్ఎస్‌కు షాక్.. కాంగ్రెస్‌లోకి చేరుక

- చర్లపల్లి గ్రామ సర్పంచ్ శ్రీమతి బండి రేణుక శంకర్

అక్టోబర్ 30,10,2026 పరకాల ప్రతినిధి మన మీ వార్త



హనంకొండ జిల్లా నడికూడ మండలం చర్లపల్లి గ్రామ సర్పంచ్ శ్రీమతి బండి రేణుక శంకర్ గారు బీఆర్ఎస్ పార్టీని వీడి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా వీరికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాధారణంగా ఆహ్వానించారు.కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమ పాలన, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు.కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామాభివృద్ధి కోసం సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు. వీరితోపాటు బిఆర్ఎస్ నుండి బండి శివకృష్ణ, శరత్, రామస్వామి, నితిన్, సుమన్, గణేష్, రమాకాంత్ దాదాపు 20 మంది కాంగ్రెస్ పార్టీలోని చేరారు.

అర్హులైన ప్రతి ఒక్కరూ నవంబర్ 6లోపు ఓటరుగా నమోదు చేసుకోవాలి: ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

- గుడి మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో చిలుకా నగర్ చౌరస్తాలో ఎమ్మెల్సీ ఓటర్ నమోదు అవగాహన సదస్సు







చిలుకానగర్, అక్టోబర్ 29 (మన మీ వార్త):

ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు చిలకనగర్ చౌరస్తాలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గుడి మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఓటరు నమోదు అవగాహన సదస్సుతో పాటు ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అర్హులైన ఓటర్లకు పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయాలంటే ముందుగా అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరును నమోదు చేసుకోవాలని స్పష్టం చేశారు. అర్హత కలిగిన వారు నిర్లక్ష్యం చేయకుండా, అవసరమైన పత్రాలను సమర్పించి ఓటరు నమోదు ప్రక్రియను సకాలంలో పూర్తి చేసుకోవాలని సూచించారు. నవంబర్ 6వ తేదీ ఓటరు నమోదు కోసం చివరి గడువు కావడంతో అర్హులైన వారందరూ ఆ తేదీలోపు తమ దరఖాస్తులను సమర్పించి నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. చివరి తేదీ వరకు వేచి చూడకుండా ముందుగానే దరఖాస్తు చేసుకోవడం ద్వారా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని సూచించారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి అర్హుడి భాగస్వామ్యం అవసరమని, ఓటరు జాబితాలో పేరు లేకపోవడం వల్ల ఎవరూ తమ ఓటు హక్కును కోల్పోకూడదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఓటరు నమోదు ప్రాముఖ్యతపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం ద్వారా ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు అర్హులైన వారిని నమోదు దిశగా ప్రోత్సహించారు.

రాజ్యాంగాన్ని, సుప్రీంకోర్టు నిర్ణయాలను విస్మరించే నిరంకుశ పోకడలను తిప్పికొడదాం: మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్

--- నవంబర్ 2న హైదరాబాద్‌లో అమిత్ షా పాదయాత్రను విజయవంతం చేయాలి

--- హెచ్ఎంటీ నగర్ డివిజన్ నుంచి భారీ సంఖ్యలో ప్రజలు తరలిరావాలి

--- ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల ఓటరు నమోదుపై కార్యకర్తలు ప్రత్యేక దృష్టి సారించాలి





నాచారం, అక్టోబర్ 29 (మన మీ వార్త):

ప్రజాపాలనను తుంగలో తొక్కుతూ, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను ప్రజల్లో ఎండగట్టాలని, రాజ్యాంగాన్ని తప్పుపట్టే విధానాలను, అత్యున్నత న్యాయస్థానం నిర్ణయాలను విస్మరించే అధికార దుర్వినియోగ పోకడలను తిప్పికొట్టాలని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరిని ప్రజాక్షేత్రంలో ఎండగట్టేందుకు బీజేపీ కార్యకర్తలు ఐక్యంగా ముందుకు సాగాలని ఆయన సూచించారు. నవంబర్ 2న హైదరాబాద్‌లో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పాల్గొననున్న పాదయాత్రను విజయవంతం చేయడానికి హెచ్ఎంటీ నగర్ డివిజన్ బీజేపీ కార్యకర్తలతో నిర్వహించిన అత్యవసర సమావేశంలో ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ట్యాంక్ బండ్‌పై నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి హెచ్ఎంటీ నగర్ డివిజన్ నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు, పార్టీ శ్రేణులు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో నవంబర్ 2న జరగనున్న పాదయాత్రకు సంబంధించిన కార్యాచరణపై చర్చించారు. డివిజన్ పరిధిలోని ప్రతి బూత్ నుంచి కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రభాకర్ సూచించారు.

జవహర్‌నగర్ డంపింగ్ యార్డును ఎత్తివేయాలి

జవహర్‌నగర్ డంపింగ్ యార్డును తొలగించాలని డిమాండ్ చేస్తూ మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ చేపట్టనున్న పాదయాత్ర ముగింపు సందర్భంగా నిర్వహించే బహిరంగ సభను కూడా విజయవంతం చేయాలని ప్రభాకర్ కార్యకర్తలకు సూచించారు. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పార్టీ శ్రేణులు ప్రజలతో కలిసి ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

----పట్టభద్రుల ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి

రానున్న ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించే బాధ్యతను ప్రతి కార్యకర్త తీసుకోవాలని ప్రభాకర్ కోరారు. తమ కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల్లో అర్హులైన పట్టభద్రులను గుర్తించి, వారికి ఓటరు నమోదుపై అవగాహన కల్పించి నమోదు ప్రక్రియను పూర్తి చేయించాలని సూచించారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు స్థానాలను కైవసం చేసుకునే లక్ష్యంతో పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని అన్నారు.

ఈ సమావేశంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు చంద్రమౌళి, కార్మిక విభాగం జిల్లా కన్వీనర్ యోగేశ్వర్ రెడ్డి, రాజిరెడ్డి, మోర నర్సింహారెడ్డి, చిల్లా అశోక్, గంధమల గోపి, కిరణ్ కుమార్, రమేష్, వేణుగోపాల్, సురేందర్ స్వామి, శేఖర్ గుప్తా, ఉప్పలయ్య, బాలరాజ్, క్రాంతికుమార్, కిషోర్, సాగర్, మంజులవాణి, పార్వతి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ఖ

సితార జనప్రియ కాలనీలో యూనిసెక్స్ కోహినూర్ ఫ్యామిలీ సెలూన్ ప్రారంభం

జవహర్ నగర్, అక్టోబర్ 29: (వార్త ప్రతినిధి)





మేడ్చల్ మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎల్లారెడ్డిగూడ సితార జనప్రియ కాలనీ ప్రధాన రహదారిపై నూతనంగా ఏర్పాటు చేసిన యూనిసెక్స్ కోహినూర్ ఫ్యామిలీ సెలూన్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. బుధవారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి , మేడ్చల్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్ హాజరై లాంఛనంగా ప్రారంభించారు.

అనంతరం మాజీ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి మాట్లాడుతూ, నూతన సెలూన్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. నేటి యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకొని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని సూచించారు. స్వయం ఉపాధి ద్వారా ఇతరులకు కూడా ఉపాధి కల్పించే అవకాశం ఉంటుందన్నారు.

మేడ్చల్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్ మాట్లాడుతూ, కోహినూర్ ఫ్యామిలీ సెలూన్ నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. ఆధునిక కాలానికి అనుగుణంగా యువత విభిన్న వ్యాపార మార్గాలను ఎంచుకోవాలని, ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో వంపుగూడ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు అనూప్ రాజ్ యాదవ్ (టిల్లు) , ఉమ్మడి కాప్రా డివిజన్ మాజీ అధ్యక్షులు కొబ్బనూరి నాగశేషు, మేడ్చల్ జిల్లా ఏఎంసి మాజీ డైరెక్టర్ కొబ్బనూరి నాగరాజు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బాబురావు, జి. సత్యనారాయణ, జగదీష్ గౌడ్, సి. సత్యనారాయణ, యూత్ కాంగ్రెస్ నాయకులు మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇటీవల మృతి చెందిన వారిని గండ్ర పరామర్శ....

అక్టోబర్ 30.10.2026 పరకాల ప్రతినిధి మన మీ వార్త



భూపాలపల్లి జయశంకర్ జిల్లా రేగొండ మండలం,కనిపర్తి గ్రామ వాస్తవ్యులు మాజీ ఉప సర్పంచ్ మోహన్ గారి మాతృమూర్తి కీ.శే తీగల రాజక్క అనారోగ్యంతో మరణించగా నేడు వారి నివాసానికి వెళ్ళి,వారి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి,తన ప్రగాఢ సానుభూతి తెలిపిన భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి .. అదే విదంగా ఇదే గ్రామానికి చెందిన కీ.శే శ్రీపతి భాగ్యమ్మ ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం రేపాకపల్లి గ్రామ వాస్తవ్యులు కీ.శే చిలగాని మొగిళి గారు మరణించగా నేడు వారి ఇంటికి వెళ్ళి, వారి చిత్ర పట్టం వద్ద నివాళులర్పించి,వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

printed by SHIVA D , published by SHIVA D and owned by SHIVA PRASAD , printed at Rathna graphics offset printers, 2-3-703/7, Tirumala nagar colony ,Ambeerpet, police line hyd-500013 TS.
published at door no: 5-12, badyathand, Noothanakal mandal, thallasingaram, suryapet- 508221 TS, editor: SHIVA PRASAD. gmail : mivartanews@gmail.com, cell : 9515342857, TGBIL/25/A0512

జాతీయ ఐక్యత సందేశంతో 5ఖ, 10ఖ వాక్/రన్ - - వరంగల్ సీపీ ఎన్. శ్వేత, ఐపీఎస్

మన మీ వార్త అక్టోబర్ 29 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



అక్టోబర్ 31న ఉదయం 6 గంటలకు హనుమకొండ పోలీస్ హెడ్‌క్వార్టర్స్ నుంచి ప్రారంభం. సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించే ఏక్తా దివస్--జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా, విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్‌లో భాగంగా ఈ నెల 31వ తేదీన 5ఖ, 10ఖ వాక్/రన్ నిర్వహించనున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్ తెలిపారు.

ఈ కార్యక్రమం శనివారం ఉదయం 6 గంటలకు హనుమకొండ పోలీస్ హెడ్‌క్వార్టర్స్ నుంచి ప్రారంభమై, మట్టేవాడ పోలీస్ స్టేషన్ వరకు చేరుకుని, తిరిగి పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు చేరుకోవడంతో ముగుస్తుంది.

ఈ వాక్/రన్‌లో పురుషులు, మహిళలు, సీనియర్ సిటిజన్లు పాల్గొనవచ్చు. విజేతలకు ప్రత్యేక బహుమతులు అందజేయనున్నారు.
ఈ కార్యక్రమంలో పాల్గొన దానికి
రిజిస్ట్రేషన్ లింక్:

విద్యార్థిని -విద్యార్థుల భవిష్యత్తు ప్రణాళిక లక్ష్యాలకు నూతన విద్యా విధానాలు ఉపయోగపడాలి, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్.

మన మీ వార్త అక్టోబర్ 29 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



ప్రతి విద్యార్థి, విద్యార్థుల యొక్క భవిష్యత్తు ప్రణాళికల లక్ష్యాలకు విద్యాలయాలలో అందిస్తున్న నూతన విద్యా విధానాలు ఉపయోగపడే విధంగా ఉపాధ్యాయుల



బోధనలు ఉండాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అన్నారు, గురువారం మహబూబాబాద్ పట్టణంలోని కంకర బోర్డు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి పాఠాలు విన్నారు. ప్రతి విద్యార్థిని విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ వహించి విద్య విషయాలు వ్యక్తిగత విషయాలను నిత్యం గమనిస్తూ ఉండాలని, షెడ్యూల్ ప్రకారం సబ్జెక్టుల వారిగా ప్రత్యేక తరగతులు నిర్వహించి, ఇంగ్లీష్ భాష పై నైపుణ్యం వచ్చే విధంగా ప్రతి అంశాన్ని ఇంగ్లీషులోనే బోధించాలని తద్వారా పిల్లల యొక్క భవిష్యత్తు తరాల ఉపాధి కల్పన కోసం ఉపయోగపడుతుందని అన్నారు.

పిల్లల లక్ష్యాలను నిర్ధారించుకుని తగిన విధంగా మార్గదర్శకాలను జారీ చేసి ఇంజనీరింగ్, మెడికల్, తదితర రంగాల వైపు ఎలా వెళ్లాలి,ప్రభుత్వ ఉద్యోగాలు ఎలా సాధించాలి అనే అంశాలపై క్లుప్తంగా వివరించాలని అన్నారు, డిజిటల్ తరగతులు, ప్రాక్టికల్స్, రైటింగ్, రీడింగ్, తదితర అంశాలు క్రీడా, సాంస్కృతిక, సామాజిక అంశాలను బోధించాలని అన్నారు,
పదవ తరగతి విద్యార్థినీ, విద్యార్థులు మోక్షిత, చరణ్, వరుణ్ తేజ్, సాత్విక, లతో మాట్లాడారు వారికి బోధనలు అర్థమయ్యాయి, లేదా అనే విషయాన్ని వారినే అడిగి తెలుసుకున్నారు, పిల్లలు ఉపాధ్యాయుని ఉపాధ్యాయుల హాజరు శాతం కచ్చితంగా నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు, మధ్యాహ్న భోజనం సిద్ధం చేసే సిబ్బందికి తగిన జాగ్రత్తలు వహిస్తూ, భోజనం సిద్ధం చేయాలని, వారికి షెడ్యూల్ ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహించాలని అన్నారు, పిల్లల యొక్క మానసిక, ఆరోగ్య పరిస్థితులను గమనిస్తూ ఉంటూ వైద్య బృందం (ఆర్ బి ఎస్ కే) చేత వైద్య పరీక్షలు, మానసిక ఉల్లాస శిక్షణ తరగతులు నిర్వహించాలని సూచించారు,
పాఠశాలలో నిత్యం సానిటేషన్ చేస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అవసరం ఉన్నచోట కాంపౌండ్ వాల్, టాయిలెట్స్, నిర్మించాలని తెలిపారు, పిల్లలకు హెల్త్, ఎడ్యుకేషన్, న్యూట్రిషన్ సానిటేషన్ లపై అవగాహన కల్పించాలన్నారు, ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట విద్యాశాఖ అధికారులు మందుల శ్రీరాములు, వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయులు, ఏం కె నాయక్,తదితరులు ఉన్నారు.

కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్ కు పార్కుల దుస్థితిపై వినతి పత్రం ఇచ్చిన జనసేన నాయకులు



కూకట్పల్లి అక్టోబర్ 29 మన మీ వార్త

కేపిహెచ్ బి నాలుగవ ఫేస్‌లోని పార్కులు సరైన నిర్వహణ లేక పూర్తిగా నిర్వీర్యంగా మారాయని పార్కులలో పిచ్చిమొక్కలు పెరిగిపోవడం, చెత్తాచెదారంతో నిండిపోవడంతో పారిశుద్ధ్యం తీవ్రంగా దెబ్బతిన్నదని పిచ్చిమొక్కల కారణంగా పాముల బెడద తీవ్రమైందని, కేవలం రాత్రి వేళల్లోనే కాకుండా పగటిపూట కూడా పాములు సంచరిస్తూ చుట్టుపక్కల ఇళ్లలోకి వస్తున్నాయని దీని వలన కాలనీవాసులు ముఖ్యంగా చిన్నారుల తల్లిదండ్రులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని, అంతేకాకుండా, పార్కుల సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల తాగుబోతులకు అడ్డాగా మారాయని కాలనీ వాసుల నుండి జనసేన నాయకులకు తెలియజేయడం వలన కాలనీవాసుల భద్రత మరియు ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, జీహెచ్ఎంసీ అధికారులు తక్షణమే స్పందించాలని కోరుతూ కాలనీ వాసుల తరుపున కూకట్ పల్లి జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్ కి జనసేన నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు వివరించిన సమస్యలను జోనల్ కమిషనర్ సానుకూలంగా స్వీకరించారు, కాలనీవాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై స్పందిస్తూ, సంబంధిత సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కొల్లా శంకర్, ఆళ్ల నరేంద్ర, పోలేబోయిన శ్రీనివాస్ గోవిందా, పి.గోపి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మెదక్ జిల్లాలో దళితులపై జరుగుతున్న దాడులపై జాతీయ ఎస్సీ కమిషన్ కు డిబిఎఫ్ ఫిర్యాదు.

మెదక్ అక్టోబర్ 29 మనం మీ వార్త అధికార ప్రతినిధి.

జిల్లాలో బతుకమ్మ దసరా పండుగ ఉత్సవాలలో దళితులపై వరుసగా దాడులు చేసిన నిందితులను ఎస్సీ ఎస్టీ అత్యాచార కేసులలో కఠినంగా శిక్షించి దళితులకు రక్షణ కల్పించాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి శంకర్ గురువారం నాడు జాతీయ ఎస్సీ కమిషన్,రాష్ట్ర కమిషన్ కు ఫిర్యాదు చేశారు . ఈ సందర్భంగా డి.బి.ఎఫ్ జాతీయ కార్యదర్శి పి. శంకర్ మాట్లాడుతూ.. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరానికి కుతవేటు దూరంలో ఉన్న మెదక్ జిల్లాలో బతుకమ్మ దసరా ఉత్సవాలలో మనోహరాబాద్ మండలం కొనాయపల్లి(జూ) కుచారం, తుప్రాన్ మండలం కిష్టాపూర్,శివ్వంపేట్ మండలం నవాబ్ పేట్, హవేలీ ఘనపూర్ మండల కేంద్రంలో బతుకమ్మ,దసరా ఉత్సవాల సందర్భంగా దళితులపై దాడులు, దౌర్జన్యాలు జరిగాయన్నారు. మనోహరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొనయిపల్లి పిటీ గ్రామంలో డప్పులు కొట్టేందుకు కనీస వేతనం ఇవ్వాలని అడిగిన పాపానికి గ్రామ సర్పంచ్ మన్నే కళ్యాణ్ వారీ అనుచరులు ముకుమ్మడిగా 30 మంది దళితులపై దాడి చేసి గాయపర్చారని, అడ్డుగా వెళ్లిన మహిళలను సైతం దూషిస్తూ దాడి చేశారన్నారు..సర్పంచ్ వారీ అనుచరులు చేసిన దాడిలో విధి నిర్వహణలో ఉన్న ముగ్గురు గ్రామ పంచాయతీ కార్మికులకు తీవ్ర గాయాల పాలయ్యారని తెలిపారు . నేరానికి అనుగుణంగా పోలీసులు కేసులు నమోదు చేయకుండా నామమాత్రంగా కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారని,.ఖీఅతీ అశీ287/2026 మనోహరాబాద్ పోలీస్ స్టేషన్) ఎఫ్ఐఆర్ ను ఆల్టరేషన్ చేసి హ త్యాయత్నం కేసు నమోదు చేసి నిందితుడైన గ్రామ సర్పంచ్ మన్నే కళ్యాణ్ తదితరులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.
మనోహరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కుచారం గ్రామంలో దళిత సర్పంచ్ బతుకమ్మ ఉత్సవాల కోసం ఏర్పాట్లు చేస్తే గ్రామానికి చెందిన ఆధిపత్య వర్గాలు



దళిత సర్పంచ్ ఏర్పాటు చేసిన స్థలంలో మేము ఎందుకు బతుకమ్మ ఆడాలి అని మేము అక్కడ బతుకమ్మ ఆడక పోవడం అంటే దళిత సర్పంచ్ పట్ల కులవివక్షత పాటించడమేనని తెలిపారు. దళిత సర్పంచ్ బతుకమ్మ ఏర్పాట్లు చేస్తే ఎందుకు ఆడుకోరని నిలదీసిన పాపానికి దళిత సర్పంచ్ భర్త రఘు పై ఆరుగురు దాడి చేసి కులం పేరుతో దూషించారని,ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినప్పటికీ నేటికీ నిందితులను అరెస్ట్ చేయలేదన్నారు.(ఖీఅతీ అశీ 289/2026.)
నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.
హవేలి గణపురం పోలీస్ స్టేషన్ కేంద్రంలో దళితులు బతుకమ్మ ఆడుకుంటే అడ్డుకొని దాడి చేసి తిరిగి దళితులపైనే అక్రమ కేసులు బనాయించారని,.ఖీఅతీ అశీ 231/2026 అక్రమ కేసులు వేయాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా దళితులను కులం పేరుతో దూషించిన అంగన్వాడి టీచర్ వడ్ల వాణినీ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులో(ఖీఅతీ అశీ232/2026) అరెస్ట్ చేయాలని,ప్రభుత్వ ఉద్యోగంలో ఉండి కుల వివక్ష పాటించినందున ఆమెను ఉద్యోగం నుండి తొలగించాలని డిమాండ్ చేశారు.
తుప్రాన్ మండలం కిష్టాపూర్ గ్రామంలో గత సంవత్సరం బతుకమ్మ ఉత్సవాల్లో దళిత మహిళలు పాల్గొంటే గ్రామానికి చెందిన అగ్రకులాల వాళ్ళు అడ్డుకున్నారని,. ఈ సంవత్సరం కూడా దళిత మహిళలు బతుకమ్మ ఉత్సవాలు జరపడాన్ని జీర్ణించుకోలేని అగ్రకులాల వాళ్ళు దళితులను సాంఘిక బహిష్కరణ చేశారని తెలిపారు.
శివ్వంపేట్ మండలం నవాబ్ పేట్ గ్రామంలో బతుకమ్మ ఊరేగింపు సందర్భంగా గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి,హరిగౌడ్, రవిగౌడ్ లు దళితులైన, చంది సాయిలు ఆయన కుమారుడు చంది సన్నీలపై ఆకారణంగా దాడి చేసి కులం పేరుతో దూషించి
హత్యాయత్నానికి పాల్పడ్డారన్నారు .సన్నీ కుమార్ గొంతు పిసుకడంతో గొంతుకు తీవ్రమైన గాయాలు అయినప్పటికీ పెట్టకుండా పోలీసులు నామ మాత్రం కేసులు పెట్టారన్నారు.(ఖీఅతీ అశీ 241/2026) ఈ ఎఫ్ఐఆర్ ను ఆల్టరేషన్ చేసి
హత్యాయత్నం కేసుగా మార్చి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.
జిల్లాలో జరిగిన ఘటనల్లో పోలీసుల నిరక్షంగా వ్యవహరించారని దాడికి గురైన బాధితులకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు, నిందితులకు వత్తాసు పలుకుతున్నారనీ ఆరోపించారు.కోనాయిపల్లి, నవాబ్ పేట్ గ్రామాల్లో దాడికి గురైన దళితులపైనేనే పోలీసులు కౌంటర్ కేసులు నమోదు చేయడం సిగ్గుచేటు అన్నారు.దళితులు ఇచ్చిన పిటిషన్ లు ఆధారంగా కేసు నమోదు చేయాల్సిన పోలీసులు,నిందితులకు అనుకూలంగా పిటిషన్స్ రాయించుకుని కేసులు పెట్టడం జరిగిందన్నారు.నవాబ్ పేట్ గ్రామంలో పిటిషన్ ఇచ్చిన 7 రోజుల తరువాత కేసు నమోదు చేయడం అనేక అనుమానాలకు తావిస్తుందన్నారు మెదక్ జిల్లాలో జరిగిన ఘటనలపై సమగ్ర విచారణ జరపాలని, అట్రాసిటీ కేసుల్లో నిర్లక్ష్యం వహించిన మనోహరాబాద్ శివ్వంపేట్ ఎస్ఐలలను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వారిపేట లింగన్న,రాజన్న రాము తదితరులు ఏబిఎస్ఎం మెదక్ జిల్లా అధ్యక్షులు పెద్దింటి సత్యం పాల్గొన్నారు.దళిత బహుజన ఫ్రంట్ ఫిర్యాదుకు స్పందించిన జాతీయ ఎస్సీ కమిషన్ డైరెక్టర్ డాక్టర్ సునీల్ కుమార్ జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పీలకు నోటీసులు జారీచేసి బాధితులకు న్యాయం జరిగే విధంగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారని శంకర్ తెలిపారు.

నరకాసుర వధ కార్యక్రమానికి పకడ్బంది ఏర్పాట్లు చేయాలి

- అధికారులు, కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలి: జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

మన మీ వార్త అక్టోబర్ 29
వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

దీపావళి పండుగ సందర్భంగా నవంబర్ 6, 2026న వరంగల్‌లోని ఉర్సు రంగలీల మైదానంలో నిర్వహించనున్న నరకాసుర వధ కార్యక్రమానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు.
గురువారం జిల్లా కలెక్టరేట్‌లో నరకాసుర వధ కార్యక్రమ నిర్వహణపై వివిధ శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లు, వివిధ శాఖల మధ్య సమన్వయం, ప్రజలకు కల్పించాల్సిన సౌకర్యాలు, భద్రతా చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో అవసరమైన ఏర్పాట్లు చేయాలని



సూచించారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలకు తగిన సౌకర్యాలు కల్పించడంతోపాటు శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు.
అగ్నిప్రమాదాలు, ఇతర అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.
వివిధ శాఖల అధికారులు, నరకాసుర వధ ఉత్సవ కమిటీ సభ్యులు పరస్పర సమన్వయంతో పనిచేసి, కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు.
ఈ సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ కవిత, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) వై.వి. గణేష్, డీఆర్వో విజయలక్ష్మి, వరంగల్ ఆర్డీవో సుమ, ఆర్‌అండ్‌బీ ఈఈ రాజేందర్, డీఎంహెచ్‌వో రాజిరెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, నరకాసుర వధ ఉత్సవ కమిటీ అధ్యక్షులు, మారుపల్ల రవి, ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల రవి, కోశాధికారి మారుపల్ల గౌతమ్, తదితరులు పాల్గొన్నారు.

హనుమకొండ సమగ్ర గ్రావెల్ నిర్వహణ అమలు విధానంతో అనుమతుల ప్రక్రియ సులభతరం


- త్వరలో అమల్లోకి కొత్త పోర్టల్
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

మన మీ వార్త అక్టోబర్ 29 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

గ్రావెల్ (మట్టి) తరలింపునకు సంబంధించిన అనుమతుల ప్రక్రియను సులభతరం చేసేందుకు సమగ్ర గ్రావెల్ నిర్వహణ విధానం (ఇంటిగ్రేటెడ్ గ్రావెల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్)ను అమల్లోకి తీసుకురానున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో సమగ్ర గ్రావెల్ మేనేజ్‌మెంట్ సిస్టం అమలు చేసేందుకు నూతన పోర్టల్ తీసుకువచ్చే అంశంపై మైనింగ్, రెవెన్యూ, సాంకేతిక అధికారులతో జిల్లా కలెక్టర్ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. నూతనంగా అందుబాటులోకి తీసుకువచ్చే పోర్టల్ సంబంధించిన వివిధ అంశాలను గురించి సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ... నూతన విధానం అమల్లోకి రావడం ద్వారా చిన్న మొత్తాల్లో గ్రావెల్ అవసరమైన సందర్భాల్లోనూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని,



త్వరితగతిన అనుమతులు పొందే అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు.
ప్రస్తుతం రహదారుల నిర్మాణం, రైతులు, ప్రజల అవసరాల మేరకు గ్రావెల్ తరలించేందుకు అనుమతుల ప్రక్రియను సులభతరం చేయడమే కొత్త విధానం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి సాధ్యమైనంత త్వరగా, సుమారు ఐదు రోజుల నుంచి వారంలోపు అనుమతులు మంజూరు చేసేలా వ్యవస్థను రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ పోర్టల్ నిర్వహణకు అవసరమైన సాఫ్ట్‌వేర్‌ను సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. కొత్త పోర్టల్‌పై అవగాహన కల్పించేందుకు సీజీజీ సాంకేతిక బృందం శనివారం జిల్లాకు రానుందని తెలిపారు. రెండు బ్యాచ్‌లుగా శిక్షణ కార్యక్రమం నిర్వహించి, తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు (



గిర్దవర్లు), పంచాయతీ కార్యదర్శులకు విధివిధానాలను వివరించనున్నట్లు పేర్కొన్నారు.
త్వరగా పోర్టల్‌ను ప్రత్యక్షంగా వినియోగంలోకి తీసుకురానున్నట్లు తెలిపారు.
గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు వాహనాల వివరాలను నమోదు చేసి, ప్రవేశ సమయం, నిష్క్రమణ సమయాన్ని పోర్టల్‌లో పొందుపరుస్తారని పేర్కొన్నారు.
ఈ వ్యవస్థ అమలుతో అనధికార గ్రావెల్ తవ్వకాలు, తరలింపునకు అడ్డుకట్ట వేయడంతో పాటు, గ్రామస్థాయిలో చిన్నపాటి పనులకు అవసరమైన గ్రావెల్ పొందడం సులభతరం కానుంది.
ఈ సమావేశంలో జిల్లా మైనింగ్ శాఖ ఏడి రామాచారి, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు వెంకటేష్, డీఎస్. వెంకన్న, ఈడియం శ్రీధర్, సి సెక్షన్ సూపరింటెండెంట్ చల్లా ప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు బీఎంఆర్ ఫౌండేషన్ అండ..

250 మంది ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ

వికారాబాద్ ల్లా తాండూరులో నిరుద్యోగ యువతకు అండగా నిలుస్తోంది బీఎంఆర్ ఫౌండేషన్. పోలీస్ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న సుమారు 250 మంది ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఉచిత స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. తాండూరులోని విలియం మూన్ స్కూల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, ఎస్పీ స్నేహ మెహ్రాతో కలిసి ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు, నిరుద్యోగ యువత, పేద కుటుంబాలకు బీఎంఆర్ ఫౌండేషన్ అందిస్తున్న సేవలను అభినందించారు. అభ్యర్థులు కష్టపడి చదివి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ.. అభ్యర్థులు మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ లక్ష్యంపై దృష్టి పెట్టాలని సూచించారు.

ప్రపంచంలో అత్యంత శక్తివంతమైనది విద్యే

- లక్ష్యం ఉన్నత విద్య.. మార్గం అవగాహన
- గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ తెలుసుకోవాలి.
- విద్యార్థులు వ్యక్తిగత భద్రతపై అవగాహన పెంచుకోవాలి మంత్రి సీతక్క

మన మీ వార్త అక్టోబర్ 29 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

:: రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క ప్రపంచంలో అత్యంత శక్తివంతమైనది విద్యేనని, విద్యార్థులు ఆసక్తితో చదువుకొని ఉన్నతంగా ఎదగాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. గురువారం ములుగు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గోవిందరావు పేట మండలం పసర జెడ్ పి హెచ్ ఎస్ పాఠశాలలో 'సురక్షిత్ బచ్‌పన్ అభియాన్'లో భాగంగా నిర్వహించిన విద్యార్థుల అవగాహన కార్యక్రమానికి మంత్రి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ జీవితంలోని ప్రతి దశలో చదువు, జ్ఞానం మనకు అండగా నిలుస్తాయని తెలిపారు. ఎలాంటి కష్టాలు



ఎదురైనా విద్యావంతులు తమ జ్ఞానంతో ఉపాధి పొందుతూ స్వశక్తితో జీవించగలుగుతారని పేర్కొన్నారు. విద్యార్థులు నిరంతరం కొత్త విషయాలను నేర్చుకోవాలని, తాము సంపాదించిన జ్ఞానాన్ని పది మందికి పంచాలని సూచించారు. ఇతరులకు జ్ఞానాన్ని అందించడంలో సంతృప్తి ఉంటుందని, ప్రతి ఒక్కరూ చదువుకు ప్రాధాన్యమివ్వాలని కోరారు.
పాఠశాలల్లో, బస్సులు, ఆటోల్లో ప్రయాణించేటప్పుడు, ఇళ్లు, పరిసరాల్లో ఎదురయ్యే వివిధ రకాల వేధింపులను గుర్తించేలా విద్యార్థులు వ్యక్తిగత భద్రతపై అవగాహన పెంచుకోవాలని మంత్రి సూచించారు. ఇలాంటి విషయాలను విద్యార్థులకు తెలియజేసేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ



అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని చదువుతోపాటు తమ రక్షణకు సంబంధించిన అంశాలనూ తెలుసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోక్సో చట్టం, సైబర్ నేరాలు, బాలల అక్రమ రవాణా నివారణతోపాటు బాలల రక్షణకు సంబంధించిన ఇతర చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాట్లాడే బొమ్మ ద్వారా 'గుడ్ టచ్--బ్యాడ్ టచ్' గురించి ప్రత్యక్షంగా వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, జిల్లా సంక్షేమ అధికారి ప్రేమలత,ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కరువు మండలంగా ప్రకటించాలని బీఆర్ఎస్ రాస్తారోకో

- శాసనమండలి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి

ఖానాపురం, అక్టోబర్ 29 (మల్లేష్ వార్త ప్రతినిధి) :

సకాలంలో వర్షాలు కురవకపోవడం, ఎల్‌నినో ప్రభావంతో ఖానాపురం మండలంలో వ్యవసాయం సంక్షోభంలో పడిందని, తక్షణమే ప్రభుత్వం స్పందించి ఖానాపురం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో 365 జాతీయ రహదారిపై, నర్సంపేట నుంచి భద్రాచలం వెళ్లే మార్గంలో ఖానాపురంలో రెడ్డి పెద్ద రంగారెడ్డి గార్డెన్ ఎదుట బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఈ రాస్తారోకోకు శాసనమండలి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, ఎమ్మెల్సీ ఎన్నికల నర్సంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పోచంపల్లి శ్రీనివాసరెడ్డి హాజరై మద్దతు తెలిపారు.

ఈ సందర్భంగా పోచంపల్లి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, ఖానాపురం మండలంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఖానాపురం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించేలా పోరాడుతానని హామీ ఇచ్చారు. రైతుల పంటలు ఎండిపోతున్న పరిస్థితిని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి, రైతులకు న్యాయం చేసేలా తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.మాజీ ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామినాయక్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మహాలక్ష్మి



వెంకటనరసయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్ గౌడ్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు కోరే సుధాకర్, జిల్లా నాయకుడు వల్లెపు శ్రీనివాస్, సర్పంచుల ఫోరం మండల ప్రధాన కార్యదర్శి దాసరి రమేష్ ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈకార్యక్రమంలో వివిధగ్రామాల బీఆర్ ఎస్ నాయకులు , బీఆర్ ఎస్ సర్పంచ్ లు పాల్గొన్నారు.

హనుమకొండ బండ్ అభివృద్ధి పనులు మరింత వేగవంతం కావాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్ పాయి

మన మీ వార్త అక్టోబర్ 29 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

వడ్డేపల్లి చెరువు బండ్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, జిడబ్ల్యూఎంసి కమిషనర్ వెంకన్న జిల్లా వాసులకు ఆహ్లాద వాతావరణం అందించేందుకు చేపట్టిన వడ్డేపల్లి బండ్ అభివృద్ధి పనులు మరింత వేగవంతంగా జరగాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్ పాయి మున్సిపల్ అధికారులను ఆదేశించారు.
గురువారం వడ్డేపల్లి బండ్ పై క్షేత్ర స్థాయిలో జరుగుతున్న అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న, అధికారులతో కలిసి పరిశీలించారు ఈ సందర్భంగా బండ్ అభివృద్ధి పనులలో భాగంగా చేపట్టిన రిటైనింగ్ వాల్, గ్రిల్స్, టైల్స్, వాష్ రూమ్,



లైటింగ్, పెయింటింగ్, జిమ్, కాంపౌండ్ వాల్, తదితర పనుల పురోగతిని కలెక్టర్ పరిశీలించారు
బండ్ కింద ఏర్పాటు చేసే ఫుడ్ జోన్స్ దగ్గర ఉండే సీటింగ్, వాల్ పెయింటింగ్, గ్రీనరి, పిల్లల ఆట స్థలం వద్ద ఏర్పాటు చేయాల్సిన అంశాలపై అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ... బండ్ అభివృద్ధి పనులలో



భాగంగా ఫుడ్ కోర్ట్ కు కలర్స్ వేయించాలని, వాటి కి సంబంధించిన ప్రతిపాదనలను త్వరగా అందజేయాలన్నారు. బండ్ పరిసరాలు ఆహ్లాదకరంగా ఉండేందుకు గ్రీనరీని ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ దీపాలు, వాటికి సంబంధించిన పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.
ఈ సందర్భంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఈ రాజ్ కుమార్, ఈఈ రవికుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రోడ్డుపై ధాన్యం కుప్పలు..

-అదుపుతప్పిన బైక్..
-తీవ్ర గాయాల పాలైన వ్యక్తి
-కేసు నమోదు చేసిన పోలీసులు
-మొగుళ్లపల్లి పోలీస్ స్టేషన్ లో అక్రమ ఇసుక రవాణాపై మరో మూడు కేసులు
-రహదారులపై ధాన్యం కుప్పలను పోస్తే చట్టపరమైన చర్యలు తప్పవు
-అక్రమ ఇసుక రవాణాపై క్రిమినల్ చర్యలు తీసుకుంటాం
- మొగుళ్ళపల్లి ఎస్ఐ ముప్పు సురేష్

చిట్యాల అక్టోబర్ 29 (మీవార్త)

రోడ్డుపై ధాన్యం పోసిన కారణంగా బైకు అదుపుతప్పి ఒక వ్యక్తి తీవ్ర గాయాలపాలై ప్రాణాపాయ స్థితిలో హన్మకొండలోని శ్రీనివాస ఫినాకిల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సంఘటనను ఎస్ఐ ముప్పు సురేష్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని ఎల్లారెడ్డిపల్లి కాలువ సమీపంలో గల ప్రధాన రహదారిపై గిరవేణి కొమురయ్య ధాన్యం కుప్పను ఉంచడంతో అక్టోబర్ 22న రాత్రి సుమారు 9:30 గంటలకు మోటార్ సైకిల్ పై వెళ్తున్న బాషిక మహేందర్

ప్రమాదానికి గురై తలకు, చెంపకు, కంటికి తీవ్ర గాయాల పాలు కావడంతో ఆయనను హన్మకొండలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా విషమ పరిస్థితిలో చికిత్స పొందుతున్నాడని తెలిపారు. బాధితుడు భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి చట్టపరమైన చర్యలను చేపట్టామన్నారు. అదేవిధంగా గురువారం మండలంలోని మొగుళ్లపల్లి-ముల్కలపల్లి గ్రామాల మధ్యన గల బ్రిడ్జి వద్ద, రంగాపూర్ బస్ స్టాప్ వద్ద, పాత ఇస్సిపేట చర్చి వద్ద తన సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ చేస్తుండగా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 3 ట్రాక్టర్లను గుర్తించి, తనిఖీ చేయగా..పోతుగల్ వాగు, కలికోటపల్లి వాగు, మొగుళ్లపల్లి వాగుల నుంచి ఇసుకను తరలిస్తున్న 3 డ్రైవర్ల వద్ద రవాణా అనుమతి పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు లేకపోవడంతో వారిపై కేసులు నమోదు చేసి, ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. అలాగే రహదారులపై వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే విధంగా ధాన్యం కుప్పలు లేదా ఇతర వస్తువులను ఉంచరాదని, ప్రమాదాలకు గురయ్యే విధంగా రహదారులపై ధాన్యం కుప్పలను పోస్తే చట్టపరమైన



చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా ఇసుకను రవాణా చేయవద్దని, అక్రమ ఇసుక రవాణాను పెంచి పోషిస్తున్న ఇసుక మాఫియాపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు రహదారి నియమాలు పాటిస్తూ..చట్ట విరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండి పోలీసులకు సహకరించాలని ఎస్ఐ ముప్పు సురేష్ ప్రజలకు సూచించారు.

ఆంజనేయ నగర్ కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా :వడ్డేపల్లి రాజేశ్వరరావు



కూకట్‌పల్లి అక్టోబర్ 29 మన మీ వార్త

ఖైతలాపూర్ డివిజన్ పరిధిలోని ఆంజనేయ నగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆంజనేయ నగర్ కాలనీలో పర్యటించారు.ఈ సందర్భంగా స్థానిక బీజేపీ నాయకులు, కాలనీ వాసులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం కాలనీ సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలతో సమావేశమై కాలనీలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.
కాలనీలో సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించినందుకు సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు రాజేశ్వరరావు కి కృతజ్ఞతలు తెలియజేశారు. కాలనీవాసులు వివరించిన సమస్యలపై వారు సానుకూలంగా స్పందిస్తూ, సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.
అంతేకాకుండా, ఎవరో వస్తారని, ఏదో చేస్తారని ఎదురుచూడకుండా, తన వంతు సహకారాన్ని అందిస్తూ ఆంజనేయ నగర్ కాలనీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఆయన తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా, ప్రజలకు అందుబాటులో ఉంటూ కాలనీల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని ఈ సందర్భంగా రాజేశ్వరరావు స్పష్టం చేశారు.

బుధరావుపేట ఆదర్శ పాఠశాల విద్యార్థుల ప్రతిభ



ఖానాపురం అక్టోబర్ 29(మల్లేష్ మీవార్త ప్రతినిధి)

వరంగల్ జిల్లా స్థాయి పీఎం శ్రీ పాఠశాలల పోటీల్లో ఖానాపూర్ మండలం బుధరావుపేట తెలంగాణ ఆదర్శ పాఠశాల విద్యార్థులు పలు బహుమతులు సాధించి పాఠశాలకు గుర్తింపు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమానికి స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు భద్రయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజేత విద్యార్థులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సాంస్కృతిక, సృజనాత్మక రంగాల్లోనూ తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు. జిల్లా స్థాయి పోటీల్లో డ్రాయింగ్‌లో తేజస్విని ప్రథమ స్థానం, సంగీతంలో లోకేష్ ద్వితీయ స్థానం, స్పెల్ బీ పోటీలో మనోజ్ ద్వితీయ స్థానం సాధించారు. అలాగే నృత్య ప్రదర్శనలో విద్యార్థులు తృతీయ స్థానం పొందగా, మాక్ పార్లమెంట్‌లో ఉత్తమ భాగస్వామ్య పురస్కారాలను అందుకున్నారు. విద్యార్థుల విజయాల పట్ల పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ కాసుల రవికుమార్ హర్షం వ్యక్తం చేస్తూ, విజేతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో గైడ్ టీచర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి.

- విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలి.
- జిల్లా గిరిజన సంక్షేమ అధికారి నీలిమ ఆదేశం





శివ్వంపేట మీ వార్త ప్రతినిధి అక్టోబర్ (29):

జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి నీలిమ ప్రభుత్వ గిరిజన వసతి గృహాన్ని గురువారం నీలిమ సందర్శించి తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న దుప్పట్లు,ప్లేట్లు, గ్లాసులు,రెండు జతల షూలు,బెడ్‌షీట్లు,దుస్తులు, బుక్స్,విద్యార్థులకు పంపిణీ చేశారు.ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని,వాటిని సద్వినియోగం చేసుకొని బాగా చదివి పదో తరగతిలో వంద శాతం ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం స్టోర్ రూమ్, రికార్డులను తనిఖీ చేశారు. వసతి గృహ సిబ్బందితో మాట్లాడుతూ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం,పౌష్టికాహారం అందించాలని సూచించారు.విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని వసతి గృహ ఏఎన్ఎం సుజాతకు ఆదేశించారు. కార్యక్రమంలో వార్డెన్ యాదయ్య,సిబ్బంది ఉన్నారు.

రక్తదానం చేసి బాధితుల జీవితాల్లో వెలుగులు నింపాలి..: సీపీ సాయిచైతన్య

(మన మీ వార్త న్యూస్) : అక్టోబర్ 29, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-



అత్యవసర పరిస్థితుల్లో ఉన్నప్పుడు రక్తదానం చేసి బాధితుల జీవితాల్లో వెలుగులు నింపాలని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. పోలీసు సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా



నగరంలోని పరేడ్ గ్రౌండ్ లో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున రక్తదాన శిబిరం నిర్వహించారు.

స్వచ్ఛందంగా రక్తదానం చేసిన పోలీసులు..



ఈ సందర్భంగా శిబిరంలో పలువురు పోలీసులు, కళాశాలల విద్యార్థులు, యువకులు రక్తదానం చేశారు. వారిని సీపీ ప్రత్యేకంగా అభినందించారు. రక్తదానం మహాదానమని.. విలువైన ప్రాణాలు కాపాడే లైఫ్ లైన్ అని ఆయన పేర్కొన్నారు. ఏసీపీ ప్రకాశ్, రూరల్ సీఐ శ్రీధర్, ఉమెన్ పీఎస్ సీఐ ప్రసాద్, నాల్గో టౌన్ సీఐ సతీష్ తో సహా సుమారు 200మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ పోతన్ కర్ లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ డాక్టర్ సీనునాయక్, కోశాధికారి కెంపుల నాగరాజు కాకతీయ విద్యాసంస్థల డైరెక్టర్ రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ గురుపీఠంలో ప్రత్యేక పూజలు -- అన్నప్రసాద వితరణ

శివ్వంపేట మీ వార్త ప్రతినిధి అక్టోబర్ (29):



భక్తిశ్రద్ధలతో దత్తాత్రేయ పంచాయతన అభిషేకాలు,సాయిబాబా పూజలు ఆశ్వయుజ బహుళ చవితి గురువారం సందర్భంగా శ్రీ గురుపీఠంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు శ్రీ గురుపీఠం చారిటబుల్ ట్రస్ట్



చైర్మన్ పెద్ద గౌడ్ శివకుమార్ గౌడ్ తెలిపారు.గురు పీఠం ట్రస్ట్ చైర్మన్ పెద్దకోని శివకుమార్ గౌడ్ మాట్లాడుతూ గురువారం ఉదయం 8 గంటలకు శ్రీ దత్తాత్రేయ పంచాయతనానికి అభిషేకాలు,అర్చనలు నిర్వహించి దివ్య హారతి సమర్పించమన్నారు. అదేవిధంగా శ్రీ షిర్డీ సాయిబాబాకు నిరంతర అభిషేకాలు,అర్చనలు, హారతులు, మధ్యాహ్నం 12 గంటలకు బాబా మధ్యాహ్న హారతి అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ట్రస్ట్ సభ్యులు వెల్లడించారు.ఈ పూజా కార్యక్రమాలకు భక్తులందరూ సమయానికి విచ్చేసి,స్వామివారి కృపాకటాక్షాలు మరియు గురుదేవుల ఆశీస్సులు పొందారని శ్రీ గురుపీఠం ట్రస్ట్ చైర్మన్,ప్రముఖ హైకోర్టు న్యాయవాది శివ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

శ్రీరామ్ ఫైనాన్స్ ఆధ్వర్యంలో మెరిట్ స్కాలర్‌షిప్స్



(మన మీ వార్త న్యూస్) : అక్టోబర్ 29, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-

ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు శ్రీరామ్ ఫైనాన్స్ నిజామాబాద్ రీజియన్ ఆధ్వర్యంలో స్కాలర్ షిప్స్ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నగరంలోని దుబ్బ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేశారు.

800 మంది విద్యార్థులకు..

నిజామాబాద్ రీజియన్ పరిధిలో సుమారు 800మంది విద్యార్థులకు స్కాలర్ షిప్స్ అందజేస్తున్నట్లు శ్రీరామ్ ఫైనాన్స్ రీజినల్ హెడ్ వినయ్ కుమార్ తెలిపారు. విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లుగా ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో దుబ్బ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ ఎం శ్రీనివాస్, శ్రీరామ్ ఫైనాన్స్ మేనేజర్లు జగదీష్, మన్మథ, షఫీ ఖాన్, శ్రీకాంత్?లు పాల్గొన్నారు.

నవంబరు 13 నుంచి 16వ తేదీ వరకు నాలుగు రోజులపాటు ఛట్ పూజోత్సవాలు

హైదరాబాద్ ఉత్తర భారతీయులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునే ఛట్ పూజోత్సవాలకు తెలంగాణ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసేందుకు జీవో విడుదల చేయడంపై జన్ సేవా సంఘ్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జన్ సేవా సంఘ్ ఆధ్వర్యంలో నవంబరు 13 నుంచి 16వ తేదీ వరకు నాలుగు రోజులపాటు ఛట్ పూజోత్సవాలను నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు బిశ్వదీప్ సింగ్ వెల్లడించారు. హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో పూజోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని నెక్లెస్ రోడ్, సంజీవయ్య పార్కుతో పాటు మొత్తం 30 ఘాట్‌లలో వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నవంబరు 13, 14 తేదీల్లో భక్తులు ఉపవాస దీక్షలు చేపడతారని, 15న సాయంత్రం సూర్యాస్తమయం సమయంలో నీటిలో నిలబడి సూర్యభగవానుడికి పూజలు చేస్తారని వివరించారు. 16న తెల్లవారుజామున 5 గంటల నుంచే సూర్యోదయ పూజలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

ఎమ్మార్పీఎస్ జెండా కర్రను తొలగించి కాంగ్రెస్ ఫ్లెక్సీలు కట్టడంపై చర్యలు తీసుకోవాలి

- ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు రామ్ రామ్ చందర్ మాదిగ మరియు ఎమ్మార్పీఎస్ టేకుమట్ల మండల అధ్యక్షులు మచ్చ శ్రీకాంత్ మాదిగ డిమాండ్

టేకుమట్ల అక్టోబర్ 29 (మన మీవార్త)

జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ జెండా, జెండా కర్రను తొలగించి, ఆ ప్రదేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంపై ఎమ్మార్పీఎస్ జెండాను, జెండా కర్రను తొలగించిన వారిని గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు రామ్ రామ్ చందర్ మాదిగ మరియు ఎమ్మార్పీఎస్ టేకుమట్ల మండల అధ్యక్షులు మచ్చ శ్రీకాంత్ మాదిగ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎమ్మార్పీఎస్‌కు సంబంధించిన జెండాను, జెండా కర్రను తొలగించి అదే ప్రదేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల ఫ్లెక్సీలు కట్టడం సరైన చర్య కాదని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి సంఘానికి, ప్రతి సంస్థకు తమ భావాలను వ్యక్తం చేసుకునే హక్కు ఉంటుందని తెలిపారు. ఒక సంఘానికి సంబంధించిన జెండాను తొలగించడం వల్ల ఆ సంఘం నాయకులు,



కార్యకర్తల మనోభావాలు దెబ్బతింటాయని అన్నారు.ఈ ఘటనకు బాధ్యులైన వారిని అధికారులు గుర్తించి విచారణ జరపాలని ఆయన కోరారు. జెండా, జెండా కర్రను తొలగించిన ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనకు సంబంధించి బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని సంబంధిత అధికారులను కోరారు.మండల కేంద్రంలో జరిగిన ఈ ఘటనపై అధికారులు స్పందించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపట్టాలని రామ్ రామ్ చందర్ మాదిగ మచ్చ శ్రీకాంత్ మాదిగ డిమాండ్ చేశారు.

మనస్థాపంతో యువకుడు ఆత్మహత్య

చిట్యాల, అక్టోబర్ 29 (మీవార్త)

మండల పరిధిలోని జడల్ పేట గ్రామం గాంధీనగర్ కాలనీకి చెందిన బోనగిరి తేజ (26) అనే యువకుడు మనస్థాపంతో పురుగుల మందు తాగి మృతి చెందినట్లు చిట్యాల ఎస్సై పోచంపల్లి సతీష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గాంధీనగర్ గ్రామానికి చెందిన బోనగిరి భద్రయ్య కుమారుడు తేజకు నాలుగు సంవత్సరాల క్రితం చెల్పూర్ గ్రామస్తుడైన కోడిపుంజుల భద్రయ్య కూతురు స్పందనతో వివాహం జరిగింది. వీరికి మూడు సంవత్సరాల కొడుకు కలడు. సుమారు ఒక నెల రోజుల క్రితం భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో భార్య స్పందన తన పుట్టినా ఊరు చెల్పూర్ కు వెళ్ళింది. భార్యను కాపురానికి రావాలని తేజ ఎన్నిసార్లు ఫోన్



చేసినా ఆమె రాకపోవడంతో మనస్థాపానికి గురయ్యాడు. ?దీంతో ఈనెల 28 వ తారీకు అనగా బుధవారం రోజున రాత్రి సుమారు 8 గంటల సమయంలో ఇంట్లో ఎవరికీ కనిపించకుండా గుర్తుతెలియని పురుగుల మందు తాగి కిందపడి కొట్టుకుంటున్నాడు. ఇది గమనించిన మృతుడి తల్లి సారమ్మ ఇంటి పక్కన ఉన్న బండారి సాయికుమార్‌కు చెప్పగా వెంటనే సాయికుమార్ 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అంబులెన్స్ ద్వారా భూపాల్‌పల్లిలోని వంద పడకల ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ రాత్రి 11:05 గంటల సమయంలో మరణించాడు. ?మృతుని తండ్రి బోనగిరి భద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతిపై ఎవరిపై ఎలాంటి అనుమానం లేదని ఆయన పేర్కొన్నట్లు ఎస్సై తెలిపారు. ఈ సంఘటనపై ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోందని ఎస్సై సతీష్ వెల్లడించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

- జిల్లాలో గుర్తించిన 20 బ్లాక్ స్పాట్లపై యాక్షన్ ప్లాన్ రూపొందించాలి: జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

మన మీ వార్త అక్టోబర్ 29 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని, ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో అవసరమైన సదుపాయాలు కల్పించి ప్రమాదాల సంఖ్యను తగ్గించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశంలో జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 20 బ్లాక్ స్పాట్లను గుర్తించామని, వాటిలో 17 జాతీయ రహదారులపై ఉన్నట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో ప్రమాదాలకు గల కారణాలను క్షేత్రస్థాయిలో విశ్లేషించి, ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలతో సమగ్ర యాక్షన్ ప్లాన్ రూపొందించి నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

ఎంజీఎం నుంచి వెంకట్రామ జంక్షన్ వరకు దెబ్బతిన్న రహదారిని పునరుద్ధరించాలి



ఎంజీఎం నుంచి వెంకట్రామ జంక్షన్ వరకు మెగా ఇంజనీరింగ్ సంస్థ చేపట్టిన పైప్‌లైన్ నిర్మాణ పనుల వల్ల దెబ్బతిన్న రహదారిని తిరిగి యథాస్థితికి తీసుకురావాలని రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశంలో నిర్ణయించారు. రహదారి దెబ్బతినడం వల్ల వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా, రహదారిని పునరుద్ధరించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. నర్సంపేటలో ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు నర్సంపేట ప్రాంతంలో సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల మధ్య ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించిన నేపథ్యంలో, ఆయా సమయాల్లో ప్రమాదాలకు గల కారణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని పోలీసు అధికారులకు సూచించారు. ప్రమాదాలకు దారితీస్తున్న పరిస్థితులను గుర్తించి, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు. రహదారులపై భారీ వాహనాల పార్కింగ్‌ను నియంత్రించాలి. మద్యం దుకాణాల సమీపంలో భారీ వాహనాలను రహదారులపై పార్కింగ్ చేయడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతున్నట్లు సమావేశంలో కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, రహదారులపై వాహనాల రాకపోకలకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూడాలని సూచించారు. రోడ్డు భద్రతా నిబంధనల అమలుపై సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని, గుర్తించిన బ్లాక్ స్పాట్ల వద్ద ప్రమాదాల నివారణకు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద స్పష్టం చేశారు.

ఈ రోడ్డు భద్రత కమిటీ సమావేశం లో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎల్ కిషోర్,అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్,ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, నేషనల్ హైవే పిడి భరద్వాజ్,ఆర్ అండ్ బి ఇఇ రాజేందర్, సంబధిత ఏ సి పి లు,ట్రాఫిక్ అధికారులు,మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారు, తదితర రోడ్ భద్రత కమిటీ సభ్యులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు

ఖానాపురం, అక్టోబర్ 29(మల్లేష్ మీవార్తప్రతినిధి) :

విద్యార్థులు చిన్న వయస్సు నుంచే చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని, తమ హక్కులతోపాటు బాధ్యతలను కూడా తెలుసుకోవాలని న్యాయవాదులు సూచించారు. సురక్షిత్ బచ్‌పన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలోని అశోక్‌నగర్ కస్తూర్బా పాఠశాల, సైనిక్ స్కూల్‌లో నర్సంపేట మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు సునీత, సాంబయ్య, రమేష్ పాల్గొని విద్యార్థులకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు, పౌరుల విధులు, బాలల హక్కులు, విద్యాహక్కు చట్టం, బాల్యవివాహాల నిరోధం, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, మహిళలు, బాలికల రక్షణకు సంబంధించిన చట్టాలు, సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఉచిత న్యాయసహాయం తదితర అంశాలను వివరించారు.చట్టాలపై అవగాహన లేకపోవడం వల్ల అనేకమంది తమ హక్కులను సక్రమంగా వినియోగించుకోలేకపోతున్నారని న్యాయవాదులు పేర్కొన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే రాజ్యాంగ విలువలు, సమానత్వం, సామాజిక





న్యాయం, చట్టాలను గౌరవించే మనస్తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఎవరైనా అన్యాయానికి గురైనప్పుడు భయపడకుండా సంబంధిత అధికారులను సంప్రదించాలని, అర్హులైన వారికి న్యాయ సేవాధికార సంస్థల ద్వారా ఉచిత న్యాయసహాయం అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా కస్తూర్బా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మేనక, సైనిక్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు సురేందర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో న్యాయపరమైన అవగాహన, సామాజిక బాధ్యత, క్రమశిక్షణను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. విద్యార్థులను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడంలో పాఠశాల విద్యతోపాటు రాజ్యాంగ విలువలపై అవగాహన కల్పించడం కూడా ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో న్యాయవాదులు సునీత, సాంబయ్య, రమేష్, ప్రధానోపాధ్యాయురాలు మేనక, సైనిక్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు సురేందర్, ఉపాధ్యాయ బృందం, ఎస్ ఐ గుగులోత్ రామ్మోహన్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

తెలంగాణ మొత్తాన్ని కరువు రాష్ట్రంగా ప్రకటించాలి:సీపీఐ, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

హైదరాబాద్ ఎల్ నినో పేరుతో కరువు విలయ తాండవం చేస్తోంది . రాజకీయంగా ఒకరిపైనన ఒకరూ బురద జల్లుకోవడం మానేసి దీని నుంచి ఎట్లా బయటపడాలో ఆలోచించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కరువు అనేది ప్రపంచ వ్యాప్తంగా సంభవించింది. కరువును కొన్ని మండలాలకే పరిమితం చేయకూడదు. తెలంగాణ మొత్తాన్ని కరువు రాష్ట్రంగా ప్రకటించాలి. బియ్యం ధర, నీళ్ల ట్యాంకర్ ధరలు ఇప్పుడే పెరిగిపోయాయి. ఎక్కడైనా అక్రమంగా నిల్వ చేస్తే సీపీఐ కరువు దాడులు చేస్తోందని హెచ్చరించారు. పేద ప్రజలకు ప్రభుత్వం ఆధ్వర్యంలో పంపిణీ చేస్తుంది . జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసేలా కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలి. కరువు పరిస్థితిని పరిశీలించేందుకు నవంబర్ 3, 4 తేదీల్లో జిల్లా కేంద్రాల్లో పర్యటిస్తాం. బ్రెజిల్ లో కమ్యూనిస్టులు మళ్లీ గెలిచారు . ప్రపంచ దేశాల్లో కమ్యూనిస్టులు గెలుస్తున్నారు.

డిసెంబర్ 14న చలో ఢిల్లీ

- రామ్ లీలా మైదానంలో బీసీల సింహగర్జన
- జనగణనలో ఓబీసీ కాలమ్ చేర్చకపోతే దేశంలో బీజేపీకి ఇదే చివరి పాలన
- ఓబీసీ కాలమ్ పై స్పందించని రాజకీయ పార్టీల భరతం పడతాం
- వేముల మహేందర్ గౌడ్ హెచ్చరిక

భూపాలపల్లి అక్టోబర్29 (మీవార్త)

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో డిసెంబర్ 14న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని, ఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో డిసెంబర్ 14న జరగబోయే బీసీల సింహగర్జనకు దేశం నలుమూలల నుంచి లక్షలాది మంది బీసీలు తరలివచ్చి జనగణనలో ఓబీసీ కాలమ్ చేర్చే విధంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడిని పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్ బీసీ సమాజానికి పిలుపునిచ్చారు. గురువారం ఆయన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీ కులగణన చేస్తామని బీసీలకు హామీనిచ్చి పచ్చిమోసం చేసిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై బీసీల పక్షాన నిలబడి పోరాడాల్సిన కొన్ని రాజకీయ పార్టీలు మౌనం వహిస్తున్నాయని, జనగణనలో కులగణనపై మాట్లాడని రాజకీయ పార్టీల వైఖరిని బీసీ సమాజం గమనిస్తుందన్నారు. బీసీ న్యాయమైన డిమాండ్లపై ఉద్యమించని రాజకీయ పార్టీలను, ఆ పార్టీల అధినేతలను రాజకీయంగా భూస్థాపితం చేస్తామని హెచ్చరించారు. దేశంలో కుక్కలకు, నక్కలకు, పిల్లులకు లెక్కలను తీస్తున్న కేంద్ర ప్రభుత్వం మనుషులుగా జీవనం సాగిస్తున్న ఓబీసీల లెక్కలను తీయకపోవడంలో ఆంతర్యం ఏమిటని ఆయన ప్రధాని నరేంద్ర మోడీని ప్రశ్నించారు. కులగణనపై ఇప్పటికే బీజేపీపై బీసీల తిరుగుబాటు మొదలైందని, దేశంలోని 29 రాష్ట్రాలలో



బీసీ సమాజమంతా ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన ర్యాలీలు, ధర్నాలు, ఆందోళన కార్యక్రమాలను చేపట్టారని, చివరి అస్త్రంగా లక్షలాది మంది బీసీలతో డిసెంబర్ 14న రామ్ లీలా మైదానంలో బీసీల సింహ గర్జన నిర్వహిస్తున్నామని, డిసెంబర్ 15న పార్లమెంట్ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు మహేందర్ గౌడ్ వెల్లడించారు. ఓబీసీ అని చెప్పుకునే ప్రధాని నరేంద్ర మోడీ జనగణనలో కులగణన చేపట్టకుండా..కాలక్రమేనా బీసీలను రాజకీయంగా సమాధి చేసేందుకు ఆర్ఎస్ఎస్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నాడని ఆరోపించారు. బీసీలపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇలాంటి వైఖరినే కొనసాగిస్తే..బీజేపీ పార్టీలోని బీసీలు ఆ పార్టీపై తిరుగుబాటు ఎగురవేయాలని, బీసీ వ్యతిరేక చర్యలను విడనాడకపోతే దేశంలో భారతీయ జనతా పార్టీకి ఇదే చివరి పాలన అవుతుందని మహేందర్ గౌడ్ హెచ్చరించారు.

బీఆర్ ఎస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపుకు సమిష్టి కృషి

- ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి

ఖానాపురం, అక్టోబర్ 29 (మల్లేష్ మీ వార్త ప్రతినిధి):

వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ ఎస్ పార్టీ అభ్యర్థి విజయానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని శాసనమండలి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, నర్సంపేట నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు.

ఖానాపురం మండల కేంద్రంలోని రెడ్డి పెద్ద రంగారెడ్డి గార్డెన్స్‌లో బుధవారం నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమానికి పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, ఎమ్మెల్సీ ఎన్నికల క్లస్టర్ ఇన్‌చార్జులు, ఇతర బాధ్యులతో సమావేశం నిర్వహించి ఓటరు నమోదు ప్రక్రియపై సమీక్షించారు. నవంబర్ 6వ తేదీలోపు అర్హులైన పట్టభద్రులందరి ఓటరు నమోదును పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అర్హులైన పట్టభద్రులందరినీ ఓటర్లుగా నమోదు



చేయించి, ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును తిరిగి ముఖ్యమంత్రిని చేయడమే స్వర్గీయ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆశయమని, ఆ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

స్వర్గీయ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆశయాలను నెరవేర్చేందుకు ప్రతి ఒక్కరూ కట్టుబడి పనిచేయాలని అన్నారు. నియోజకవర్గ ప్రజలు, రైతులు, నాయకులు, కార్యకర్తల కష్టసుఖాల్లో తాను పాలుపంచుకుంటానని, వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.అనంతరం మండల, గ్రామ స్థాయి క్లస్టర్ ఇన్‌చార్జులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఓటరు నమోదు పురోగతిని సమీక్షించారు. అర్హులైన పట్టభద్రులను గుర్తించి, నిర్దిష్ట గడువులోగా నమోదు ప్రక్రియను పూర్తి చేసేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మహాలక్ష్మి వెంకటనర్సయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్ గౌడ్, మాజీ ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామి నాయక్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు కోరే సుధాకర్, జిల్లా నాయకుడు వల్లెపు శ్రీనివాస్, సర్పంచుల ఫోరం మండల ప్రధాన కార్యదర్శి దాసరి రమేష్, వివిధ గ్రామాల బీఆర్ ఎస్ సర్పంచ్ లు, ఉపసర్పంచులు భూషబోయిన రాజు యాదవ్, సింగ్ సుధాకర్, గుండ్లపల్లి విజయ్, మహమ్మద్ అజహార్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్ తరలింపు హామీపై కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

- రాజకీయ లబ్ధి కోసమే ఈటల రాజేందర్ పాదయాత్ర చేస్తున్నారు
- జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్

దమ్మాయిగూడ, అక్టోబర్ 29: (వార్త ప్రతినిధి)

జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ తరలింపు హామీపై కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ స్పష్టం చేశారు. డంపింగ్ యార్డ్ విషయంలో బీజేపీ వైఖరిని, ఎంపీ ఈటల రాజేందర్ వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

గురువారం దమ్మాయిగూడలోని తిరుమల గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడిగా గెలిచిన ఈటల రాజేందర్ జవహర్ నగర్ ప్రజలకు డంపింగ్ యార్డ్ కాలుష్యం నుంచి విముక్తి కల్పించాల్సింది పోయి, రాజకీయ ప్రయోజనాల కోసం పాదయాత్రలు చేస్తున్నారని విమర్శించారు.

"గతంలో రాష్ట్ర మంత్రిగా పనిచేసిన సమయంలో డంపింగ్ యార్డ్ తరలింపుపై ఎందుకు మాట్లాడలేదు? జవహర్ నగర్ చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఎన్నో





ఏళ్లుగా కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నా, ప్రజల సమస్యను పరిష్కరించేందుకు ఇప్పటివరకు ఏం చేశారో ప్రజలకు సమాధానం చెప్పాలి" అని ప్రశ్నించారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారానికి కట్టుబడి ఉందని అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం నుంచి అవసరమైన అనుమతులు, సహకారం తీసుకురావాల్సిన బాధ్యత ఎంపీగా ఈటల రాజేందర్ పై ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సింది పోయి కాంగ్రెస్ పై విమర్శలు చేయడం ఎంతవరకు సబబు అని నిలదీశారు.

జవహర్ నగర్ ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు బాధ్యత వహిస్తూ డంపింగ్ యార్డ్ తరలింపుపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక ప్రకటించాలని కోరారు. రాజకీయ విమర్శలకు పరిమితం కాకుండా సమస్య పరిష్కారం కోసం చిత్తశుద్ధితో పనిచేయాలని ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ సూచించారు.

ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా, మాజీ కార్పొరేటర్ కుతాడి సాయి, మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్, సీనియర్ నాయకులు కల్లేపల్లి సదానంద్, బూడిద వెంకటేష్, ఎర్రగుడ్ల వెంకటేశ్వర్లు, గజ్వేల్ శంకర్, బల్లి శ్రీనివాస్ గుప్తా, మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, దమ్మాయిగూడ జేఏసీ సభ్యులు, కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటా..

- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి..
- మృతుల కుటుంబాలకు పరామర్శ.. ప్రగాఢ సానుభూతి

అక్టోబర్ 30,10,2026 పరకాల ప్రతినిధి మన మీ వార్త

హనంకొండ జిల్లా పరకాల మున్సిపాలిటీలోని 2, 22వ వార్డులకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల కుటుంబాలను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బీఆర్ఎస్ నాయకుడు బొచ్చు చిన్ని కృష్ణ తల్లి నర్సమ్మ, బొచ్చు అశోక్ (అయిలయ్య), తూముల సాంబయ్య ఇటీవల మృతి చెందడంతో గురువారం వారి నివాసాలకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను అడిగి వివరాలు తెలుసుకుని వారికి ధైర్యం చెప్పారు.

ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలు, వారి కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని, కష్టసుఖాల్లో తోడుగా నిలుస్తానని అన్నారు. కార్యకర్తల కుటుంబాలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని భరోసా ఇచ్చారు.

రంగమ్మ ప్రథమ వర్ధంతికి హాజరైన చల్లా..

పరకాల సీనియర్ నాయకుడు, మాజీ వైస్ చైర్మన్ రేగురి విజయపాల్ రెడ్డి తల్లి రేగురి రంగమ్మ ప్రథమ వర్ధంతి కార్యక్రమంలోనూ చల్లా ధర్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంగమ్మ చిత్రపటానికి



పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రాయన్ పల్లి వద్ద కల్వర్టు పనులు త్వరగా పూర్తి చేయాలి



(మన మీ వార్త న్యూస్) : అక్టోబర్ 29, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-

ఇందల్వాయి మండలం చంద్రాయన్ పల్లి కల్వర్టు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సీపీ సాయిచైతన్య సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్న చంద్రాయన్ పల్లి వద్ద స్పాట్‌ను పరిశీలించారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి

నేషనల్ హైవే మేనేజర్ (టెక్) రంగారావు, హైవే కాంట్రాక్టర్ బాల్ రెడ్డితో సీపీ మాట్లాడారు. కల్వర్టు నిర్మాణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్మాణ పనుల కారణంగా వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే.. జాతీయ రహదారిపై వాహనదారులు వేగాన్ని నియంత్రించుకునేలా తగిన ప్రదేశాల్లో స్పష్టమైన సూచిక బోర్డులు, ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. రాత్రి వేళల్లోనూ వాహనదారులకు ప్రమాదకర ప్రాంతాలు ముందుగానే కనిపించేలా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. టోల్ ప్లాజా సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ , రహదారిపై ప్రమాదాల నివారణకు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. ఈ తనిఖీల్లో ఏసీపీ ప్రకాష్, స్పెషల్ బ్రాంచ్ ఇన్ స్పెక్టర్ మల్లేష్, డిచ్‌పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వినోద్, ఇందల్వాయి ఎస్సై సుమలత, ఇందల్వాయి సర్పంచ్ రఘు పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

- అధికారులకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశం

కాసిపేట, అక్టోబర్ 29 : (మన మీ వార్త మండల ప్రతినిధి)

ప్రభుత్వ విద్యాసంస్థల్లో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి, త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు.గురువారం కాసిపేట మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల





విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. పాఠశాలలో నిర్మిస్తున్న అదనపు గదుల పనులను పరిశీలించి, నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం పాఠశాల వంటశాలను పరిశీలించిన కలెక్టర్.. విద్యార్థులకు నిర్దేశిత మెనూ ప్రకారం సకాలంలో పోషకాహారం అందించాలని తెలిపారు. వంటకాల తయారీలో తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యావసర సరుకులను వినియోగించాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి, విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.అనంతరం రేకులగూడలోని ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను మండల పంచాయతీ అధికారి షేఖ్ సఫ్దర్‌అలీ, డిప్యూటీ తహసీల్దార్ అంజయ్యతో కలిసి సందర్శించారు. పాఠశాలలోని సౌకర్యాలను పరిశీలించి, విద్యార్థులకు అందుతున్న సదుపాయాలను సమీక్షించారు.

సీపీ సుమతి ఆదేశాల మేరకు జవహర్ నగర్ లో వాహన తనిఖీలు

- క్రైమ్ అవేర్ నెస్ లో భాగంగా తనిఖీలు చేపట్టిన పోలీసులు - ఏసీపీ చక్రపాణి, సీఐ సైదులు



జవహర్ నగర్, అక్టోబర్ 29:(వార్త ప్రతినిధి)

రాచకొండ పోలీస్ కమిషనర్ సీపీ సుమతి ఆదేశాల మేరకు జవహర్ నగర్ లో పోలీసులు ముమ్మర వాహన తనిఖీలు చేపట్టారు. కుషాయిగూడ ఏసీపీ చక్రపాణి, జవహర్ నగర్ సీఐ సైదులు ఆధ్వర్యంలో అంబేద్కర్ నగర్ లోని ఫ్లవర్ గార్డెన్ వద్ద ఈ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ చక్రపాణి మాట్లాడుతూ, ప్రజల్లో నేరాల పట్ల అవగాహన కల్పించేందుకు, క్రైమ్ అవేర్ నెస్ లో భాగంగా ఈ వాహన తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రతే లక్ష్యంగా ఈ తనిఖీలు కొనసాగుతాయన్నారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, సరైన పత్రాలు కలిగి ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిఘా ఉంచినట్లు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా నేరం జరిగినా, అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ తనిఖీల్లో ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా అడ్మిషన్స్ చేపడుతున్న రిసోనెన్స్ యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలి



నిజామాబాద్ : నిజామాబాద్ జిల్లాలో అసలు ఎలాంటి అనుమతులు లేకుండా 2027-28 విద్యా సంవత్సరానికై జూనియర్ కాలేజీ అడ్మిషన్లు చేస్తున్నటువంటి రిసోనెన్స్ యాజమాన్యం కఠినమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ స్టూడెంట్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జ్వాల డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ మేరకు టిఎస్ఏ ఆధ్వర్యంలో జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు అధికారికి వినతి పత్రం అందజేశారు. అనంతరం జ్వాల మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా అడ్మిషన్ ప్రక్రియ చేయడం ఏమిటని ప్రశ్నించారు. బోర్డు అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ విద్యా సంవత్సరం పూర్తికాకుండా వచ్చే విద్యా సంవత్సరానికి జూనియర్ కళాశాల అడ్మిషన్స్ చేయడం దారుణమని అన్నారు. ప్రభుత్వ కళాశాలలకు అదే విధంగా ప్రైవేటు కళాశాలలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని వారు అసలు విద్యాశాఖ నుంచి బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇంత విచ్చల విడిగా అడ్మిషన్ ప్రక్రియ చేపట్టడం ఏమిటని ప్రశ్నించారు. తక్షణమే ఆ యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇంటర్మీడియట్ నుంచి గుర్తింపు వచ్చిన తర్వాతనే అడ్మిషన్ చేసేలా చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఈ అంశంపై జిల్లా కలెక్టర్ ని కలుస్తామని అవసరమైతే బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ కు వెళ్లి ఆ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాల్సిందిగా డిమాండ్ చేస్తున్నామన్నారు.

31న జిల్లా అభివృద్ధి సమన్వయ, మానిటరింగ్ కమిటీ (దిశ) సమావేశం

నిజామాబాద్ : సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో ఈ నెల 31న (శనివారం) ఉదయం 10.30 గంటలకు నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ, మానిటరింగ్ కమిటీ (దిశ) సమావేశం జరగనుందని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సాయన్న తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిధులచే వివిధ శాఖల ద్వారా అమలవుతున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ఈ సమావేశంలో చర్చించడం జరుగుతుందని అన్నారు. జిల్లా ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు సకాలంలో విచ్చేయాలని కోరారు.

ప్రతి డివిజన్‌కు కేటాయించిన రూ.20 లక్షల నిధులతో అభివృద్ధి పనులకు శ్రీకారం

38,40వ డివిజన్లలో భూమిపూజ చేసిన నగర మేయర్ కూరగాయల ఉమారాణి



నిజామాబాద్ : నగర అభివృద్ధిలో భాగంగా కౌన్సిల్ సమావేశంలో ప్రతి డివిజన్‌కు కేటాయించిన రూ.20 లక్షల నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా గురువారం 38వ డివిజన్‌లో సీసీ డ్రెయిన్, కల్వర్టు నిర్మాణ పనులకు, 40వ డివిజన్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు నగర మేయర్ కూరగాయల ఉమారాణి రమేష్ భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నిజామాబాద్ నగరంలోని అన్ని డివిజన్లలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టుల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. చేపట్టిన పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, స్థానిక కార్పొరేటర్ ప్రవీణ్ యాదవ్, నరేందర్, కాంగ్రెస్ నాయకులు శివచరణ్, భక్తవత్సలం, వాహిద్, స్థానిక ప్రజలు,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వరి సాగుకు దూరంగా ఉండాలి --



. వ్యవసాయ అధికారి సిద్ధి రమేశ్వర్.

రెంజల్ : రెంజల్ మండలంలోని బోర్గం గ్రామంలో మండల వ్యవసాయ అధికారి సిద్ధి రామేశ్వర్ ఆధ్వర్యంలో ఎల్‌నినో ప్రభావం, భూగర్భ జలాల తగ్గుదలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల జొన్న, మినుము, పెసర, కుసుమ, పొద్దుతిరుగుడు వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. నీటి వనరులను పొదుపుగా వినియోగించుకుంటూ, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ భూమారెడ్డి, గ్రామస్తులు కార్తీక్ యాదవ్, ఫెరోజ్,రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఓటమి నుంచి పాఠం నేర్చుకోవాలి : ఎమ్మెల్యే భూపతిరెడ్డి

(మన మీ వార్త న్యూస్) : అక్టోబర్ 29, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-

క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓటమిని చూసి నిరుత్సాహపడకుండా కొత్త పాఠాలు నేర్చుకుంటూ ముందుకు సాగాలని రూరల్ ఎమ్మెల్యే డా.భూపతి రెడ్డి అన్నారు. ఖిల్లా డిచ్‌పల్లి ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ మండలస్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు.

ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయి

ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి తమ ప్రతిభను చాటుకోవాలని ఆకాంక్షించారు. క్రీడలు శారీరక దారుఢ్యాన్ని పెంపొందించడంతో పాటు మానసిక ఉల్లాసాన్ని, క్రమశిక్షణను, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని పేర్కొన్నారు. గ్రామీణ క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహం గ్రామీణప్రాంతాల్లో ఎంతో ప్రతిభ, నైపుణ్యం కలిగిన విద్యార్థులు ఉన్నారని, వారిలోని సామర్థ్యాలను వెలికితీసి తగిన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్‌తో పాటు వివిధ క్రీడా పోటీలను నిర్వహిస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తోందన్నారు.

రూరల్‌లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్..



విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు పాఠశాల స్థాయి నుంచే క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులను ఈ దిశగా ప్రోత్సహించాలని ఎమ్మెల్యే కోరారు. పిల్లల చదువులు తల్లిదండ్రులకు ఆర్థిక భారంగా మారకుండా ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తూ ఉచితంగా నాణ్యమైన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ఇందులో భాగంగా రూరల్ నియోజకవర్గానికి రూ.200 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరైందన్నారు. దాని నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. అదేవిధంగా ధర్పల్లి మండలంలో రూ.8 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.తెలంగాణ వార్తలు

డిచ్‌పల్లి మండలానికి రూ.2.5 కోట్లతో ఎస్టీ బాలుర వసతి గృహం మంజూరైందని ఎమ్మెల్యే తెలిపారు. అలాగే మానవతా సదన్‌లోని పిల్లల సంక్షేమం, విద్యాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని రూ.8.5 కోట్లతో వసతి గృహం మంజూరైందని వెల్లడించారు. ఈ వసతి గృహానికి త్వరలో శంకుస్థాపన చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ యాదగిరి, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు సీతయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు అమ్మతాపూర్ గంగాధర్, తారాచంద్ నాయక్, పొలాసని శ్రీనివాస్, ఉమ్మాజి నరేష్, సుదర్శన్, ఏజీ దాస్, ధర్మాగౌడ్, నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

జిల్లాలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు..: సుదర్శన్ రెడ్డి

(మన మీ వార్త న్యూస్) : అక్టోబర్ 29, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-

ఎల్ నినో ప్రభావంతో విపత్కర పరిస్థితులు నెలకొని ఉన్న ప్రస్తుత తరుణంలో జిల్లాలో తాగునీటికి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి అన్నారు. కలెక్టరేట్?లో గురువారం కలెక్టర్ ఇలా త్రిపాఠి తో కలిసి మున్సిపల్ కమిషనర్లు, మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్, ఆర్ డబ్ల్యూఎస్ తదితర అధికారులతో కలిసి సమావేశమయ్యారు.

జలాశయాల్లో అందుబాటులో నీళ్లు..

ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రధాన తాగునీటి వనరులుగా ఉపయోగపడుతున్న నిజాంసాగర్, శ్రీరాంసాగర్ జలాశయాలలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలను పూర్తిగా తాగునీటి అవసరాల కోసమే వినియోగించాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రైతులు యాసంగిలో తక్కువ నీటి అవసరం ఉండే కూరగాయలు, పప్పు దినుసులు వంటి పంటలు విత్తుకోవాలని కోరారు. ఆరుతడి పంటలకు కూడా అవసరం మేరకే సాగు నీరు వినియోగించుకునేందుకు వీలుగా రైతుల ప్రయోజనాల కోసం అన్ని మండలాలకు సబ్సిడీపై రెయిన్ గన్స్ మంజూరు చేయాలని నిర్ణయించామన్నారు. ఒక్కో యూనిట్ ధర 24 వేలు



ఉండగా, అందులో 8 వేలు చెల్లిస్తే మిగతా మొత్తాన్ని ప్రభుత్వం రాయితీ కింద భరిస్తుందని తెలిపారు. పట్టణాల్లో కొత్త బోర్లు వేయకుండా చూడాలన్నారు.

ఆర్వోబీ పనులు యుద్ధ ప్రాతిపదికన పర్తి చేయాలి

ఇదిలా ఉండగా..

మాధవనగర్, అర్సపల్లి ప్రాంతాల్లో కొనసాగుతున్న రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మాధవనగర్ ఆర్వోబీ పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 13 విడతల్లో రూ.42కోట్ల నిధులు కేటాయించిందన్నారు. అర్సపల్లి ఆర్వోబీకి కూడా రూ.11కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని వెల్లడించారు. అయినప్పటికీ కొంత మంది నాయకులు అవగాహన లేకుండా తప్పుడు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజల సౌకర్యార్థం ఆర్వోబీల నిర్మాణాలను నాలుగైదు నెలల్లో పూర్తి చేయాలని ఆర్‌అండ్?బీ అధికారులకు, కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులకు గడువు విధించారు.

నీటి వృధాను అరికట్టాలి..కలెక్టర్?

కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, ఎక్కడ కూడా నీటి వృథా జరుగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని.. రక్షిత నీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు. జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ప్రజల్లో నీటి పొదుపుపై విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. సమీక్షలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ గవర్నింగ్ కౌన్సిల్ చైర్?పర్సన్? డాక్టర్ కవితా రెడ్డి, అదనపు కలెక్టర్లు రాజాగౌడ్, భుజంగరావు, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, డీఆర్డీవో సాయన్న, జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి, ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్, సివిల్ సప్లైస్ అధికారులు ప్రవీణ్, అరవింద్ రెడ్డి, మిషన్ భగీరథ అధికారులు స్వప్న, రాకేష్, పబ్లిక్ హెల్త్ ఈఈ తిరుపతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏఐ యుగంలోనూ అందని సిగ్నల్!

- ఆదివాసీ గ్రామాల్లో డిజిటల్ చీకట్లు.. సెల్‌ఫోన్ నెట్‌వర్క్ కోసం ప్రజల ఎదురుచూపులు

కామారెడ్డి, అక్టోబరు 29: (మన మీ వార్త మండల ప్రతినిధి)

ఓ వైపు ఐదో తరం (5జీ) సాంకేతిక పరిజ్ఞానంతో ప్రపంచం పరుగులు పెడుతుంటే.. మరోవైపు మారుమూల ఆదివాసీ గ్రామాల ప్రజలు కనీస సెల్‌ఫోన్ సిగ్నల్ కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలోని ఉమ్మడి సోనాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో నెట్‌వర్క్ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు, అత్యవసర వైద్య సేవలు అవసరమైన వారు ఈ సమస్యతో సతమతమవుతున్నారని చెబుతున్నారు.

- ఆన్‌లైన్ సేవలకు అందని దూరంలో రైతులు

ప్రభుత్వ పథకాలు, వ్యవసాయ సబ్సిడీలు, విత్తనాలు, ఎరువుల బుకింగ్ వంటి సేవలు ఆన్‌లైన్ ఆధారితంగా మారుతున్న నేపథ్యంలో నెట్‌వర్క్ సమస్య రైతులకు ఇబ్బందిగా మారింది. ఓటీపీ పొందాలన్నా, ఆన్‌లైన్ లావాదేవీలు నిర్వహించాలన్నా సిగ్నల్ అందే ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. దీంతో సమయం, డబ్బు వృథా అవుతున్నాయని పేర్కొంటున్నారు.

విద్యార్థులు, నిరుద్యోగులకు తప్పని తిప్పలు

ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఇంటర్నెట్ కీలకంగా మారింది. ప్రభుత్వ ఉద్యోగ ప్రకటనలు, దరఖాస్తులు, హాల్‌టికెట్లు, పరీక్షల ఫలితాలు తెలుసుకోవడానికి విద్యార్థులు, నిరుద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులు సమర్పించే సమయంలో నెట్‌వర్క్ అంతరాయం ఏర్పడితే అవకాశాలు చేజారిపోయే ప్రమాదం ఉందని యువత ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఉన్నత విద్య అభ్యసించే విద్యార్థులు ఆన్‌లైన్ పాఠాలు వినడం, అధ్యయన సామగ్రిని పొందడం కూడా కష్టంగా మారిందని చెబుతున్నారు.



సిడం. మోతిరాం జర్నలిస్ట్ కాసిపేట

అత్యవసర సమయాల్లోనూ అవస్థలే!

అనారోగ్యం, ప్రమాదాలు, ప్రసవ సమయాల్లో అత్యవసర సేవల కోసం ఫోన్ చేయాల్సి వచ్చినప్పుడు సిగ్నల్ సమస్య తీవ్ర ఇబ్బందులకు దారితీస్తోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లో అత్యవసర వైద్య సహాయం కోసం 108 అంబులెన్స్‌కు సమాచారం అందించడంలో ఇబ్బందులు ఎదురైతే ప్రాణాపాయం ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు.

హామీలకే పరిమితమా?

గ్రామాల్లో నెలకొన్న నెట్‌వర్క్ సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ ఆశించిన ఫలితం కనిపించడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. డిజిటల్ సేవలను గ్రామీణ ప్రాంతాలకు విస్తరిస్తున్న తరుణంలో ఆదివాసీ గ్రామాల్లో కనీస మొబైల్ కనెక్టివిటీ లేకపోవడం విచారకరమని అభిప్రాయపడుతున్నారు.

శాశ్వత పరిష్కారం చూపాలి

సోనాపూర్, గట్రాపల్లి గ్రామ పంచాయతీల పరిధిలోని మారుమూల గ్రామాల నెట్‌వర్క్ సమస్యను సంబంధిత అధికారులు, టెలికాం సంస్థలు గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. అవసరమైన ప్రాంతాల్లో కొత్త సెల్ టవర్లు ఏర్పాటు చేయడంతోపాటు, ఇప్పటికే ఉన్న టవర్ల సామర్థ్యాన్ని పరిశీలించి మెరుగుపరచాలని విజ్ఞప్తి చేస్తున్నారు. రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు, సామాన్య ప్రజలకు అంతరాయం లేని మొబైల్ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. డిజిటల్ ఇండియా లక్ష్యం మారుమూల ఆదివాసీ గ్రామాలకూ చేరాలంటే.. ముందుగా అక్కడ సిగ్నల్ అందాలి. తమ గ్రామాలకు కూడా కనీస నెట్‌వర్క్ సౌకర్యం కల్పించి, డిజిటల్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

వడ్డీరేట్లను యథాతథంగా ఉంచిన అమెరికా కేంద్ర బ్యాంక్..!



అగ్రరాజ్యం అమెరికాలో ద్రవ్యోల్బణం ఆందోళనకరస్థాయిలో కొనసాగుతున్నప్పటికీ.. ఆ దేశ కేంద్ర బ్యాంక్ అయిన ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచింది. అమెరికా మధ్యంతర ఎన్నికల ముందు ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకుంది. రెండు రోజులపాటు జరిగిన పాలసీ సమావేశం అనంతరం.. వడ్డీ రేట్లను 3.75% నుంచి 4.00% శ్రేణిలోనే కొనసాగిస్తున్నట్లు ప్రకటించింది. భవిష్యత్తులో అనుసరించాల్సిన విధానాలపై స్పష్టత కోసం ఇంకొంత సమాచారాన్ని విశ్లేషించాల్సి ఉందని, అందుకే ఈసారి పెంపునకు విరామం ఇస్తున్నామని తెలిపింది. ద్రవ్యోల్బణం ఇంకా అధిక స్థాయిలోనే ఉందని ఫెడ్ తన ప్రకటనలో పేర్కొన్నది. వడ్డీ రేట్ల పెంపును నిలిపివేయడంవల్ల మరిన్ని వివరాలను సేకరించి విశ్లేషించేందుకు అవకాశం లభిస్తుందని తెలిపింది. ద్రవ్యోల్బణాన్ని తిరిగి రెండు శాతం లక్ష్యానికి సకాలంలో చేర్చేందుకు ఎలాంటి విధానాలు అవసరమో నిర్ధారించడానికి ఈ సమాచారం ఉపయోగపడుతుందని పేర్కొన్నది. అమెరికాలో ద్రవ్యోల్బణాన్ని నియంత్రించేందుకు వడ్డీరేట్లను పెంచడం లేదా తగ్గించడం వంటి నిర్ణయాలను ఫెడ్ తీసుకుంటుంది. వడ్డీరేట్ల పెంపు ద్వారా రుణాలను, ఖర్చులను తగ్గించి ధరల పెరుగుదలకు అడ్డుకట్ట వేస్తుంది. గత నెలలోనే ఫెడ్ చైర్మన్ కెవిన్ వార్ష్ నేతృత్వంలోని కమిటీ.. మూడేళ్లలో తొలిసారిగా వడ్డీ రేట్లను పెంచింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రేట్లను తగ్గించాలని డిమాండ్ చేసినప్పటికీ ద్రవ్యోల్బణాన్ని కట్టడిచేసే లక్ష్యంతో ఫెడ్ ఈ నిర్ణయం తీసుకుంది. సెప్టెంబర్ నెలలో అమెరికాలో వినియోగదారుల ధరలు గత ఏడాదితో పోలిస్తే 3.7% పెరిగాయి. ఇరాన్ యుద్ధానికి ముందు ఫిబ్రవరిలో ఇది కేవలం 2.4% గానే ఉంది. యూఎస్ ఫెడ్ వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచినప్పటికీ ఇది ప్రపంచ ఈక్విటీ మార్కెట్లకు సానుకూల సంకేతం కాదని నిపుణులు విశ్లేషిస్తున్నారు. కర్మ క్యాపిటల్ పోర్ట్‌ఫోలియో మేనేజర్ థామస్ ప్రిజు మాట్లాడుతూ.. ఫెడ్ రేట్లను మార్చకపోవడం సానుకూలంగా కనిపించినా, ఇది తాత్కాలిక విరామం మాత్రమే కావచ్చునని అభిప్రాయపడ్డారు. ఫెడ్ పాలసీ కమిటీలో జరిగిన ఓటింగ్‌లో 10-2 తేడాతో ఈ నిర్ణయం తీసుకున్నారని, ఇద్దరు సభ్యులు 25 బేసిస్ పాయింట్ల పెంపునకు మొగ్గు చూపారని తెలిపారు. ద్రవ్యోల్బణం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో కమిటీలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయని ఇది స్పష్టం చేస్తోందని పేర్కొన్నారు.

ఎరుపెక్కిన ఆకాశం..

ఛత్తీస్‌గఢ్‌లోని పలు ప్రాంతాల్లో ఆకాశం అకస్మాత్తుగా రక్తవర్ణంలోకి మారడం తీవ్ర కలకలం రేపింది. దంతెవాడ, కిరండోల్ వంటి ప్రదేశాల్లో నింగి ఎర్రగా మారిన దృశ్యాలు ఇప్పుడు ఇంటర్నెట్‌లో వైరల్ అవుతున్నాయి. అర్నబ్ తుపాను కారణంగానే వాతావరణంలో ఈ వింత మార్పు చోటుచేసుకుందని స్థానికులు, నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. అయితే, ఆకాశం ఎర్రగా మారడానికి, తుపానుకు మధ్య ఉన్న సంబంధంపై అధికారికంగా ఎటువంటి ధ్రువీకరణ లేదు.తుపాను సమయంలో బలమైన గాలులు వీచినప్పుడు భారీ మొత్తంలో ధూళి, ఇసుక, ముఖ్యంగా ఇనుము అధికంగా ఉండే ఎర్రమట్టి గాలిలోకి లేస్తాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. 'న్యూయార్క్ టైమ్స్' కథనం ప్రకారం.. ఈ ధూళి కణాలు వాతావరణంలోని పైపొరల్లోకి చేరడం వల్ల ఆకాశం అసాధారణంగా ఎర్రటి రంగులో కనిపిస్తుంది. అర్నబ్ తుపాను విషయంలోనూ ఇదే జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. ఈ భయానక దృశ్యాలు సోషల్ మీడియాలో



సృజనాత్మక చర్చకు దారితీశాయి. ప్రముఖ నెట్‌ఫ్లిక్స్ సిరీస్ 'స్ట్రేంజర్ థింగ్స్'లోని 'అప్‌సైడ్ డౌన్' ప్రపంచాన్ని గుర్తుచేస్తోందని ఒక యూజర్ కామెంట్ చేయగా, 'వెక్‌నా వస్తున్నాడు' అంటూ మరో యూజర్ పోస్ట్ చేశారు. మరికొందరు దీన్ని 'ఈవిల్ డెడ్' సినిమా సెట్‌తో పోల్చారు. అయితే, కొందరు మాత్రం ఇది ప్రమాదకరమైన సంకేతం కావచ్చని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.

ఇలాంటి ఘటనే ఈ ఏడాది మే నెలలో ఆస్ట్రేలియాలోనూ చోటుచేసుకుంది. 'నరెల్లే' తుపాను పశ్చిమ ఆస్ట్రేలియాలోని డెన్‌హామ్‌ను తాకినప్పుడు ఆకాశం ఇలాగే ఎర్రగా మారింది. అమెరికాకు చెందిన నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్ ప్రకారం, ఆస్ట్రేలియాలోని ఆ ప్రాంత నేలల్లో ఇనుము శాతం అధికంగా ఉంటుంది. తుపాను గాలుల వల్ల ఈ మట్టి గాలిలో కలిసి ఆక్సీకరణకు గురైనప్పుడు, ఆకాశం అంగారక గ్రహంలా ఎరుపు రంగులోకి కనిపిస్తుంది. కాగా, 'అత్యంత తీవ్రమైన తుపాను'గా భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వర్గీకరించిన అర్నబ్ తుపాను, అక్టోబర్ 28న గంటకు 130 కిలోమీటర్ల వేగంతో ఆంధ్రప్రదేశ్ తీరాన్ని దాటింది. దీని ప్రభావంతో భారీ వృక్షాలు నేలకూలాయి, పంటలు, ఇళ్లు నీట మునిగాయి. రవాణా, విద్యుత్ వ్యవస్థలకు తీవ్ర అంతరాయం కలగడంతో పాటు, మత్స్యకార కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోయాయి.

రబీ సాగుపై ఎల్‌నినో పంజా

వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం దేశంలో వ్యవసాయ రంగంపై ఆందోళన పెంచుతున్నాయి. ఇప్పటికే ఖరీఫ్ (వర్షాకాలం) పంటల సీజన్‌ను అతలాకుతలం చేసిన ఎల్‌నినో ప్రభావం ఇప్పుడు రబీ (శీతాకాలం) పంటలపైనా తీవ్రంగా పడుతోంది. ఈ ఏడాది రుతుపవనాల సీజన్‌లో సాధారణం కంటే 13 శాతం తక్కువ వర్షపాతం నమోదు కావడంతో వాతావరణ సమతుల్యత పూర్తిగా దెబ్బతింది. దీని వల్ల పొలాల్లో తగినంత తేమ లేక రైతులు సాగు పనుల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నేలలో తేమ తగ్గడం సహా సాగునీటి లభ్యతపై ఆందోళనల కారణంగా గోధుమలు, శనగలు సహా పలు పంటల సాగు నెమ్మదించింది. ఈ ఎల్‌నినో- రబీ పంటల విత్తనాలు వేసే ప్రక్రియను తీవ్రంగా ప్రభావితం చేసింది. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ తాజాగా విడుదల చేసిన నివేదిక ఈ ఆందోళనకరమైన పరిస్థితుల్ని కళ్లకు కట్టింది.

సగానికిపైగా పడిపోయిన గోధుమల సాగు

సాధారణంగా గోధుమల సాగు కాలం దేశంలో అక్టోబర్ నుంచి నవంబర్ వరకు ఉంటుంది. మార్చి- ఏప్రిల్ నాటికి కోతకు వస్తుంది. అయితే కేంద్ర వ్యవసాయ శాఖ రిపోర్ట్ ప్రకారం గత పంటల కాలం (2025-26) అక్టోబర్ 23వ తేదీ గణాంకాలతో పోలిస్తే, ప్రస్తుత పంటల సంవత్సరంలో (2026-27) గోధుమల సాగు విస్తీర్ణం ఏకంగా 59 శాతం క్షీణించింది. గతేడాది ఇదే సమయానికి దేశంలోని వివిధ రాష్ట్రాల్లో 27 వేల (0.27 లక్షలు) హెక్టార్లలో గోధుమ విత్తనాలు వేయగా, ఈసారి చూస్తే అది కేవలం 11 వేల (0.11 లక్షలు) హెక్టార్లకే పరిమితమైంది. గోధుమలతో పాటు



శనగలు, అన్ని రకాల పప్పుధాన్యాల సాగు విస్తీర్ణం కూడా భారీగా పడిపోయింది. గతేడాది అక్టోబర్ 23 నాటికి 3.77 లక్షల హెక్టార్లలో శనగలు సాగు చేయగా, ఈసారి 2.21 లక్షల హెక్టార్లకే పరిమితమైంది. పప్పుధాన్యాలు, నూనె గింజల సాగు తగ్గడం కూడా ఆహార సరఫరాపై ప్రభావం చూపొచ్చనే ఆందోళన వ్యక్తమవుతోంది.

రాజస్థాన్‌లోనే 58 శాతం తగ్గిన రబీ సాగు

రాజస్థాన్ రాష్ట్రంలో రబీ పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. గోధుమలు, ఆవాలు, బార్లీ, శనగలు, కందులు, బఠానీలు వంటి పంటలు కలిగి గతేడాది ఇక్కడ అక్టోబర్ 23 నాటికి 14.13 లక్షల హెక్టార్లలో సాగు చేశారు. ఈ ఏడాది అదే తేదీ నాటికి చూస్తే 5.93 లక్షల హెక్టార్లలోనే సాగు జరిగింది. ఇక్కడ రికార్డు స్థాయిలో 8.21 లక్షల హెక్టార్ల మేర తగ్గుదల నమోదైంది. ఇది దాదాపు 58 శాతానికి సమానం. తమిళనాడులో కూడా రబీ సాగు విస్తీర్ణం సగానికి సగం తగ్గింది. యూపీలో స్వల్పంగా ప్రభావం కనిపిస్తోంది. మధ్యప్రదేశ్‌లో గతేడాది 0.20 లక్షల హెక్టార్లలో రబీ సాగు కాగా, ఈసారి అసలు నమోదు కాలేదు. ఉత్తరాఖండ్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. కేరళంలో గతేడాది 0.14 లక్షల హెక్టార్లతో పోలిస్తే ఈసారి 0.11 లక్షల హెక్టార్లలో సాగు నమోదైంది. ఇలా దేశవ్యాప్తంగా 2026, అక్టోబర్ 23 వ తేదీ నాటికి చూస్తే రబీ పంటల మొత్తం సాగు విస్తీర్ణం 18.02 లక్షల హెక్టార్లుగా ఉంది. గతేడాది ఇదే తేదీ నాటికి ఇది ఏకంగా 28.26 లక్షల హెక్టార్లుగా ఉండటం గమనార్హం. ఎల్‌నినో కారణాలతో ఈసారి 10.24 లక్షల హెక్టార్ల వరకు తగ్గుదల నమోదైంది. ఈసారి శీతాకాలంలో వరి సాగు విస్తీర్ణం కూడా సగానికి సగం తగ్గింది. ఇదిలా ఉండగా, జొన్న, సజ్జ, రాగులు, ఇతర చిరుధాన్యాలు వంటి వాటి సాగు విస్తీర్ణం మాత్రం 13 వేల హెక్టార్ల నుంచి ఈసారి 23 వేల హెక్టార్లకు పెరగడం విశేషం. అయితే అన్ని రాష్ట్రాల్లో సాగు తగ్గలేదు. కర్ణాటకలో రబీ పంటల సాగు విస్తీర్ణం 1.80 లక్షల హెక్టార్ల నుంచి 1.91 లక్షల హెక్టార్లకు పెరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా 0.23 లక్షల హెక్టార్లతో పోలిస్తే ఈసారి 0.37 లక్షల హెక్టార్లలో సాగు నమోదైంది. భారత వాతావరణ శాఖ గణాంకాల ప్రకారం దేశంలో రుతుపవనాల సీజన్‌లో జూన్- సెప్టెంబర్ మధ్య దేశంలో సాధారణం కంటే 13 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. పంజాబ్‌లో సాధారణం కంటే 38 శాతం, రాజస్థాన్‌లో 22 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. సెప్టెంబర్ చివరినాటికి ఈ రాష్ట్రాల్లోని జలాశయాల్లో నీటి నిల్వలు కూడా తక్కువగా ఉన్నాయి. దేశంలోని మొత్తం గోధుమ సాగు విస్తీర్ణంలో పంజాబ్, రాజస్థాన్ రాష్ట్రాల వాటానే 31 శాతంగా ఉండగా, ఈ రాష్ట్రాల్లోనే ఇప్పుడు ఎక్కువగా సాగు విస్తీర్ణం తగ్గడం ఆందోళన కలిగిస్తోంది.

పోలీసుల లాఠీలకు భయపడొద్దు

నవంబర్ 1న ఇండీ కూటమి తలపెట్టిన చలో దిల్లీ ర్యాలీలో ప్రతిఒక్కరూ పాల్గొనాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. పోలీసులు, లాఠీలకు భయపడాల్సిన అవసరం లేదన్నారు. తమ కుతంత్రాలను ప్రయోగించే దమ్ము బీజేపీకి లేదన్నారు. రాజ్యాంగాన్ని రక్షించుకోవటానికి, దేశాన్ని కాపాడుకోవడానికి కలిసికట్టుగా నడుద్దామని రాహుల్ గాంధీ అన్నారు. ముఖ్యంగా రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా విద్యార్థి సంఘాలన్నీ ఈ మార్చ్‌లో పాల్గొనాలని కోరారు. ఇదో అద్భుతమైన మార్చ్ కాబోతుందని అన్నారు. ఇది కేవలం ఒక నిరసన మాత్రమే కాదని, ఈ దేశ ఆత్మ కోసం చేస్తున్న ప్రదర్శనగా రాహుల్ గాంధీ అభివర్ణించారు. "చలో దిల్లీ రాంలీలా మార్చ్, ఇది ప్రజాస్వామ్యాన్ని రక్షించడానికి, ఓటు చోరీని అరికట్టడానికి, రాజ్యాంగాన్ని రక్షించడానికి చేపట్టిన పాదయాత్ర. ఇది ఏ ఒక్క రాజకీయ పార్టీది కాదు, ఇది భారతదేశ ఆత్మ పాదయాత్ర. నరేంద్ర మోదీ, అమిత్ షా, జ్ఞానేష్ కుమార్‌లతో విసిగిపోయిన ప్రజలందరూ, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరుకునేవారు, రాజ్యాంగాన్ని రక్షించాలని కోరుకునే వారందరూ రావాలి. పోలీసులు, లాఠీల గురించి భయపడకండి. కుతంత్రాలను ప్రయోగించే దమ్ము బీజేపీకి లేదు. మాతో కవాతు చేయండి. రాజ్యాంగాన్ని, దేశాన్ని రక్షించడానికి మనం కలిసి నడుద్దాం. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఇది దేశం కోసం జరుగుతున్న యాత్ర, ఇది మీ యాత్ర. మీరందరూ రండి మనమందరం కలిసి రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని



కాపాడుకుందాం. భారతదేశంపై దాడి జరుగుతోందని, భావ వ్యక్తీకరణపై, ఆలోచనలపై, దాడి జరుగుతోందని మీరు భావిస్తే రాజకీయలతో సంబంధం లేకుండా వచ్చి మాతో చేరండి. ఇది ఒక అద్భుతమైన యాత్ర కానుంది. ఇది మన దేశ ఆత్మను కాపాడేందుకు జరుగుతున్న యాత్ర."

ఖర్గే నివాసంలో ఇండీ కూటమి నేతల మీటింగ్

మరోవైపు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో 'ఇండీ' కూటమికి చెందిన ఎంపీలు సమావేశమయ్యారు. ఖర్గేతో పాటు ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్?, గౌరవ్ గొగోయ్? సహా ఇతర పార్టీల నేతలు పాల్గొన్నారు. శుక్రవారం జరగబోయే 'మాక్ పార్లమెంట్'తో పాటు ర్యాలీ ఏర్పాట్లపై చర్చించారు. మాక్? పార్లమెంట్?లో ప్రధాన ఎన్నికల కమిషనర్ (జజుజ) జ్ఞానేష్ కుమార్‌పై ప్రతీకాత్మకంగా 'అభిశంసన' ప్రక్రియను చేపట్టాలని వారు భావిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని పార్లమెంటరీ కార్యకలాపాల తరహాలో నిర్వహించాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తం ప్రక్రియ ఒక పార్లమెంటు సమావేశంలా ఉంటుందని, ఇందులో అధికార, ప్రతిపక్షాలు ఉంటాయని పార్టీ వర్గాలు చెప్పాయి. సుమారు 40 మంది వక్తలు ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉందని సమాచారం. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే ఈ కార్యక్రమంలో ప్రసంగించనున్నారు. మాజీ లోక్‌సభ స్పీకర్ మీరా కుమార్ ఈ సమావేశానికి అధ్యక్షత వహిస్తారు. ఈ 'మాక్ పార్లమెంట్' తర్వాత నవంబర్ 1న భారీ బహిరంగ సభ (ర్యాలీ) జరగనుంది.

అనేది దేశంలోని మెజారిటీ వర్గాల ప్రజల రాజ్యాంగబద్ధమైన ఓటు హక్కును లాక్కోవడానికి ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా పన్నిన ఒక 'కుట్ర' అని కాంగ్రెస్ ఆరోపించింది. ఈ కుట్రను ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ అమలు చేశారని విమర్శించింది. సీఈసీ జ్ఞానేశ్? కుమార్ పదవి నుంచి వైదొలగాలని, ఎ×=ను నిలిపివేయాలని, ఈసీఐనెట్ పోర్టల్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జ్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ ఎక్స్? వేదికగా తెలిపారు. ఎస్ఐఆర్ పూర్తయిన లేదా కొనసాగుతున్న కనీసం ఆరు రాష్ట్రాల్లో, ఇప్పటివరకు గుర్తించిన అనుమానిత విదేశీయుల సంఖ్య సుమారుగా 1,600 మంది ఓటర్లతో పోలిస్తే చాలా తక్కువ అంటూ పేర్కొన్న మీడియా నివేదికను పోస్ట్ చేశారు.

బంగాళాఖాతంలో కొత్త అల్పపీడనం..

'అర్నబ్' తుపాను సృష్టించిన విధ్వంసం నుంచి ఆంధ్రప్రదేశ్ కోస్తా తీరం ఇంకా కోలుకోకముందే మరో ముప్పు పొంచి ఉంది. బంగాళాఖాతంలో కొత్తగా ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారి రాష్ట్రం వైపు కదిలే అవకాశం ఉండటంతో తీర ప్రాంత ప్రజలు, రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించిన తాజా సమాచారం ప్రకారం, దక్షిణ అండమాన్ సముద్రం పరిసర ప్రాంతాల్లో ఒక అల్పపీడనం ఏర్పడింది. ఇది రానున్న 24 గంటల్లో పశ్చిమ-వాయవ్య దిశగా పయనిస్తూ తీవ్ర అల్పపీడనంగా బలపడనుంది. ఆ తర్వాత మరో 24 గంటల్లో ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండంగా కేంద్రీకృతమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ వాతావరణ వ్యవస్థ మరింత బలపడి ఆంధ్రప్రదేశ్ తీరం వైపు పయనించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో నవంబర్ 2, 3 తేదీల్లో ఉత్తర, దక్షిణ కోస్తాంధ్ర జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇప్పటికే 'అర్నబ్' తుపాను కారణంగా పంట నష్టం, ఆస్తి నష్టంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న కోస్తా జిల్లాల ప్రజలను ఈ కొత్త హెచ్చరిక మరింత ఆందోళనకు గురిచేస్తోంది. రానున్న రోజుల్లో దీని తీవ్రత, కదలికలపై మరింత స్పష్టత వస్తుందని అధికారులు పేర్కొన్నారు.



డిజిటల్ మోసాలకు బ్యాంకులే నష్టపరిహారం చెల్లించేలా జవాబుదారీగా చేయాలి

డిజిటల్ మోసాలు పెరుగుతున్న వేళ సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. డిజిటల్ మోసాల బాధితులకు నష్ట పరిహారం చెల్లించేలా బ్యాంకులను జవాబుదారీగా చేయాలని చెప్పింది. ఒకవేళ బ్యాంక్? తగిన శ్రద్ధ వహించడంలో విఫలమవడం వల్లే మోసం జరిగినట్లు రుజువైతే, డిజిటల్ అరెస్టుల వంటి నేరాల బాధితులకు వారు కోల్పోయిన మొత్తాన్నైనా నష్టపరిహారంగా అందించాలని ఆదేశించింది. బాధితులకు తగిన నష్టపరిహారం అందించేందుకు ప్రతిపాదిత నియంత్రణ చట్రం తప్పనిసరిగా నిబంధనలు కల్పించాలని ధర్మాసనం స్పష్టం చేసింది. డిజిటల్ అరెస్ట్ కుంభకోణం అంశంపై సుమోటోగా విచారణ జరిపిన సీజేఐ జస్టిస్? సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు వ్యాఖ్యానించింది. డిసెంబర్ 31 నాటికి అమల్లోకి రానున్న ఆర్‌బీఐ కేవైసీ సవరణ ఆదేశాలను పరిశీలిస్తామని సుప్రీంకోర్టు తెలిపింది. ప్రతిపాదిత మార్గదర్శకాల పరిధిలోకి వచ్చే ఆర్థిక సంస్థల వివరాలను, బాధితులకు నష్టపరిహారం అందించడానికి పరిశీలిస్తున్న చర్యలను తెలియజేయాలని ధర్మాసనం ఆర్‌బీఐని కోరింది. మోసపోతున్న వినియోగదారుల అసాధారణ లావాదేవీల గురించి సమీపంలోని పోలీస్ స్టేషన్లను అప్రమత్తం చేయడం బ్యాంకుల విధి అని తెలిపింది. ఖాతాదారుని నిర్దరిత లావాదేవీల సరళికి భిన్నంగా ఉండే అసాధారణ లావాదేవీలను తాత్కాలికంగా నిలిపివేయడం, అనుమానాస్పద కార్యకలాపాలపై ఆటోమేటెడ్ రిపోర్టింగ్, లావాదేవీల ప్రామాణికతను నిర్ధరించడానికి భౌతిక ధ్రువీకరణ వంటి తప్పనిసరి నివారణ చర్యల అవసరాన్ని గుర్తు చేసింది. విచారణ సందర్భంగా కేంద్రం, ఇతర అధికారుల తరఫున హాజరైన అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి, గత ఏడాదితో పోలిస్తే నమోదైన డిజిటల్ అరెస్టు కేసులు సుమారు 50 శాతం తగ్గాయని కోర్టుకు తెలిపారు. కోర్టు జోక్యం, ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, విభాగాల సమన్వయ చర్యలు, ప్రజా అవగాహన ప్రచారాల వల్లే ఈ తగ్గుదల సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు.

'విద్యావంతులు డిజిటల్ మోసాలకు ఎలా బలి అవుతున్నారు'

మరోవైపు విద్యావంతులైన పౌరులు కూడా ఇలాంటి డిజిటల్ మోసాలకు ఎలా బలి అవుతున్నారంటూ సుప్రీం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రజా చైతన్య కార్యక్రమాలు, వార్తా కథనాలు, కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ ప్రజలు ఇంకా మోసపోతుండటం పట్ల భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "మేము ఆశ్చర్యపోతున్న విషయం ఏమిటంటే ప్రజలకు ఇంకా ఎందుకు అర్థం కావడం లేదు? బాధితులకు ఏమైంది? ఈ బాధితులు ఇలా ఎలా చిక్కుల్లో పడుతున్నారు? వారికి ఈ ప్రాథమిక విషయం అర్థం కావడం లేదా? మొబైల్‌లో అరెస్టు అవుతామనే భయం ఏమిటి? మీడియాలో దీని గురించి అంతగా ప్రచారం జరుగుతోంది కదా! ఒక ప్రజాస్వామ్య దేశంలో ఉంటూ మొబైల్ ఫోన్ ద్వారానే అరెస్టు చేస్తున్నారని ఎవరైనా ఎలా నమ్మగలరా?" అని అసహనం వ్యక్తం చేశారు. డిజిటల్ అరెస్టులను అరికట్టడానికి చాలా చర్యలు తీసుకుంటున్నప్పటికీ, ఈ సమస్య నిరంతరాయంగా కొనసాగుతోందని తనకు పదేపదే సమాచారం అందుతోందని ఈ కేసులో అమికస్ క్యూరీగా ఉన్న సీనియర్ న్యాయవాది ఎన్.ఎస్. నాప్పినై కోర్టుకు చెప్పారు. గత వారం ఇలాంటి ఘటనతో ఒక మహిళ రూ. 2.5 కోట్లు కోల్పోయిందని ఆమె కోర్టుకు తెలిపారు. "ఈ ప్రాథమిక విషయం వారికి అర్థం కావడం లేదా? మొబైల్ ద్వారా అరెస్టు అవుతామనే భయం ఏమిటి? మొబైల్‌ను గోడకు కొడితే అరెస్టు ఆగిపోతుంది. ప్రజలలో ఏదో లోపం ఉంది. అందులో ఏముందో దేవుడికే తెలియాలి. మిమ్మల్ని మీరే బాధితులుగా చేసుకుంటున్నారు. చదువుకున్న వారందరూ మోసపోతుండటం మాకు నిరాశ కలిగిస్తోంది. మీరే డిజిటల్ పద్ధతిలో అరెస్టు అయితే తర్వాతి తరానికి ఏమి అందిస్తారు? డిజిటల్ అరెస్ట్?పై ఏమైనా ఉత్తర్వులు ఉన్నాయేమో తెలుసుకోవడానికి ప్రజలు కోర్టు వెబ్‌సైట్‌కు కూడా వెళ్లవచ్చు." అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు.

మార్చి నాటికి భారత్‌లో ఎండలతో 55 వేల మరణాల ముప్పు?

భారత్‌కు ఎల్‌నినో రూపంలో మరో వాతావరణ ముప్పు పొంచి ఉందా? రాబోయే నెలల్లో అసాధారణ ఉష్ణోగ్రతలు ప్రాణనష్టాన్ని పెంచే ప్రమాదం ఉందని తాజా పరిశోధన ఆధారిత అంచనాలు హెచ్చరిస్తున్నాయి. అమెరికాలోని షికాగో విశ్వవిద్యాలయానికి చెందిన 'క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్' రూపొందించిన కొత్త ట్రాకర్ ప్రకారం.. 2026 అక్టోబర్ నుంచి 2027 మార్చి వరకు భారత్‌లో అధిక వేడి కారణంగా సాధారణ స్థాయికి మించి సుమారు 55 వేల మరణాలు సంభవించే అవకాశం ఉంది. వీటిలో ఎక్కువ భాగం మార్చిలోనే నమోదయ్యే ప్రమాదం ఉందని అంచనా. ఇది వాతావరణ సమాచారం, ఉష్ణోగ్రతల అంచనాలు, గతంలో వేడికి సంబంధించిన మరణాల మధ్య ఉన్న సంబంధాల ఆధారంగా రూపొందించిన నమూనా అంచనా మాత్రమే. వాస్తవంగా ఎంతమంది మరణిస్తారో ఇది కచ్చితంగా చెప్పడం లేదు. ఎల్‌నినో అంటే పసిఫిక్ మహాసముద్రంలోని మధ్య, తూర్పు ప్రాంతాల్లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడం. దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా గాలుల దిశ, వర్షపాతం, ఉష్ణోగ్రతల్లో మార్పులు వస్తాయి. ఈసారి ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండవచ్చని కొందరు నిపుణులు భావిస్తున్నారు. ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఓ) కూడా ఈ ఏడాది ఎల్‌నినో బలంగా ఉందని, డిసెంబర్‌లో గరిష్ఠ స్థాయికి చేరే అవకాశం ఉందని హెచ్చరించింది. దీని ప్రభావాలు 2027 ప్రారంభం వరకు కొనసాగవచ్చని అంచనా. కొత్త ట్రాకర్ అంచనాల ప్రకారం.. అక్టోబర్ నుంచి వచ్చే ఏడాది మార్చి వరకు ప్రపంచవ్యాప్తంగా అధిక వేడి కారణంగా సాధారణ స్థాయికి మించి సుమారు 3.73 లక్షల మరణాలు సంభవించే అవకాశం ఉంది. ఈ ఆరు నెలల కాలంలో నైజీరియాలో 56 వేల మరణాలు, భారత్‌లో 55 వేల మరణాలు సంభవించవచ్చని అంచనా. ఇండోనేషియాలో 29 వేలు, బ్రెజిల్‌లో 19 వేల మరణాలు సంభవించే ప్రమాదం ఉందని ట్రాకర్ పేర్కొంది. అయితే ఈ అంచనాలు మరణాలు తప్పనిసరిగా జరుగుతాయని చెప్పడం లేదు. ముందస్తు హెచ్చరికలు, తాగునీటి సదుపాయాలు, చల్లదనం కల్పించే కేంద్రాలు, బయట పనిచేసే కార్మికులకు రక్షణ, ఆరోగ్య సేవలను మెరుగుపరచడం ద్వారా ప్రాణనష్టాన్ని తగ్గించవచ్చని పరిశోధకులు సూచిస్తున్నారు.

మహువా మొయిత్రా పిటిషన్ కొట్టివేత

దేశ ఆర్థిక మార్కెట్లలో పెట్టుబడులకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్, ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల పోర్ట్‌ఫోలియోలు, వాటి అసలు లబ్ధిదారుల వివరాలను బహిర్గతం చేయాలని సెబీని ఆదేశించలేమని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ మేరకు ఎవీజ ఎంపీ మహువా మొయిత్రా దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఆర్.మహదేవన్, జస్టిస్ డి.కె.ఉపాధ్యాయలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం కొట్టివేసింది. ఒక ఎంపీగా ఈ అంశాన్ని పార్లమెంటులో ఎందుకు లేవనెత్తలేదని, అక్కడ ఎందుకు చర్చ కోరలేదని ధర్మాసనం ప్రశ్నించింది. పెట్టుబడిదారుల వివరాలను బహిర్గతం చేయటానికి ప్రస్తుతం చట్టపరమైన వ్యవస్థ కానీ ఫ్రేమ్‌వర్క్ లేదని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఇందుకోసం కోర్టు ఒక కొత్త నియంత్రణ ఫ్రేమ్‌వర్క్‌ను సృష్టించాల్సి ఉంటుందని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 కింద తనకు ఉన్న అధికార పరిధిని ఉపయోగించి కోర్టు అలాంటి పనిని చేయలేదని చెప్పింది. అయినా సెబీకి ఆదేశాలు ఇవ్వొచ్చని పిటిషనర్ తరఫు న్యాయవాదులు తెలిపారు. ఈ ఫండ్స్ వెనక ఉన్న అసలు వ్యక్తులు కంపెనీల షేర్ల విలువను అమాంతం పెంచి అమాయక పెట్టుబడిదారులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. అందువల్ల అసలు లబ్ధిదారుల వివరాలు వెల్లడించేలా ఆదేశించాలని కోరారు. కంపెనీల్లో జరుగుతున్న భారీ పెట్టుబడుల వెనుక ఎవరున్నారో తెలుసుకునే హక్కు సాధారణ పెట్టుబడిదారులకు ఉండాలని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా విదేశీ సంస్థల ద్వారా అస్పష్టమైన మార్గాల్లో పెట్టుబడులు వచ్చినప్పుడు ఇది మరింత ముఖ్యమని పిటిషనర్ తరఫు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదించారు. అపారదర్శక ఆర్థిక సాధనాల ద్వారా స్టాక్ మార్కెట్‌ను తారుమారు చేసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సెబీ అనేది సెక్యూరిటీ మార్కెట్లను నియంత్రించే సంస్థ అని, ఏఐఎఫ్, ఎఫ్‌పీఐల కార్యకలాపాలను పర్యవేక్షించడం దాని బాధ్యత అని పేర్కొన్నారు. అయితే, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా అంతిమ లబ్ధిదారుల వివరాలను వెల్లడించడం అవసరమని కోర్టు భావిస్తే, మార్కెట్‌లోని పెట్టుబడుల వెనుక ఎవరున్నారో పౌరులు తెలుసుకునేందుకు వీలుగా ఆదేశించవచ్చని భూషణ్ కోర్టుకు చెప్పారు. ఈ సమస్య కేవలం సెబీ వద్ద సమాచారం ఉండటం లేదా లేకపోవడానికి సంబంధించినది మాత్రమే కాదన్నారు. షేర్లను ఎవరు కొనుగోలు చేస్తున్నారు, విక్రయిస్తున్నారు? ఆ పెట్టుబడుల వల్ల అంతిమంగా ఎవరు లబ్ధి పొందుతున్నారు

రైతుల ఆత్మహత్యలు పట్టవా?

హైదరాబాద్: రాష్ట్రం కరువు పరిస్థితులను ఎదుర్కొంటుంటే మూసీ సుందరీకరణకు ప్రభుత్వం ప్రాధాన్యమివ్వడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రజల అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసే అవకాశం లేకుండా పబ్లిక్ హియరింగ్ నిర్వహించడం ఏమిటని ప్రశ్నించారు. మూసీ ప్రాజెక్టు వివరాలను బహిర్గతం చేయకుండా, ప్రజాభిప్రాయ సేకరణను నామమాత్రంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

ప్రజల గొంతు నొక్కితే ఎలా?

ప్రజల గొంతు నొక్కుతూ పబ్లిక్ హియరింగ్ నిర్వహించడం ఏ విధమైన ప్రజాభిప్రాయ సేకరణ అని కేటీఆర్ ప్రశ్నించారు. రాజ్యాంగ పరిరక్షణ గురించి మాట్లాడే రాహుల్ గాంధీ.. కాంగ్రెస్ పాలిత తెలంగాణలో జరుగుతున్న పరిణామాలను గమనించాలని సూచించారు. ప్రజలకు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వెల్లడించే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. మూసీ ప్రాజెక్టు ముసుగులో వేలాది ఎకరాల భూముల విషయంలో అక్రమాలకు అవకాశం కల్పిస్తున్నారని అధికారుల నుంచి సమాచారం అందుతోందని కేటీఆర్ ఆరోపించారు. ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో అడిగినా ప్రభుత్వం సమాధానం ఇవ్వడం లేదని విమర్శించారు.

కరువును పట్టించుకోరా?

రాష్ట్రంలో రైతులు కరువు పరిస్థితులతో ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం వారి సమస్యలను పట్టించుకోవడం లేదని కేటీఆర్ విమర్శించారు. ఆదిలాబాద్ జిల్లాలో వారం రోజుల్లో నలుగురు రైతులు ఆత్మహత్య చేసుకున్నారని పేర్కొంటూ, రైతుల కన్నీళ్లు తుడవడంపై ప్రభుత్వానికి శ్రద్ధ లేదని ఆరోపించారు. పంటలు ఎండిపోవడం, పశువులకు మేత కొరత ఏర్పడటం వంటి సమస్యలపై దృష్టి సారించాలని కోరారు. హైదరాబాద్‌లో తాగునీటి అవసరాలు పెరుగుతున్నాయని, రోజుకు సుమారు ఏడు వేల ట్యాంకర్ల నీటిని బుక్ చేస్తున్నారని కేటీఆర్ తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో మల్లన్నసాగర్ నుంచి 10 టీఎంసీల నీటిని



తీసుకొచ్చి మూసీ సుందరీకరణకు వినియోగిస్తామని చెప్పడం సమంజసం కాదని విమర్శించారు. సాగు, తాగునీటి అవసరాలకు ప్రాధాన్యమిచ్చిన తర్వాతే సుందరీకరణ వంటి కార్యక్రమాలపై నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

డీపీఆర్ ఎందుకు బయటపెట్టడం లేదు?

మూసీ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్‌ను ప్రభుత్వం బహిర్గతం చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తమ ప్రభుత్వ హయాంలోనే రూ.4 వేల కోట్లతో మురుగునీటి శుద్ధి కేంద్రాల (ఎస్‌టీపీలు) నిర్మాణం చేపట్టామని, మొత్తం ప్రాజెక్టును సుమారు రూ.16 వేల కోట్లతో పూర్తి చేయవచ్చని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఆసియా అభివృద్ధి బ్యాంకు నుంచి రుణం తీసుకుంటున్నట్లు చెబుతోందని, అయినప్పటికీ ప్రాజెక్టు వివరాలను వెల్లడించడం లేదని విమర్శించారు. మూసీ ప్రాజెక్టుకు నిధులు ఎక్కడి నుంచి సమకూరుస్తున్నారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఖజానాలో నిధులు లేవని చెబుతున్న ప్రభుత్వం.. మూసీ సుందరీకరణకు మాత్రం భారీగా ఖర్చు చేసేందుకు ఎలా సిద్ధమవుతోందని ప్రశ్నించారు.

మేడిగడ్డపై చర్యలేవీ?

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించడం లేదని కేటీఆర్ ఆరోపించారు. బ్యారేజీకి సంబంధించిన సమస్యలపై సమగ్ర విచారణ జరిపి, అవసరమైన మరమ్మతులు చేపట్టాలని కోరారు. బ్యారేజీని తిరిగి వినియోగంలోకి తీసుకురావడం తోపాటు కృష్ణా, గోదావరి నదుల్లో తెలంగాణకు రావాల్సిన నీటి వాటాపై ప్రభుత్వం చొరవ చూపాలని సూచించారు. రాష్ట్రంలో నీటి సమస్యలు, రైతుల ఇబ్బందులు, సాగునీటి అవసరాల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ప్రజల అభిప్రాయాలను గౌరవిస్తూ మూసీ ప్రాజెక్టు వివరాలను పారదర్శకంగా వెల్లడించాలని, ప్రజాభిప్రాయ సేకరణను నిబంధనల ప్రకారం నిర్వహించాలని కోరారు.

చామంతి పూలతో లాభాల బాట..

నిజామాబాద్ : మారుతున్న కాలానికి అనుగుణంగా, సంప్రదాయ పంటల సాగుతో నష్టాలను చవిచూస్తున్న రైతులు ప్రత్యామ్నాయ, లాభసాటి పంటల వైపు మళ్లుతున్నారు. ఈ కోవలోనే అనంతపురం జిల్లా నార్పల మండలం వెంకటాంగ్రామానికి చెందిన రైతు రఫీ చామంతి పూల సాగులో అనూహ్య విజయం సాధిస్తున్నారు. మార్కెట్ అవసరాలను, పండగల డిమాండ్‌ను అర్థం చేసుకుని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవచ్చని ఆయన నిరూపిస్తున్నారు. రైతు రఫీ తనకున్న ఆరు ఎకరాల వ్యవసాయ క్షేత్రాన్ని రెండు ఎకరాల చొప్పున మూడు భాగాలుగా విభజించారు. ప్రతి విభాగంలో విడతల వారీగా వివిధ రకాల చామంతి పూలను నాటారు. సాధారణంగా చామంతి సాగును జూన్-జులై నెలల్లో ప్రారంభిస్తారు. దీనివల్ల శీతాకాలంలో, కార్తీక మాసం, పెళ్లిళ్ల సీజన్‌లో అధిక దిగుబడులు వస్తాయి. అయితే రఫీ దసరా, దీపావళి, సంక్రాంతి వంటి ప్రధాన పండగల సీజన్‌ను లక్ష్యంగా చేసుకుని ముందుగానే మొక్కలు నాటారు. దీనివల్ల పండగల సమయంలో పూలకు అధిక గిరాకీ, మంచి ధర లభిస్తున్నాయి.ప్రస్తుతం ఆయన పొలంలో బుల్లెట్ (తెలుపు, పసుపు రకాలు), ఐశ్వర్య, ముస్కిన్ వైట్, పేపర్ ఎల్లో, పేపర్ వైట్, పూర్ణిమా ఎల్లో, పూర్ణిమా వైట్ వంటి వివిధ రకాల చామంతులు సాగవుతున్నాయి. బెంగళూరు, హైదరాబాద్, తెలంగాణ ప్రాంతాల నుండి ఒక్కో మొక్కను రూ. 1.50 చొప్పున కొనుగోలు చేసి, రవాణా, నాటడానికి కలిపి రూ. 2 ఖర్చు అయ్యిందని రఫీ తెలిపారు. వేసవిలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా రాత్రి 12 గంటల నుంచి తెల్లవారుజామున 4 గంటల వరకు కూలీలను పెట్టి మొక్కలను నాటించారు. మొక్కకు మొక్కకు మధ్య ఒక అడుగు



దూరం ఉండేలా జాగ్రత్త పడ్డారు. మొక్కలు నాటిన ఐదు నెలలకు దిగుబడి ప్రారంభమవుతుంది. సాగులో భాగంగా ఎరువులు, పురుగుమందుల వాడకంలో రఫీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. మొదట డీఏపీ, ఆ తర్వాత ట్రిపుల్ 8, ట్రిపుల్ 28 వంటి ఎరువులను ఉపయోగిస్తారు. డ్రిప్ ద్వారా 13-45-13, 12-0-61 వంటి వాటిని అందిస్తూ, మధ్యమధ్యలో న్యూట్రియెంట్స్, ఫార్ములా 6, హ్యూమిక్ పౌడర్ వంటి వాటిని కూడా వాడుతున్నారు. చామంతి పూలకు సాధారణంగా మొగ్గ వచ్చే వరకు తెగుళ్లు పెద్దగా రావు, కానీ మొగ్గ వచ్చిన తర్వాత పురుగులు, తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంటుందని, వాటి నివారణకు అవసరమైన మందులను వాడుతున్నామని రఫీ వివరించారు.చామంతి పూల కోత సుమారు రెండు నెలల పాటు నిరంతరం కొనసాగుతుంది, ఆ తర్వాత మూడో నెలలో దిగుబడి కాస్త తగ్గుతుంది. మొదటి కోతలోనే రెండు ఎకరాల నుంచి ఒక టన్ను పూలు వచ్చాయని, కిలో రూ. 200 చొప్పున రూ. 2 లక్షల ఆదాయం వచ్చిందని రఫీ తెలిపారు. మొత్తం పెట్టుబడి మొక్కలు నాటినప్పటి నుంచి రూ. 2.25 లక్షలు అయ్యిందని, మొదటి కోతతో పెట్టుబడి వెనక్కి వచ్చి, రెండో కోత నుంచి లాభాలు వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మార్కెటింగ్ విషయానికొస్తే, ఉదయం కోసిన పూలను అనంతపురం మార్కెట్‌కు, సాయంత్రం కోసిన పూలను బెంగళూరు, చెన్నై, మైసూరు వంటి పెద్ద నగరాలకు పంపిస్తారు. వ్యాపారులు స్వయంగా పొలానికి వచ్చి పూలను కొనుగోలు చేయడం వల్ల రవాణా ఖర్చులు తగ్గుతాయని తెలిపారు. నాణ్యత ఆధారంగా ధరలు మారుతాయని, మొదటి నాణ్యత పూలకు రూ. 275, రెండో నాణ్యతకు రూ. 150, మూడో నాణ్యతకు రూ. 100 వరకు ధర లభిస్తుందని వివరించారు. ఏ పంట అయినా సరే, నాణ్యత ఉంటేనే లాభాలు వస్తాయని, లేకపోతే పంట వ్యర్థమని రఫీ స్పష్టం చేస్తున్నారు. ఎప్పుడూ ఒకే పంట వేయకుండా, వినూత్నంగా ఆలోచిస్తూ, మార్కెట్‌కు అనుగుణంగా పంటలను ఎంచుకుంటే లాభాలు వాటంతట అవే వస్తాయని రైతు రఫీ తన అనుభవంతో నిరూపిస్తున్నారు.

మెట్రో రెండో దశకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్

హైదరాబాద్ : భాగ్యనగర ప్రజా రవాణా వ్యవస్థలో సరికొత్త విప్లవానికి నాంది పలుకుతూ హైదరాబాద్ మెట్రో రైల్ రెండో దశ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం అధికారికంగా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. నగరం నలుమూలలా శరవేగంగా విస్తరిస్తున్న ట్రాఫిక్ రద్దీని నియంత్రించడంతో పాటు అంతర్జాతీయ స్థాయి కనెక్టివిటీని తీసుకురావడమే లక్ష్యంగా మొత్తం రూ. 24,269 కోట్ల భారీ అంచనా వ్యయంతో ఈ విస్తరణ ప్రాజెక్టును కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ ఆమోదించింది. ఈ ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో 50:50 జాయింట్ వెంచర్‌గా చేపట్టనున్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక ను కేంద్రం క్షుణ్ణంగా పరిశీలించి అనుమతులు మంజూరు చేయడంతో నగరవాసుల దశాబ్దాల నిరీక్షణకు తెరపడింది.ఈ రెండో దశ విస్తరణలో భాగంగా మొత్తం 76.4 కిలోమీటర్ల మేర 5 ప్రధాన కారిడార్లను నిర్మించనున్నారు. శంషాబాద్ విమానాశ్రయం అనుసంధానమే ప్రధాన లక్ష్యంగా రాయదుర్గం నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వరకు 29 కిలోమీటర్ల కారిడార్-4 అతిపెద్ద మార్గంగా రూపుదిద్దుకోనుంది. దీంతో పాటు పాతబస్తీ కనెక్టివిటీని పెంచుతూ ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్లు , మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు 13.4 కిలోమీటర్లు , ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు 7.1 కిలోమీటర్లు , నాగోల్ నుంచి చాంద్రాయణగుట్ట మీదుగా మైలార్‌దేవ్‌పల్లి, ఆరాంఘర్ వరకు 19.4 కిలోమీటర్ల మేర



మార్గాలను అభివృద్ధి చేయనున్నారు. ఈ రూట్లతో నగరంలోని ఐటీ కారిడార్లు, పారిశ్రామిక వాడలు, పాతబస్తీ , శివారు ప్రాంతాలకు నేరుగా మెట్రో అనుసంధానం ఏర్పడనుంది.ప్రాజెక్టు ఆర్థిక రూపకల్పనను పరిశీలిస్తే.. మొత్తం రూ. 24,269 కోట్ల వ్యయంలో కేంద్ర ప్రభుత్వం 18 శాతం రూ. 4,368 కోట్లు , తెలంగాణ ప్రభుత్వం 33 శాతం రూ. 8,008 కోట్లు భరించనున్నాయి. మిగిలిన 48 శాతం నిధులను రూ. 11,653 కోట్లు జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఏజెన్సీ , ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ వంటి అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నుంచి దీర్ఘకాలిక రుణాల రూపంలో సమీకరించనున్నారు. రెండో దశను పూర్తిగా ప్రభుత్వ సంయుక్త యాజమాన్యంలో నిర్మించాలని నిర్ణయించడం ద్వారా పనుల్లో జాప్యాన్ని నివారించేందుకు పటిష్టమైన కార్యాచరణను సిద్ధం చేశారు.ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును రాబోయే నాలుగేళ్లలో, అంటే 2029 నాటికి పూర్తి చేసి నగర ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు గడువుగా నిర్దేశించుకున్నారు. ఫేజ్-2 అందుబాటులోకి వస్తే హైదరాబాద్ మెట్రో నెట్‌వర్క్ దాదాపు 145 కిలోమీటర్లకు పైగా విస్తరించి, దేశంలోనే రెండో అతిపెద్ద మెట్రో వ్యవస్థగా మరింత పటిష్టపడనుంది.

వికసిత్ భారత్‌కు సమష్టి కృషి

-మొదటిపేజీ తరువాయి

కేంద్రం సహకరిస్తోందని, రెండు కొత్త విమానాశ్రయాలకు అనుమతులు మంజూరు చేసిందని పేర్కొన్నారు. ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగేందుకు భారత్ సిద్ధమవుతోందని అన్నారు.

ఆర్ఆర్ఆర్‌తో కొత్త అవకాశాలు

హైదరాబాద్‌లో ఏరోస్పేస్ రంగ అభివృద్ధికి దివంగత రాజీవ్‌గాంధీ పునాది వేశారని సీఎం గుర్తుచేశారు. దేశంలో ఆర్థిక సంస్కరణలకు దివంగత ప్రధాని పీవీ నరసింహారావు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. హైదరాబాద్ చుట్టూ ప్రతిపాదిత ప్రాంతీయ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) నిర్మాణం పూర్తయితే నగర అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

వికసిత్ భారత్‌కు సమష్టి కృషి

2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించేందుకు అన్ని రాష్ట్రాలు సమష్టిగా కృషి చేయాలని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ పిలుపునిచ్చారు. తెలంగాణ నిర్దేశించుకున్న మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యాన్ని ఆయన అభినందించారు. రాష్ట్రాలు సమన్వయంతో పనిచేస్తే దేశ ఎగుమతులు పెరిగి ఆర్థికాభివృద్ధి వేగవంతమవుతుందని పేర్కొన్నారు.

పెట్టుబడులకు అనుకూల రాష్ట్రం

పెట్టుబడులను ఆకర్షించడంలో తెలంగాణ ముందంజలో ఉందని భారత్ బయోటెక్ సీఎండీ సుచిత్ర ఎల్లా అన్నారు. పెట్టుబడుల సాధనకు సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న ప్రయత్నాలను అభినందించారు. ఐటీ, ఫార్మా రంగాల్లో హైదరాబాద్ ప్రత్యేక గుర్తింపు పొందిందని, జీనోమ్ వ్యాలీ నుంచి కోవాగ్జిన్ వంటి టీకా అభివృద్ధి జరిగిందని గుర్తుచేశారు. ఏరోస్పేస్, రక్షణ రంగాల తయారీ, ఎలక్ట్రానిక్స్, విమాన విడిభాగాల తయారీలో హైదరాబాద్‌కు విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు. డిసెంబర్‌లో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ రాష్ట్రంలో పెట్టుబడులకు కీలక వేదికగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

550 ఎకరాలు ప్రభుత్వానివే

-మొదటిపేజీ తరువాయి

సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న న్యాయ వివాదానికి ముగింపు లభించింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మియాపూర్‌లోని సర్వే నంబర్ 100లో 277 ఎకరాల 5 గుంటలు, సర్వేనంబర్ 101లో 273 ఎకరాల 34 గుంటల ప్రభుత్వ భూమిగా రెవెన్యూ రికార్డుల్లో నమోదై ఉంది. ఆ భూములపై హక్కులు కోరుతూ ప్రైవేట్ వ్యక్తులు న్యాయస్థానాలను ఆశ్రయించారు. ఈ కేసుల్లో 1997లో ప్రత్యేక న్యాయస్థానం, 2003లో హైకోర్టు ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పునిచ్చింది. ఆ తీర్పును సవాల్‌చేస్తూ ప్రైవేట్ వ్యక్తులు సుప్రీంకోర్టుకు వెళ్లారు. దాదాపు 23 ఏళ్లుగా ఈ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. 550 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉన్న ప్రభుత్వ భూములపై హక్కులు కోరుతూ ప్రైవేట్ వ్యక్తులు దాఖలు చేసిన అప్పీళ్లను కొట్టివేస్తూ జస్టిస్ సుందరేశ్, జస్టిస్ సతీశ్ చంద్రశర్మతో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించింది. ఆ భూములను జాగీర్దార్ కైసరుద్దీన్ చట్టబద్ధమైన వారసులైన అమీరున్నిషా, ఇతరుల నుంచి చట్టబద్ధంగా పొందామని తమ పేరిట ఉన్న జీపీఏ, సనద్ హక్కులకు ఆటంకం కలగకుండా చూడాలని పిటిషన్‌దారులు కోరారు. రిజిస్టర్డ్ పత్రాలని రద్దు చేసే అధికారం తహసీల్దార్‌కు లేదని వాదించారు.

23 ఏళ్ల భూ వివాదానికి తెర

ప్రభుత్వ పక్షాన వాదించిన సీనియర్ న్యాయవాది శ్రీ వైద్యనాథన్ మియాపూర్ భూములు సర్కారుకే చెందుతాయని స్పష్టం చేశారు. అందుకు సంబంధించిన రెవెన్యూ రికార్డులు, సేత్వార్, క్లాసర్ రిజిస్టర్ గత న్యాయస్థానాల తీర్పులను ఆధారాలుగా సమర్పించారు. ప్రైవేట్ వ్యక్తులు హక్కులు కోరుతూ చూపిన రెవెన్యూ ఎంట్రీల్లో అవకతవకలున్నాయని గత న్యాయస్థానాలు గుర్తించిన అంశాలను కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇరుపక్షాల వాదనలు విన్న సుప్రీంకోర్టు ధర్మాసనం కోట్లాది రూపాయల విలువైన భూములు ప్రైవేట్‌వ్యక్తుల చేతుల్లోకి వెళ్లేందుకు కోర్టు అనుమతించబోదని స్పష్టంచేసింది. ఇలాంటి విషయాల్లో కోర్టు మౌనంగా ఉండలేదని పేర్కొంది. ఈ భూముల విషయంలో ప్రభుత్వం చూపిన చొరవని సుప్రీంకోర్టు ప్రశంసించింది. మియాపూర్ భూముల విషయంలో సుప్రీంకోర్టు తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా రావడంపై అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇన్నేళ్లుగా చేసిన పోరాటానికి ఫలితం దక్కిందని వ్యాఖ్యానించారు.

టి వృథాపై ఫిర్యాదు చేయండి

-మొదటిపేజీ తరువాయి

ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. నగరంలో ఎక్కడైనా నీటి వృథా కనిపిస్తే పౌరులు 'పానీ' యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. ఇందుకోసం నీటి వృథాకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను యాప్‌లో అప్‌లోడ్ చేసే అవకాశం కల్పించారు. ఫిర్యాదులను పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు జలమండలి అధికారులు వెల్లడించారు. నీటిని దుర్వినియోగం చేసిన వారికి జరిమానాలు విధిస్తామని స్పష్టం చేశారు.

ప్రతి ఇంట్లో ఇంకుడుగుంతలు ఏర్పాటు చేయాలి

నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భజలాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. భారీ వర్షాలు కురిసినప్పుడు కూడా నీటిని సద్వినియోగం చేసుకోవడంపై ప్రజలు దృష్టి సారించాలని సూచించారు. ప్రతి ఇల్లు, అపార్ట్‌మెంట్‌లో ఇంకుడుగుంతలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. నీటిని వృథా చేసే అలవాట్లను మార్చుకొని, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని పొదుపుగా వినియోగించాలని పిలుపునిచ్చారు.

'సేవ్ వాటర్ వాలంటీర్'గా అవకాశం

ప్రజలు 'సేవ్ వాటర్ వాలంటీర్'గా నమోదు చేసుకొని నీటి సంరక్షణ కార్యక్రమంలో భాగస్వాములు కావచ్చని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో చురుగ్గా పనిచేసే ఉత్తమ వాలంటీర్‌కు ముఖ్యమంత్రితో బ్రేక్‌ఫాస్ట్ లేదా లంచ్ సమావేశంలో పాల్గొనే అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు.

నగరానికి నీటి కొరత

హైదరాబాద్‌కు రోజుకు సుమారు 100 ఎంజీడీల నీటి కొరత ఉందని జలమండలి వివరించింది. వివిధ జలాశయాల నుంచి సుమారు 60 ఎంజీడీల నీటిని సర్దుబాటు చేస్తున్నట్లు తెలిపింది. దీంతో సరఫరాలో సుమారు 40 ఎంజీడీల కొరత మిగులుతోందని పేర్కొంది. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించాలని, నీటి వృథాను గుర్తిస్తే 'పానీ' యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

ఒకే రోజు పరీక్షలా...

హైదరాబాద్ : తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో రోడ్లు మరియు భవనాల శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పరీక్షల తేదీలు, అలాగే స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నిర్వహించే జూనియర్ ఇంజనీర్ పరీక్షల తేదీలు ఒకే రోజు రావడంతో అభ్యర్థుల నుంచి పెద్ద ఎత్తున విజ్ఞప్తులు అందాయి. నవంబర్ 6, 7 తేదీల్లో జరగాల్సిన టీజీపీఎస్సీ ఏఈ పరీక్ష తేదీలు, నవంబర్ 2 నుంచి 6 వరకు షెడ్యూల్ చేయబడిన ఎస్సెస్సీ జూనియర్ ఇంజనీర్ పరీక్ష తేదీలతో క్లాష్ అవుతున్నట్లు అభ్యర్థులు కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యను తీవ్రంగా పరిగణించిన టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం, ఎస్సెస్సీ చైర్మన్‌తో స్వయంగా మాట్లాడి అభ్యర్థుల ఇబ్బందిని పరిష్కరించేందుకు చొరవ చూపారు.ఈ పరీక్షల క్లాష్‌ను పరిష్కరించే క్రమంలో, ఎస్సెస్సీ జూనియర్ ఇంజనీర్ పరీక్ష తేదీ నవంబర్ 6, 2026గా కేటాయించబడి, టీజీపీఎస్సీ ఏఈ పరీక్ష కూడా అదే రోజు రావడం వల్ల నష్టపోతున్న అభ్యర్థుల కోసం ప్రత్యేక వెసులుబాటు కల్పించారు. నవంబర్ 6వ తేదీన ఎస్సెస్సీ జూనియర్ ఇంజనీర్ (సివిల్) పరీక్షను కలిగి ఉండి, టీజీపీఎస్సీ ఏఈ (సివిల్) పరీక్షకు కూడా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు కొన్ని నిర్దిష్ట పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. అభ్యర్థులు తమ ఎస్సెస్సీ జెఈ హాల్ టికెట్ కాపీ (నవంబర్ 6 తేది ఉన్నది), టీజీపీఎస్సీ ఏఈ నోటిఫికేషన్ అప్లికేషన్ కాపీ మరియు టీజీపీఎస్సీ వన్ టైమ్ రిజిస్ట్రేషన్ ఐడీలను సమర్పించాలని కమిషన్ స్పష్టం చేసింది.ఈ పత్రాలను అక్టోబర్ 30, 2026 సాయంత్రం 5 గంటలలోపు టీజీపీఎస్సీ ఆఫీస్‌లోని హెల్ప్ డెస్క్ ద్వారా లేదా ష్టవశ్రీజూటవబఎఏబిణజూబజఞ.ణనీల.తిని మెయిల్ ఐడీకి పంపాలని సూచించారు. అభ్యర్థులు ఏ ఒక్కరు కూడా మంచి అవకాశాన్ని కోల్పోకూడదనే ఉద్దేశంతో పరిశీలన తర్వాత సాధ్యమైనంత వరకు నవంబర్ 7, 2026న టీజీపీఎస్సీ ఏఈ పరీక్షను రాయడానికి తగిన ఏర్పాట్లు చేయనున్నట్లు కమిషన్ అధికారికంగా వెల్లడించింది.

‘కల్ట్’ రిలీజ్ ట్రైలర్.. రక్తపాతం, భయంకరమైన హత్యలతో విశ్వక్ సేన్ విశ్వరూపం!



జబర్దస్త్ । టాలీవుడ్ నటుడు విశ్వక్ సేన్ మరోసారి దర్శకుడిగా తన సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు. ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన తాజా చిత్రం ‘కల్ట్’ ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమైంది. భారతీయ సినిమాలో తొలి స్లాషర్ చిత్రంగా ప్రచారం పొందుతున్న ఈ సినిమాకు ‘ఏ’ సర్టిఫికెట్ లభించింది. థియేటర్లలో విడుదలకు కొన్ని గంటల ముందు చిత్రబృందం రిలీజ్ ట్రైలర్‌ను విడుదల చేసింది. కత్తిపోట్లు, కోతలు, భయపెట్టే సన్నివేశాలతో నిండిన ఈ ట్రైలర్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఇప్పటికే విడుదలైన తొలి ట్రైలర్‌లో సినిమా నేపథ్యాన్ని పరిచయం చేస్తూ, ఓ పార్టీలో జరిగే హింసాత్మక ఘటనల గురించి చూపించారు. తాజాగా వచ్చిన రిలీజ్ ట్రైలర్‌లో మాత్రం విశ్వక్ సేన్ పోషించిన డీఎస్పీ సంకల్ప్ నాయక్ పాత్రకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. గోవాలో స్థానికులు స్థానికేతరులను, ముఖ్యంగా తెలుగు వారిని ఇబ్బందులకు గురిచేయడాన్ని సంకల్ప్ సహించడు. వారిని రక్షించాలనే ఉద్దేశంతో గోవాకు వెళ్లిన అతడి చుట్టూ కథ తిరుగుతుంది. ట్రైలర్ చివర్లో పార్టీలో అతడు సాగించే హత్యాకాండను చూపించారు. యాక్షన్‌తో పాటు స్లాషర్ తరహా సన్నివేశాలు ట్రైలర్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. సంకల్ప్ నాయక్ పాత్రలో విశ్వక్ సేన్ దూకుడు, క్రూరత్వం స్పష్టంగా కనిపిస్తున్నాయి. పాత్రకు తగ్గట్టుగా ఆయన ఆగ్రహభరితమైన నటన ఆకట్టుకుంటోంది. హింసాత్మక సన్నివేశాలను కూడా ప్రత్యేకమైన శైలిలో, కొంత కార్టూన్ తరహా రూపంలో తెరకెక్కించడంతో సినిమాపై ఆసక్తి పెరిగింది. ఈ చిత్రంలో మురళీ శర్మ రాజకీయ నాయకుడిగా, శ్రీకాంత్ అయ్యంగార్ సీనియర్ పోలీసు అధికారిగా నటిస్తున్నారు. గాయత్రి భరద్వాజ్, తారక్ పొన్నప్ప తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. తారక్ సినిమాస్ పతాకంపై సందీప్ కకరాల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రవి బస్రూర్ సంగీతాన్ని అందించగా, తరుణ్ భాస్కర్ సంభాషణలు రాశారు. విడుదల ట్రైలర్‌లో కనిపిస్తున్న రక్తపాతం, వేగవంతమైన యాక్షన్ సన్నివేశాలు సినిమాపై అంచనాలను పెంచుతున్నాయి. మరి ‘కల్ట్’ ప్రేక్షకులను ఏ మేరకు ఆకట్టుకుంటుందో చూడాలి.



అది సీక్వెల్ కాదు, అక్కడితోనే క్లోజ్.. ధనుష్ ‘ఓం’ సినిమాపై క్లారిటీ ఇచ్చిన డైరెక్టర్!

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ హీరోగా, టాలెంటెడ్ డైరెక్టర్ రాజ్ కుమార్ పెరియసామి దర్శకత్వంలో తెరకెక్కుతున్న హై-వోల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ ‘ఓం -- చాప్టర్ 1 ‘అమరన్’ వంటి బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత రాజ్ కుమార్ పెరియసామి తెరకెక్కిస్తుండటంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి దర్శకుడు రాజ్ కుమార్ పెరియసామి వెల్లడించిన ఆసక్తికరమైన విషయాలు సినిమాపై మరింత హైప్‌ను పెంచుతున్నాయి. ‘ఓం’ చాప్టర్ 1, చాప్టర్ 2 సినిమాల మధ్య ఎలాంటి సంబంధం లేదని దర్శకుడు స్పష్టం చేశారు. ఈ సినిమా టైటిల్‌లో ‘చాప్టర్ 1’ అని ఉన్నప్పటికీ, ఇది రెండు భాగాలుగా కొనసాగే సీక్వెల్ కాదని, మొదటి భాగంతోనే ఈ కథ పూర్తిగా ముగిసిపోతుందని ఆయన వెల్లడించారు. అలాగే తాము ఈ చిత్రాన్ని కేవలం ఒక భాషలో మాత్రమే కాకుండా, ద్విభాషా చిత్రంగా ప్లాన్ చేయనప్పటికీ.. తమిళ మరియు తెలుగు ప్రేక్షకులు ఇద్దరూ దీన్ని తమ సొంత స్ట్రెట్ సినిమా అనే అనుభూతిని పొందుతారని ధీమా వ్యక్తం చేశారు. ఈ చిత్రంలో నటీనటుల పాత్రలు అంత్యంత ప్రత్యేకంగా ఉంటాయని దర్శకుడు తెలిపారు. ముఖ్యంగా నేచురల్ బ్యూటీ సాయి పల్లవి (ఏఎస్‌పీ నిత్యా రెడ్డి పాత్రలో) మరియు టాలెంటెడ్ యంగ్ హీరోయిన్ శ్రీలీల ఇద్దరి పాత్రలు వారి ఇప్పటివరకు చేసిన సినిమాలకు, వారి కంఫర్ట్ జోన్‌కు పూర్తిగా భిన్నంగా, అవుట్ అండ్ అవుట్ కొత్తగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో ధనుష్‌తో పాటు మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి, దిగ్గజ నటుడు నసీరుద్దీన్ షా వంటి ప్రముఖులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. వండర్‌బార్ ఫిలింస్ మరియు ఆర్‌టేక్ స్టూడియోస్ పతాకాలపై అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తున్నారు. అన్ని హంగులను పూర్తి చేసుకుని ప్రపంచవ్యాప్తంగా నవంబర్ 20న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది.

‘ఆ సీన్లు నాకూ నచ్చలేదు’.. పెద్ది సినిమాపై జాన్వీ తీవ్ర వ్యాఖ్యలు!



టాలీవుడ్ హీరో రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో తెరకెక్కిన చిత్రం ‘పెద్ది’. ఈ సినిమాలో హీరోయిన్‌గా నటించిన జాన్వీ కపూర్ పాత్రపై గతంలో పలు విమర్శలు వచ్చాయి. ముఖ్యంగా సినిమాలో మహిళలను చూపించిన తీరుపై సోషల్ మీడియాలో చర్చ నడిచింది. ఈ నేపథ్యంలో జాన్వీ కపూర్ ఈ వివాదంపై స్పందించారు. తాజాగా ‘కాఫీ విత్ కరణ్’ షోలో మాట్లాడిన ఆమె.. సినిమాలో తన రోల్, మహిళలను చూపించిన విధానంపై వచ్చిన విమర్శలు నిజమేనని ఓపెన్‌గా ఒప్పేసుకున్నారు. ‘పెద్ది మూవీ చిత్రీకరణ సమయంలోనే కొన్ని సన్నివేశాల విషయంలో అసౌకర్యంగా అనిపించింది. వాటిపై మరింత గట్టిగా నా అభిప్రాయాన్ని వ్యక్తం చేసి ఉండాల్సింది. కొన్ని సన్నివేశాల విషయంలో మరింత బలంగా మాట్లాడాల్సింది. కొన్ని సీన్లు నాకూ నచ్చలేదు. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు మళ్లీమళ్లీ జరగకుండా చూసుకోవడమే నాకున్న ఏకైక మార్గం. దీని గురించి ఇప్పటివరకూ నేను స్పందించకపోవడానికి కారణం ఏంటంటే.. ఆ సినిమా కోసం చాలా మంది కష్టపడ్డారు. అందుకే మౌనంగా ఉన్నాను’ అని తెలిపారు. పెద్ది థియేటర్లలో విడుదలైన తర్వాత జాన్వీ పాత్రపై, ముఖ్యంగా కొన్ని సన్నివేశాలపై ప్రేక్షకుల నుంచి అప్పట్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. మహిళలను కొన్ని సీన్లలో చూపించే విధానంపై సోషల్ మీడియాలో నెటిజన్లు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విమర్శలపై దర్శకుడు బుచ్చిబాబు సైతం గతంలో స్పందించారు. ఆ తర్వాత వెంటనే స్పందించి వివాదాస్పద సన్నివేశాలను సినిమా నుంచి తొలగించారు.

printed by SHIVA D , published by SHIVA D and owned by SHIVA PRASAD , printed at Rathna graphics offset printers, 2-3-703/7, Tirumala nagar colony ,Ambeerpet, police line hyd-500013 TS.
published at door no: 5-12, badyathand, Noothanakal mandal, thallasingaram, suryapet- 508221 TS, editor: SHIVA PRASAD. gmail : mivartanews@gmail.com, cell : 9515342857, TGBIL/25/A0512